

ఆంధ్రసచిత్రవారపత్రిక
8-5-70



"పాలు పంచదారా!"
"కాదండీ మిల్క్‌మేడ్!"
ప్రశస్థమైన
పూర్తి మీగడ పాలు—
కాఫీలో, టీ లో
కమ్మదనానికి;
తాజా పాలకి బదులుగా
వాడెందుకు ఆదర్శ
ప్రాయమైనది.
MILKMAID
REGISTERED
TRADE MARK
SWEETENED
Best Full Cream Milk
FULL CREAM CONDENSED MILK
మీగడ పాలు, పంచదారల సమమైన
మిళితమే నెస్‌లేవారి మిల్క్‌మేడ్ కండెన్స్‌డ్
మిల్క్—టీ లో, కాఫీలో కమ్మదనానికి.
విటమినులు A, D లతో నిండిన మిల్క్‌మేడ్
పాలకి బదులుగా వాడేందుకు ఆదర్శ
ప్రాయమైనది, కమ్మగానుండి మీ ఎదిగే శిశువుకు
అవసరమైన ఆహారాన్నిస్తుంది, అత్యవసరమైన
శక్తినిస్తుంది. నిరపాయకరమై, స్వచ్ఛమైనది,
తాజాయైనది మరియు ఎంతో సదుపాయకరమైనది.
స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, తీపిచేయ బడిన
పాలకై రెండు భాగాల నీళ్ళలో ఒక భాగం
మిల్క్‌మేడ్ కలపండి.
మిల్క్‌మేడ్—
రుచికి ఆరోగ్యానికి మంచిది
నెస్‌లేవారి ఉత్పాదనము.

మీకు ఏ కారణము వల్ల తల నొప్పి వచ్చినా అది ఒకే ఒక సారిడన్‌తో మటుమాయమై పోతుంది

ఒకే ఒక సారిడన్ నొప్పిని త్వరగా పోగొట్టుతుంది. ఇంతేగాక, అందులో వున్న ప్రత్యేక పదార్థముల వలన సారిడన్ తల నొప్పి, ఒంటి నొప్పి లేక పళ్ల నొప్పితో బాటు కలిగే భారమును పోగొట్టును మరియు మీకు హాయి నవోత్సాహములను కలిగించును అదే సారిడన్ ప్రత్యేకత!

సారిడన్

'రోష్'



ఉత్తరాలు

కథలు

శ్రీమతి పరిమళాసోమేశ్వర్ రచియించిన 'కవిపత్ని' కథ చాల బాగుంది. సహజంగా స్త్రీకి తన భర్త వేరొక స్త్రీతో మాట్లాడితే లేనిపోని అనుమానాలతో ఈర్ష్యలతో మనస్సునిండి ఉంటుంది. ఇంక కవిపత్ని వేరే చెప్పాలా! స్త్రీకి ఎందుచేతో అంత ఈర్ష్య! రచయిత్రికి మా అభివందనములు.

వాణిశ్రీ యింటర్‌వ్యూ, బాబు కార్ట్యూన్స్ కూడా బాగున్నాయి.

—గోదావరి శ్రీరామమూర్తి, సూర్యం, [మురమండ]

* * *


ఈవారం [17—4—70] ఆంధ్రపత్రికలో మీరు ప్రచురించిన 'నేను ఎందుకు బ్రతికాను' అన్న కథ చాలా బాగుంది. రచనాశైలి ఎంతో అద్భుతంగా వుంది. కథ చదువుతున్నంతసేపు మే నెలలో మనకు సంభవించిన పెనుతుఫానులో చిక్కుకుని మరణించిన వారి ఆర్తనాదాలే వినిపించి నట్లనిపించింది. కథ ఎంతో సహజంగా చిత్రించారు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు గారు. వారికి నా అభినందనలు

—తమ్మారెడ్డి సత్యవతి, [విజయవాడ]

సినిమా బాలట్

శ్రీ యన్. ప్రకాశరావ్, బెంగుళూరు గారి వుత్తరంలో చదివిన తర్వాత ఈ లేఖ వ్రాయ లేకుండా వుండలేక పోవుచున్నాను. శ్రీ యన్. టి. రామారావు బాలెట్ పోటీలనుండి విరమించుకొన్నందు వల్ల శ్రీ అక్కినేని నాగేశ్వరరావు వుత్తమ నటుడుగా యెన్నిక కావటం జరిగిందని ఆయన అనుకోవటం అవివేకం కాగా ఆయన [ప్రకాశరావు గార్కి] యన్. టి. రామారావుగారి భక్తుడని సులభంగా తెలియ పర్చారు. నటులంటె వీరిద్దరే [యన్. టి. ఆర్., ఎ. యన్. ఆర్.] అని చాలామంది భావం అని వాపోయారు. మరి ఆయన అభిప్రాయంలో చాలామంది నటులున్నా [ఎక్స్ట్రాలలో సహా అంతా నటులే] రనుకొంటాను. యేమైనా ఇలాంటి అసూయతో కూడిన వుత్తరాలకి మీ [మా] పత్రికలో స్థానం లేకుండా చేయాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

—యం. ఆర్. కె. గాంధి, [విజయవాడ]


Sandak Samson
శాండక్ శామ్సన్
గొప్ప నిగ్గులాంటి జోడు
మీరు ఎలా నడిచినా, ఏమి చేసినా శాండక్ శామ్సన్
ఆకారం చెక్కు చెదరదు. ఎప్పుడూ క్రొత్తగానే కనిపిస్తుంది.
మీకోసం నేడే ఒక శామ్సన్ జోడు కొనుక్కోండి.
ఎప్పుడూ క్రొత్తదానిలా వుండే జోళ్లలో అది ఛాంపియన్.
శామ్సన్
బ్లాక్ & బ్రౌన్
సైజు 4-9
రూ. 10.95
Bata
శాండక్ *
కెమిలాన్ *
అవి బాటా శాండక్స్
Bata
అని తెల్సుకోండి

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన స్వంత చిరునామాగల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికి కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరింపబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాగల, తగు మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీలు పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణించబడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్లు తిప్పి పంపకోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయములో ఎటువంటి బాధ్యతని స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

న్యూస్ ఏజంట్లు కావలెను

ఈ క్రింది ఊళ్లలో ఆంధ్రపత్రిక ఆంధ్ర సచిత్ర వారపత్రిక, భారతులను వారి స్వంత బాధ్యతపై విక్రయించుకొనుటకు ధరావతు (Deposit) చెల్లించ గలిగిన ఏజంట్లు కావలెను.

ఊరు		జిల్లా
కోట ఉరట్ల	—	విశాఖపట్నం
చిట్టివలస	—	,,
ఆలమండ	—	,,
నెల్లిమర్ల	—	,,
కాశీంకోట	—	,,
వ్యాపల్లి.	—	,,
కుమిలి	—	,,

వివరాలకు:
మేనేజరు
ఆంధ్రపత్రిక, మద్రాసు 1.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 8-5-'70
శ్రీ సాధారణనామ సం|| వైశాఖ శు. తదియ
సంపుటము: 63 సంచిక: 34

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టు ద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం: 'ప్రేమ్ పూజారి'లో వహీదా రెహమాన్



ఆలస్యమైనాం అంతా ఒకేసారి పొడుగ్గా పెరిగాం
విశాఖపట్నం ఉక్కు కర్మాగారం
సేలం ఉక్కు కర్మాగారం
హోస్పేట ఉక్కు కర్మాగారం
ఉత్తర ప్రదేశ్‌లో 60 మంది ఘనమైన మంత్రివర్గం
పన్ను కట్టేవారు
పన్ను కట్టేవారిపై బరువు
ఆ ఆట నాదగ్గర ఆడొద్దు
పాకిస్తాను
గిల్‌గిట్‌లో చైనా సైన్యం

చర్చలు, గ్రాంట్లు, నూనె, నిరుద్యోగం...

బ్రిటన్‌లో 'ప్రజావ్యయం' గురించి 'పచ్చ కాగితం' ఒకటి వెలువరించారు. అందులో ఒకచోట ఇలా ఉంది—

'చర్చలలో సగం అంచనాల మీద ఆధారపడి ఉంటాయని చెప్పుకునే ధోరణి కూడా ఉండేదు. శాసనసభ[ల]లో వోట్లు ఆర్థిక విషయాల కోసం కాక పరిపాలనా విధానాన్ని అరికట్టటానికి ఉపయోగింపబడుతూ ఉంటాయి... డబ్బుని మంజూర్ చేసే హక్కుని శాసనసభ[లు]వదుల కోరాదనీ, ఇది రాజ్యాంగానికి సంబంధించిన అతి ముఖ్యమయిన విషయాలలో ఒకటనీ చెప్పబడుతోంది...'

ఇదంతా భారతదేశానికి వర్తిస్తుంది. ఒకప్పుడు శాసనసభలో లభ్యమయ్యే సమాచారాన్ని ఇప్పుడు ప్రభుత్వం మరుగు పెడ్తోంది. వ్యయానికి సంబంధించినంత దాకా ఇది మరీ నిజం. వ్యయానికి సంబంధించిన సమాచారాన్ని దాయటం మొదలు పెట్టింది విదేశాంగ వ్యవహారాల శాఖ; ఈ శాఖ ధోరణి నెగ్గుతున్నదని గ్రహించి తక్కిన శాఖలు కూడా అదే ధోరణిని అవలంబించటం ప్రారంభించాయి.

సాంప్రదాయం

అసలు చర్చ పద్ధతులు కూడా— గ్రాంట్ల సంబంధించినంత దాకా స్వాతంత్ర్యం మునుపు ఎలాగ జరిగేవో అలాగే జరుగుతున్నాయి. లోకసభ వ్యవహార సంఘం వారు కార్యక్రమాన్ని తయారు చేస్తారు. ఈ కార్యక్రమంలో అప్పుల కేటాయింపు వివరాలు ఉంటాయి. చర్చకి సరయిన వ్యవధి ఉన్నా లేకపోయినా మొత్తాలు మంజూరు అవటానికి వ్యవధి ఉంటుంది కాబట్టి 'కోతలు' జరుగుతూనే ఉంటాయి. ఇది సాంప్రదాయం.

1968లో ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ నియంత్రణ, పార్లమెంటు వ్యవహారాల, ప్రణాళికా శాఖల కోరికలు; యిక రాజ్యసభల కార్యదర్శుల కోరికలు; ఉపాధ్యక్షుడి కోరికలు ఇవన్నీ కొయ్యబడ్డాయి.

పోయిన సంవత్సరం ఆరుగురు మంత్రుల శాఖల మీద కోతపడింది. ఇవి రవాణా, పార్లమెంటు వ్యవహారాలు, యాత్రలు సివిల్ వయిమానిక శాఖ, కుటుంబ నియంత్రణ, అణుశక్తి శాఖలు.

అంటే కొన్ని శాఖల గ్రాంట్లు పరిశీలనకి లోనవటం లేదన్న మాట.

కమ్యూనిస్టుల వైఖరి

పెట్రోలియమ్, గనులు, లోహం శాఖ గ్రాంట్లు మంజూరు అయ్యే సమయంలో సభ ఇంచుమించు ఖాళీగా ఉంది. కమ్యూనిస్టులు ప్రభుత్వ పక్షం కాబట్టి చర్చలలో పాల్గొననే లేదు.

కేంద్రమంత్రి డా॥ త్రిగుణసేన్ తమకి లభ్యమయిన సాధనాలతో ఉద్యోగ నిర్వహణ చేస్తున్నారు. ఆయన ఇష్ట ప్రకారం జరిగి ఉంటే బరవుని నూనె శుద్ధి కర్మగారం ఇంత పెరగాలనే నిర్ణయం తీసుకొనడం జరిగేది కాదు.

ఆయన శాఖ గ్రాంట్ల మీద జరిగిన చర్చలలో డా: సేన్ కొన్ని 'విధాన ప్రకటన'లని చేశారు. ఎస్సో, కాల్టెక్స్, బర్మా షెల్ కంపెనీలని జాతీయం చెయ్యటం లేదన్నారు 1—1—1970కి భారతదేశం 2 కోట్ల టన్నుల నూనెని శుద్ధి చెయ్యగల స్థితిలో ఉందనీ, ఇందులో 80 లక్షల టన్నులు మాత్రమే ప్రయివేటు నూనె కంపెనీల చేతులలో ఉన్నదనీ ఆయన అన్నారు. అంటే ప్రభుత్వరంగందే పయి చెయ్యి అన్నమాట. విదేశీ నూనె కంపెనీలు 1950లో నిర్మించినవనీ, అవి సాంకేతికంగా అత్యాధునికమయినవి కావనీ, వీటిని జాతీయం చెయ్యటం వల్ల అనవసరంగా విదేశీ మారకంలో ద్రవ్యవ్యయం కలుగుతుందనీ డా: సేన్ అన్నారు. జాతీయం చేస్తే కూడా ముడి నూనెని చవక్కగా కొనవలసి వస్తుంది. భారతదేశంలోని విదేశీ కంపెనీలని బెదిరించి ముడిసరుకు ధరలని తగ్గించగలిగారు. జాతీయం చేసే ముందు ముడి నూనెని కొని సరఫరా చెయ్యగలిగిన సంస్థ ఒకటి ఉండాలి. ప్రయివేటు కంపెనీలు శుద్ధికర్మాగారాలని పెట్టే సమయంలో ఈ విషయమయి ఎంతో లోదృడ్డాయి. నేటి పరిస్థితి వేరు. నూనె కోసం వెతకటం, తవ్వటం, శుద్ధిచెయ్యటం, అమ్మటం— ఇవన్నీ భారతీయులకి తెలుసు ఇప్పుడు. అందుచేత ప్రయివేటు కంపెనీల సహకారం పొంది దేశానికి లాభం కలిగించే ఒప్పందాలు చేసుకుంటే అసలు జాతీయం చెయ్యటమే అవసరంలేదు. ఇదంతా కూడా డా: సేన్ ప్రకటనలో ఇమిడి ఉన్నదే.

రష్యా ఆధికారం

ఆయన ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ డా: సేన్ తమ శాఖమీద రష్యా అధికారాన్ని సడలిస్తూ వచ్చారు. 'కలకత్తా కింద అంతా నూనే' అన్న ప్రచారం నిజం కాదని తెలిసిన తర్వాత ఆయన 'డిగోల్యెర్ ఎండ్ మెక్నాటెక్' అనే అమెరికన్ సంస్థని పిలిచి భారతదేశంలో నూనె పరిశ్రమ మంచిచెడ్డలని పూర్తిగా అనుశీలించి ఒక నివేదిక తయారు చెయ్యమన్నారు.

ఈ సందర్భంలో గుజరాత్ శుద్ధి కార్మాగారం యొక్క అనశీలన చాలా ముఖ్యం అవుతుంది ఎందుచేతనంటే, అంకలేశ్వర్ నూనె గనులు ఎండిపోతున్నాయి; కాంబేఖాతం త్రవ్వకాలు అనవసరంగా ఆలస్యం అవుతున్నాయి. రష్యన్లకి సముద్రంలోతు ప్రదేశాలలో తవ్వటం రాదని వారే ఒప్పుకున్నారు. ఇప్పుడు వారు కాంబేలో తవ్వుతున్నారంటే అది భారతదేశం కర్చుమీద వారు కొత్తవిద్య నేర్చుకు దామని ప్రయత్నిస్తున్నారన్న మాట. రష్యన్లకి సముద్రంలో తవ్వకం అనుభవం కాస్పియన్ సముద్రంలో మాత్రమే ఉంది, అక్కడ అలలు అంగుళాల ఎత్తువి. కాంబే ఖాతం అలలు అడుగుల ఎత్తువి కాంబేఖాతం అల్లకల్లోలంగా ఉండేఖాతం ప్రపంచంలో కల్లోలంగాఉండే వాటిలో రెండవది. (మొదటిది మెక్సికో ఖాతం) తమ ఉపాయంవల్ల రష్యన్లు కర్చు లేకుండా కొత్తవని నేర్చుకోవడమేకాక అమెరికా ఇక్కడికి రాకుండా చూడగలిగారు. సముద్రంలోతు ప్రదేశాలలో తవ్వే సామర్థ్యం సామగ్రి అమెరికన్లకి మాత్రమే ఉన్నాయని ప్రధానమంత్రికి కూడా తెలుసు.

అమెరికా పాత్ర

ఈ రకం తవ్వకాలలో అమెరికన్ల ప్రత్యక్ష ప్రవేశం లేకుండా తగిన సాంకేతిక నైపుణ్యం తెచ్చుకు రావటానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డా. సేన్ వివరంగా చెప్పిన ఉపాయం సారాంశం ఇది—

1. తవ్వకానికి కావలసిన యంత్రసామగ్రి ప్రభుత్వమే సంపాదించుకోవాలి.

2. దీనిని సంపాదించుకొనటానికి విదేశీ సహకారం కోసం వెతకవచ్చు.

3. వీలయితే ఈ సామగ్రిని ఇక్కడే తయారు చెయ్యాలి. ఈ లక్ష్యం కోసం కొన్ని జపాన్, అమెరికన్, ఫ్రెంచి కంపెనీలతో మంతనాలు జరపబడుతున్నాయి.

4. తగిన సాంకేతిక జ్ఞానం అబ్బటానికి భారతీయ ఇంజనీర్లని విదేశాలకి పంపుతున్నారు.

1971 నాటికి...

ఈ కార్యక్రమం సక్రమంగా జరిగినట్లయితే 1971 కి భారతదేశమే తవ్వకాలు మొదలు పెట్టవచ్చు. అప్పటికి మనదేశం 2.25 కోట్ల టన్నుల నూనె శుద్ధి చెయ్యగలిగే పరిస్థితిలో ఉంటుంది.

1969 లో భారతదేశంలో 62 లక్షల 23 వేల టన్నుల ముడి నూనె తయారు అయిందిట. ఇందులో 30 లక్షల చిల్లర అంకలేశ్వర్ నుంచి వచ్చినది. 1978—79 కి 30 లక్షలు కాస్తా 14 లక్షలకి తగ్గిపోతాయిట.

ఆలస్యం అయిన కొద్దీ రష్యా అధికారం ఎక్కువ అవుతుందని స్పష్టం అవుతుంది. ఏది ఎలాగ ఉన్నా భారతదేశం ముడిసరుకుని బాగా దిగుమతి చేసుకొనడం తప్పదు.

డా. సేన్ ఇటీవలే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేత ఇరాన్ నుంచి 50 లక్షల టన్నుల ముడి సరుకు కొనిపించారు. [ఒక బారెల్‌కి 1.26 డాలర్ల చొప్పున.] రెండేళ్ళలో బరవుని శుద్ధి కర్మాగారం ఇరాన్ ముడిసరుకునే శుద్ధి చెయ్యటానికి మారవలసి రావచ్చు.

దేశంలో నిరుద్యోగ సమస్య వల్ల బాధపడే విద్యావంతులని గురించి డా. సేన్ మాట్లాడారు. ఉద్యోగంలేని పట్టభద్రుల ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సరుకుని పంపిణీ చెయ్యటాని! నిశ్చయించబడినదన్నారు. ఈ విషయమంల్లో జాతీయం అయిన బాంకులు కూడా సహాయం చేస్తాయిట. ఈ 'పథకం' కింద 4000 మంది పట్టభద్రులు లాభం పొందుతారని అంచనా.

గ్రామాలలో తగిన సాంకేతికాభివృద్ధికి కృషి చేసే పట్టభద్రులకి రు. 300 నెల భత్యం ఇచ్చే పథకం ఒకటి ఫెర్టిలయిసర్ కార్పొరేషన్ తయారు చేస్తోంది.

పెట్రోలు పరిశ్రమ కింద ఎన్నో చిన్నపరిశ్రమలు నెలకొల్పటానికి ప్రభుత్వం నిశ్చయించుకున్నది.

గ్రామాలలో...

గ్రామీణ-ప్రాంతాలలో డీసెల్ పంపులని వాడే 'తేలిక డీసెల్ నూనె' అమ్మకం డిపోలని నెలకొల్పటానికి కూడా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రయత్నిస్తోంది. పోయిన ఏడు ఈ సంస్థ ఇటువంటివి 265 అంగళ్లని నెలకొల్పింది. కొన్నిటిలో 'మెకానిక్' లనికూడా నియమించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

డీసెల్, లూబ్రికేషన్ నూనెలకి సంబంధించిన ఇతర సౌకర్యాలు చేకూర్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ●

అంతరిక్షంలో చెయినా

అత్యధిక జన సాంద్రత గల చైనా కూడా అమెరికా, రష్యాలతో పాటు అంతరిక్ష యుగంలో అడుగు పెట్టింది. ఏప్రిల్ 24 న మొట్టమొదటి సారిగా చైనా భూకక్ష్యలో పరిభ్రమించే ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది. దీనిబరువు 173 కి. గ్రా. లు. ప్రయోగానంతరం రెండు రోజుల తర్వాత ఉపగ్రహం ఏ విధమైన వొడిదుడుకులూ లేకుండా ప్రయాణం చేస్తూందని, దానిలోపలి పరికరాలన్నీ సంతృప్తికరంగా పని చేస్తున్నాయని న్యూ చైనా వార్తా సంస్థ తన సంక్షిప్త ప్రకటనలో వెల్లడించింది. పెకింగ్ నించి తెలిపిన సమాచారాన్నిబట్టి ఈ ఉపగ్రహం వాతావరణ నివేదికతోపాటుగా మావో సంబంధ విప్లవాత్మక గీతాన్నొక దానిని మార్చి మార్చి ప్రసారం చేస్తుందని తెలుస్తున్నది.

తూరుపు ఎరుపు

25 వ తేదీ రాత్రి ఈ ఉపగ్రహంనించి ప్రసారం అయిన 'ది ఈస్ట్ ఈజ్ రెడ్' అనే గీతాన్ని పెకింగ్ రేడియో రిలే చేసింది. ఈ గీతం ప్రతిపాదం చివర పెద్ద ధ్వనితో సంగీతాలు, ఉపగ్రహం నించి ప్రసారం అయినవి, వినిపించాయి. వరుసగా మూడురోజులపాటు ఈ గీతం ప్రసారం అవుతుందని కూడా పెకింగ్‌రేడియో తెలియచేసింది.

25 వ తేదీ రాత్రి వీధులన్నీ దాదాపు నిర్మానుష్యం అవుతున్న సమయంలో ఉపగ్రహం ప్రయోగాన్ని గురించిన వార్త పెకింగ్‌లోని ప్రజలకి అందింది. వెంటనే వీధులన్నీ కిటకిట లాడాయి జనంతో. వీధులన్నీ విద్యుద్దీపాలతో ప్రకాశవంతం అయినయి. ప్రభుత్వ కార్యాలయ భవనాలపై అత్యంత కాంతివంతమైన దీపాలు కనిపించాయి. డప్పులు, డసఁలు, మొదలైన సంగీత వాయిదాలతో ట్రక్కులపై అంత జనసందోహం ఉన్న రోడ్లపై అత్యంత ఉత్సాహంగా వేగంగా ఊరేగింపులు జరిగాయి. టపాకాయల శబ్దంతో నగరం మార్మోగింది. ప్రజలలో ఆనందోత్సాహాలు మిన్నుముట్టాయి.

'పీపుల్స్‌డైలీ' ఈ సందర్భంగా ఒకపుట ప్రత్యేక సంచికని విడుదల చేసింది.

చెయినా రాకెట్లు

ఈ ఉపగ్రహంవల్ల వైజ్ఞానిక ప్రయోజనం సంగతి ఎలా ఉన్నా ఈ ప్రయోగంవలన చైనా శక్తివంతమైన రాకెట్లని తయారుచేయగలదన్న విషయం ప్రస్ఫుటమైంది.

అమెరికా కాంగ్రెస్‌కి పెంటగన్ నిపుణులు అందజేసిన సమాచారాన్ని బట్టి ఈ సంవత్సరం పూర్వార్ధంలోనే తనమొట్టమొదటి ఖండాంతర వేధిని ప్రయోగించగలదని తెలుస్తున్నది.

వాషింగ్‌టన్‌లోని అమెరికా రక్షణ శాఖవారు ఈ ప్రయోగం 'గమనించదగిన సాంకేతిక ప్రగతి'గా పేర్కొన్నారు. అది తమని ఆశ్చర్యచకితుల్ని చేయలేదని కూడా వారు అన్నారు.

'నాసా' అధికారి డాక్టర్ థామస్ పైన్ చైనా నాయకుల నిర్ణయానికి యిది అద్భుతమైన నిదర్శనం' అన్నారు. ఎన్నో సమస్యలని తాము ఎదుర్కొంటున్నా శాస్త్రవిజ్ఞానానికీ, సాంకేతిక పరిజ్ఞానానికి అత్యధిక ప్రాముఖ్యతని వారు యిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



(గత సంచిక తరువాయి)

మలయవతి అంతఃపురానికి వెళ్ళుతూ వెళ్ళుతూ వెనక్కు తిరిగి చూచినప్పుడు, అతనికి ఆమె ఒకవైపు వక్షోజం కనిపించింది. ఉద్రేకం కలిగించింది. ఆమె ఇలా పదేపదే తిరిగి చూస్తూ, సిగలో తురుముకున్న పూవుల వెంటపడిన తుమ్మెదలగుంపును చేతులతో చెదరగొట్టే పాకుతో ఒక్కమారు అతనిపై ఒకచూపు ప్రసరింపజేసింది. శరీరమంతా పులకలు కమ్మగా, అవయవాలు ఇక కదలమని స్తంభించిపోయినట్టాయి, ఎంతో కష్టం మీద ఆమె తరలిపోయింది; సుకుమార మయిన మనస్సుతో ఆ మహాభుజుణ్ణి జీమూతవాహనుణ్ణి—మోసుకుంటూ వెళ్ళి, అంతఃపురం చేరింది. కట్టుకున్న చీనాంశుకాలు జారిపోతుండగా, మకరకేతనుడు కాటు వేసిన ఆ సుకుమారి మంచం మధ్యన పడిపోయింది. వెంట వెంటనే విరహానలం పెరిగిపోయింది. అదేమిటి ఆశ్చర్యమో, కన్నీరు పడినకొద్దీ ఆ అనలం మరీ మరీ విజృంభించసాగింది.

ఇంతలో వాసరేశ్వరుడయిన ఆదిత్యుడు పశ్చిమ సముద్రం ప్రవేశించాడు. నలినీ వనశాలిని అయిన సంధ్య రాగయుక్త అయింది. కమలాలు ముకుళించుకోగానే భయచకితమయి తుమ్మెదలు అటూ ఇటూ తిరుగాడసాగాయి. కాటుకలాగ నల్లగా, రాత్రి యువతి కబరీభారంలాగ, చక్రవాకపక్షుల వియోగాగ్ని పొగలలాగ నల్లని చీకట్లు పైకి లేచాయి. నల్లకలువలు అంతటా పరచినట్టు, భ్రమరాలు ఎక్కడపడితే అక్కడ మూర్ఛపోయిపడినట్టు, నీలకంఠాలైన నెమళ్ళను ప్రకృతి ఉదీర్ణం చేసినట్టు చీకట్లు అంతటా సంచరించాయి.

చండీశుని జటామండల మండనమైన చంద్రుడు ఉదయించాడు. రాత్రిదేవి నొసటి కర్పూరపు బొట్టులాగ వున్నాడు ఆ రోహిణీరమణుడు. దిక్కాంత చేతి విలాసపు పూమొగ్గవంటి, నిశాదేవి ముత్యాల కుండలంలాంటి, మన్మథ మహారాజు శ్వేతచ్ఛత్రం వంటి చంద్రుడు అందంగా పైకివస్తుండగా, పిల్లగాలులు వీచాయి. అవి వికసించిన పూవుల తావితో కలువకన్నెలను ఆనంద పెట్టేవిగాను, పద్మినుల విరహోచ్ఛ్వాసాలా

అన్నట్టుగాను వున్నాయి:

మహిళల హృదయాలను హఠాత్తుగా ముక్కలుచేసే వడిసెల రాయివంటివాడు, పంచబాణుడనే పంచాగ్ని కుండం కొరకంచు వంటివాడు అయిన చంద్రుడు. నడినెత్తిమీదికి ఎక్కగానే సిద్ధరాజపుత్రి అయిన మలయవతి ఇక సహించలేకపోయింది. మహా సంతాపంతో వాడిపోయి చందనం అలదిన అరటి ఆకులమీద పడుకొంది. నీరు ధారకట్టిపోసినా, తడిగుడ్డలు ఎన్నికప్పినా, ఎన్ని తామరలు పెట్టినా, ఎన్ని చంద్రకాంత శిలలు తెచ్చి పక్కన పెట్టినా, ఆమె మదనాగ్ని చల్లారలేదు.

ఆమె తనస్థితిని సహించలేక పక్కనున్న చెలికత్తెను చూచి, సిగ్గుతో చలించిపోతూ 'చెలీ, నీవేకదూ, అక్కడ కాంతుని దర్శనానికి సాక్షిణిగా వున్నావు. ఏమిచేయను! ఎక్కడికి వెళ్ళను? ఎవరికి ఈస్థితి చెప్పను? కాముడు నాకు కన్యా విరుద్ధమయిన క్రమం కలిగించాడే! ప్రణయం పెచ్చుపెరిగి లజ్జ కోల్పోయినట్టి వారు ప్రియులకు స్వయంగానే సందేశాలు పంపుతారు. తామే ప్రియుల వద్దకు వెళ్తారు. అలాంటప్పుడు ఆ హత చేతస్కునికి విలాస వ్యాజంతో ఏమి సందేశం పంపగలం? ఆ యువకుడు భాగ్యసంపన్నుడు. ఎవరిమాట వింటాడు? ఇదీ నా విన్నపం అని అందామా, ఏమిటీ కృపణత్వం అని అనుకోవచ్చు. మాట్లాడనా, ఏమిటీ ప్రగల్భత అని అనుకోవచ్చు. ఇక్కడికిరండి అందామా, ఆజ్ఞా గర్వమనిపిస్తుంది. నీవు నాకు ప్రియుడివి అని చెప్పంపుదామా, ఎంత సిగ్గులేనితనం అనిపిస్తుంది. ఇక బతకను అని అంటే నేను అనవలసిన, నాకు సమానమయిన మాటకాదు. నీ ప్రియురాలిని అని అందామా, మనకు ఎలా తెలుసు? చూడలేదే. నేనే నీవద్దకు వస్తాను అని అందామా, ఉచితంకాదు. స్మరార్తను అని చెబితే, చాపల్యం అవుతుంది. సఖీ, ఆయన దైవాత్తు దగ్గరికివచ్చినా, ఏమి చెప్పాలో తెలియడంలేదు. ఈ విషయంలో నన్ను అందరూ వదలిపెడుతున్నారు. నాకిక చావే శరణం.'

మలయవతి ఇలాచెప్పి, కన్నీటి సెలయేళ్ళు పరిపించింది. ఆ సెలయేళ్ళకు, [illegible]

చందనపు పూతలు తడిసిపోయాయి:

జీమూత వాహనుడు కూడా విరహాకులుడై ఆ గౌరీ మందిరోద్యానంలో ఆ ఇందుముఖినే స్మరిస్తూ, తిరిగాడు. ఆయనను కామమనే భుజంగం చుట్టివేసింది. వెన్నెల విషం తలకెక్కింది. దానితో సంతాప విహ్వలుడై పత్తిలాగ ఎగిరిపోయే స్థితిలో పడ్డాడు.

జీమూత వాహనుడు ధ్యానమగ్నుడై, మాటా మంతీ లేక, కృశించిపోయి వుండగా, మిత్రుడు మధుకరుడు ఇలా అన్నాడు:

'మిత్రమా, ఏమిటిది నీకు కూడా మనస్సు విప్లవమయిపోయిందా? చెదరిపోయిందా? దుఃఖాలు వచ్చి పడితే మతి విప్లవం వల్ల భ్రమించి పోకుండా వుండడం కోసం సత్పురుషులు విద్యార్జన పరిశ్రమం చేస్తారు.'

విరహాగ్నితో వుడికిపోతున్న జీమూత వాహనుడు మిత్రుని మాట విన్నాడు, నిట్టూర్చాడు, క్షణం సేపు భూమిని చూచి, 'నాకేమీ లేదే. నేను స్వస్థుడిగానే వున్నాను' అన్నాడు.

మిత్రుడప్పుడు చందనపు లేచిగుళ్లతో పక్క సిద్ధపరచాడు. దానిమీద పడుకున్నాడు. అయినా ఆయన సంతాపం తగ్గలేదు.

ఇది ఇలావుండగా మలయవతి విరహాన్ని సహించలేక గౌరీమందిర వనానికి వచ్చి ప్రాణత్యాగం చేద్దామనుకుని, గుబురుగావున్న ఒక తరులతా ప్రాంతంలో ఒక చెట్టుకు ఉరితాడుకట్టింది. గిరిజాదేవికి నమస్కరించి, 'హా! హా! చచ్చాను' అని ఏడ్చి, ఆ ఏడుపుతో, ఆ వనంలోని ఆడజింకలకు కన్నీళ్ళు తెప్పిస్తూ, 'అన్నిజన్మల్లో నాకు జీమూత

డాక్టర్ కబుర్లు


మణికట్టు మీద కంతి

కొన్ని సమయాలలో మణికట్టుమీద చిన్నవాపు రావచ్చు. అది నొప్పి పుట్టదు కాని చూడటానికి బాగుండదు దానిని ఇంగ్లీషులో "గాంగ్లియాన్" అంటారు. ఇది ఒకరకం 'కంతి'.

దీనిని పోగొట్టటం ఎలాగ? ఇంజక్షన్ సూదిగుచ్చి సిరింజితో లోపలి పదార్థాన్ని లాగివెయ్యవచ్చు. తర్వాత లోపలికి ఒక మందుని ఎక్కిస్తారు మళ్లీ సిరింజితో లోపలి పదార్థాలన్నిటినీ బయటికి తీస్తారు. ఈ విధంగా లోపలి చెడు పదార్థాన్నంతా 'కడిగి' వేస్తారు. కడిగిన తర్వాత గట్టిగా బాండేజికడ్తారు. రబ్బరు బాండేజి వాడితే మంచిది. ఈ రకం చికిత్స కొన్నిసార్లు చెయ్యవలసి ఉండవచ్చు.

కొందరు వైద్యులు కంతులని కోసివేస్తారు.

రెండురకాల చికిత్స వల్లా కంతులు మాసిపోవు. తిరిగి రావచ్చు. ఈ మధ్య ఎక్స్-రే చికిత్సకూడా చేస్తున్నారు.



నా చిన్నప్పుడు ఈ కంతి వచ్చింది. మా అమ్మమ్మ నా మణికట్టుని కుర్చీ అంచుమీద పెట్టి ఒక పుస్తకంతో దెబ్బవేసింది. కంతి పోయింది! మళ్లా రాలేదు...

ఇదిమాత్రం ఖచ్చితమయిన చికిత్స కాదు!

వాహనుడే భర్త కానీ.' అని గట్టిగా అంటూ, ఉరిపోసుకొనడానికి ఉరివైపు కదిలింది.

జీమూతవాహనుని మిత్రుడు మధుకరుడు ఆ మాటలు విన్నాడు. వెంటనే జీమూతవాహనుణ్ని పిలిచాడు. అతడువచ్చి ఒక చెట్టుమరుగున నిలబడి ఏమి జరుగుతున్నదీ, విన్నాడు, చూచాడు.

మలయవతి సాహసానికి గౌరీదేవి హృదయం కరిగింది. ఆమె వెంటనే ప్రత్యక్షమై 'పుత్రీ ఇలాటి సాహసం చేయవద్దు. జీమూతవాహన చక్రవర్తి నీకు భర్త అవుతాడు' అని వరమిచ్చి అంతర్ధాన అయింది.

మలయవతి దేవినుంచి ఇలా వరం పొంది, ఎదుటచూచింది. జీమూత వాహనుడు ఎదుట నిలబడివున్నాడు. సంతోషంతో, సిగ్గుతో, కన్నులు మూతపడ్డాయి.

...బృహత్కథామంజరి

ఇంతలో ప్రతీహారి అక్కడికి వచ్చాడు. ఇలా విన్నవించాడు:

'దేవి! దైవానుగ్రహంవల్ల శుభమగుగాక. నీకు జయం. నీ తండ్రిగారి ఆజ్ఞతో నీ భ్రాత నిన్ను జీమూతకేతు పుత్రుడయిన జీమూత వాహనుకి ఇచ్చి వివాహమహోత్సవం జరుపడానికి ఏర్పాటు చేశారు. తండ్రిగరు నీ కిప్పుడే వివాహ మహోత్సవం జరుపుతున్నారు. రా అంతఃపురానికి.'

మలయవతి ఆ మాటలు విని అందంగా నవ్వుతూ అంతఃపురానికి తిరిగివెళ్లింది.

జీమూత వాహనుడుకూడా వెంటనే తండ్రివద్దకు తిరిగివచ్చి, వివాహోచిత మయిన మంగళాచార వస్త్ర భూషణాలు ధరించాడు.

జీమూతవాహనుడు అనేక వాద్యాలవారి గుంపుతో తరలి వెళ్లాడు. ఇద్దరికీ వివాహం జరిగింది.

జీమూతవాహనుడు తన ప్రేయతమను తన యింటికి పిలుచుకొని వచ్చాడు. ఆమెతో విహరిస్తూ గడిపాడు. తన ప్రియురాలు మలయవతిలాగేవున్న మిత్రావసువును కూడా విలాసకేళులతో, ఎంతో ప్రేమతో చూస్తూ, అతనికి కూడా తనపై ప్రేమ కలిగేట్టు చేశాడు.

ఒకమారు జీమూతవాహనుడు మిత్రావసుతోసహా సముద్రతీరంలో తీరవన భూములు చూస్తూ విహరించాడు. అక్కడ అతనికి ఒక పెద్ద కొండలాగ నాగుల అస్థిపంజరాలు పడివుండడం కనిపించింది. యుగాంతకాలంలో మహాభూత పదార్థం వడగండ్లతో నిండినట్టు కనిపించింది. 'ఇదేమిటి?' అని మిత్రావసువును అడిగాడు. అతడు ఇలా చెప్పాడు:

'పూర్వం గరుడుడు ఇక్కడ సర్పరాజులందరినీ తిని వేసేవాడు. ఇలా జరిగితే సర్పకులమే నాశమైపోతుందని వాసుకి గరుడుణ్ని ప్రార్థించాడు. వంతుల ప్రకారం దిన మొక నాగును అతనికి ఆహారంగా పంపడానికి ఏర్పాటు చేశాడు. పర్వత శిఖరోన్నతమయిన ఇది వారి అస్థుల దిబ్బ.'

ఈ విషయం చెబుతూండగా మిత్రావసువును సిద్ధరాజు ఏదో కార్యార్థం పిలిపించాడు. అందువల్ల మిత్రావసువు వెంటనే వెళ్లి పోయాడు.


జీమూతవాహనునికి ఆ ఎముకల దిబ్బ చూచి కరుణ కలిగింది, సర్పాల మీద. ఈ సంసారం నిస్సారమని తలపోస్తూ, అక్కడ ఒంటరిగా తిరిగాడు.

తిరుగుతూండగా ఒక ముసలది ఆయనకు కనిపించింది. ఆమె పెదవులు ఏడ్పులవల్ల ఎండిపోయాయి. ముఖమూ వాడిపోయింది. ఎవరో కుమారుడు ఆమెను పదే పదే ఊరడిస్తున్నాడు. ఆ కుమారుని ముఖం పూర్ణచంద్రుని లాగ సుందరంగా వుంది. ముఖకాంతి దిగంతాలకు వ్యాపిస్తున్నది. బాగా విస్తరించిన పడగమీది రత్నాలకాంతి పుంజాలతో ఆకాశం పచ్చగా మారిపోతున్నది. ఆకుమారుడు ఆనందం ఆకారంతో వచ్చినట్టు, సంతోషం ఆకారం ధరించి నడయాడు

ఉన్నట్టు కనిపించాడు.

ఆ కుమారుణ్ని చూసి, వృద్ధులు కన్నీటితో కంఠం గద్గదమయిపోగా, "హా, పుత్ర, నయనాలకు ఆనందం కలిగించేవాడా, సౌందర్యానికి అమృతకాంతి [illegible] మహావంశంలో పుట్టిన ఆణిముత్యమా, శంఖచూడ, లావణ్య నిధానమయిన నీ దేహం, గరుడుని ముంచుకొనల వజ్రాఘాతాలను ఎలా సహిస్తుంది? నాగరాజు [illegible] పంపాడు. నీ సుకుమార శరీరానికి ఎవరు రక్షకుడవుతాడు?" అని విలపించింది.

(ఇంకా ఉంది)



వారఫలం

8-5-1970 శుక్రవారం మొదలు 14-5-1970 గురువారం వరకు

మేషం: వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్తి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవకార్యాలు నెరవేరుతాయి.

వృషభం: వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిథునం: వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాంఘిక కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. విలాసవస్తువులు కొంటారు.

కర్కాటకం: కొన్ని వ్యవహారాల్లో మీరు శ్రమపడినా, ప్రయోజనం ఉండదు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

సింహం: వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహిత్యకళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కన్య: అన్ని వ్యవహారాల్లోను గౌరవప్రాబల్యాలు బాగా ఉంటాయి. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. విద్యావైజ్ఞానికరంగాలలో ఖ్యాతి లభిస్తుంది

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

తుల: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. మిత్రులు మీకు సహాయం చేస్తారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. పోటీదారులలో గౌరవం బాగా ఉంటుంది. నూతన వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం: కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. అనేక వ్యయం జరుగుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. వారం మధ్యలో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ఆందోళన కలుగుతుంది. వృత్తిలో ప్రయాస అధికంగా ఉంటుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. పోటీదారులలో గౌరవం లభిస్తుంది.

మకరం: ఇతరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. అలంకారం కోసం వ్యయం చేస్తారు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. పోటీదారితో మాటపట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాలో చికాకులు యేర్పడతాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. అధిక వ్యయం జరుగుతుంది.

మీనం: ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరుతాయి. పోటీదారులలో గౌరవం బాగా ఉంటుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు— బంధుమిత్రులను కల్సుకొంటారు. అలంకార వస్తువులు కొంటారు.

—మహేష్

ఒక్క వారం విపరీతం పాఠకుడు

అక్రమసంబంధంతో ఆవేశం!

రామదాసు క్రిష్ణంపేటలో మునుస్వామి అనే 54 ఏళ్ళ అతని భార్య పార్వతి వేరొకనితో సంబంధం పెట్టుకుందట. భర్త ఎంత వారించినా వినకపోవడంతో అతను ఆవేశంతో పార్వతిని కత్తితో యిష్టం దారుణంగా పొడిచి, చంపేసి, పోలీసులకు భయపడి తను విషం త్రాగి కూర్చున్నాడట. ప్రమాద పరిస్థితిలో యీ ఆగుస్తు మద్రాసు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారట. పోలీసు యీయన మీద హత్య, ఆత్మహత్య నేరాలు పెట్టారట.

టాక్సీ డ్రైవర్‌గా పనిచేసిన మంత్రి!

నిరుద్యోగ సమస్య మీద మాట్లాడుతూ డాక్టర్



త్రిగుణసేన్ తను కూడా ఒకానొక రోజుల్లో టాక్సీ డ్రయివరుగా, ఇన్స్యూరెన్సు ఏజంటుగా పని చేశానన్నారట.

నూతిలో విద్యార్థి శవం

సికిందరాబాదు శివాజీనగర్‌లో వుంటున్న గిరిధర్ అనే కాలేజి విద్యార్థి 13 వ తేదీ సాయంకాలం యింటికి తిరిగి రాలేదట. మర్నాటి వుదయం అతను కనుపించటం లేదని పోలీసు రిపోర్టు యిస్తే 16 వ తేదీన ఒక నూతిలో అతని శవం దొరికిందట. ఇది హత్యా, ఆత్మహత్యా అన్న విషయం యింకా తెలవవలసి వుంది.

* * *

ఆకలిబాధ - ఆత్మహత్య

మధురకు చెందిన హనుమాన్‌పట్టి అనే వూళ్ళో ఒక యింట్లో ఒకామె, ఆమె ఐదుగురు పిల్లలతో సహా పస్తులుంటూ వుందట. ఆకలి బాధకు తాళలేక చూడలేక కాఫీలో విషం కలిపి, తను త్రాగి పిల్లలకూ యిచ్చిందట పాపం.

* * *

వివాహమయి అయిదేళ్ళయినా, భర్తతో కాపురానికి రాక గంగి అనే ఆమె తన భర్త పెరుమాళ్ నాయకర్, వదలి పుట్టింటికి వెళ్ళిపోయిందట. ఆ వూళ్ళో ఒక కుర్రాడితో రహస్యంగా సంబంధం పెట్టుకుందట. ఆ కుర్రాడు ఆమెను తప్పక వివాహం చేసుకుంటానని మాట యిచ్చి మేనత్త కూతురు అమ్మాయితో పెళ్ళి నిశ్చయించుకున్నాడట. ఈ సంగతి తెలిసి, మనస్సు విరిగి గంగి విషం త్రాగి మరణించిందట. ఇది కావేరిపాక్కానికి చెందిన మామత్తూరులో జరిగింది.

* * *

153 ఏళ్ళ వ్యక్తి

మాస్కోలో 153 ఏళ్ళ వ్యక్తి ఉన్నాడట. ఈయన పేరు గాపెనోవ్‌ట. ఈయన యిప్పటికీ ఉదయం ఆరు గంటలకు లేచి, అలా లేవడమేగాక, పొలం పనీ, పశువుల పనీ కూడా తనే చూసుకుంటాడట. ఈయన ఆహారం కేవలం పాలు, పళ్ళూనట. ధూమపానం, మధుపానం చేయనేలేదట యీయన యింతవరకూ.


* * *

కాకీదుస్తులు వేసుకుని ఆయుధాలతో వో వ్యాను నుంచి బందిపోట్లు దామోహ్ అనే గ్రామంమీద పడి, విజయకుమార్ అనే ఒక ప్రముఖ వ్యాపారస్తుని కొడుకును ఎత్తుకు పోయారట. ఇది బహుశా 'స్పెషల్ ఫోర్స్' ఆట అయ్యుంటుందని అంతా దీన్ని వినోద వ్యవహారంగా తీసుకున్నారట. తీరా చూస్తే అతను తిరిగి యింటికి రాకపోయేసరికి అనుమానంతో పోలీసు రిపోర్టిచ్చారట. ఈ విషయంలో పోలీసు యిటీవలే జోక్యం కలుగజేసుకున్నారట.

* * *

గంగానదిమీద బియ్యం దొంగ రవాణా జరుగుతోందని పోలీసులకు వార్త వచ్చేసరికి నారు తెలియంగ అనే చోట గంగానది ఒడ్డున కాపలా కాశారట. అంతలో ఆ గ్రామవాసులే పోలీసుల మీదకు యిటుకరాళ్ళు విసరడమేగాక, కానిస్టేబుల్ని ఎత్తుకుపోయారట. ఈ ఘర్షణలో పోలీసులు మిగతా తుపాకులతో కాల్పులు జేశారట. కాల్పుల వల్ల ఒక వ్యక్తి మరణించగా, నలుగురికి గాయాలు సంభవించాయట.

* * *



ఒకవారం విపరీతం

సహస్పాన్— బాదేన్ రోడ్డుమీద ప్రయాణం చేస్తున్న ఒక జీపు గతి తప్పి, రోడ్డు పక్కనున్న వో చెట్టుకు గుద్దుకున్నందువల్ల ఆ జీపుకు నిప్పంటుకుందట. దాంతో జీపులో వున్న ఐదుగురూ కాలి చనిపోయారట.

అక్రమసంబంధం- హత్య

ఢిల్లీలో గంగారావు అనే అతని యింట్లో ప్యారీలాల్ అనే అతను గత 20 ఏళ్ళగా ఉంటున్నాడట తత్ఫలితంగా ప్యారీలాల్‌కు గంగారావు భార్యతో దోస్తీ ఏర్పడిందట. తమ దోస్తీకి చిహ్నంగా [!] ప్యారీలాల్ ఉత్తరప్రదేశ్‌లో ఆమెకు కొంత భూమి కూడా కొని యిచ్చాడట. ఇదంతా చూసి భరించలేని గంగారావు 7 వ తేదీ ప్యారీలాల్ యింటికివెళ్లి గసుక్కున అతన్ని కత్తితో పొడిచాడట. అడ్డం వచ్చిన తన భార్య వేలు తెగిపోయిందట—


*　*　*

ఢిల్లీ మిల్టన్ రోడ్డుమీద ఏడునెలల పసిగుడ్డును ఎత్తుకు నడుస్తున్న ఒకామెను లారీగుద్ది క్రిందపడ్డ ఆ పసికందు మీంచి వెళ్లిపోయిందట.

బందిపోట్ల బెడద

రంగ్వా అనే గ్రామంలో బందిపోట్లు పడి, ఆ గ్రామవాసులను నలుగుర్ని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేసి, కాపలా పోలీసు మీద కూడా అఘాయిత్యం జరిపి, పారిపోయారట— జానపద సినిమాల్లోలాగ యీ యిరవయ్యో శతాబ్దంలో కూడా యీ బందిపోటు దొంగలేమిటో! ఎవరి కిష్టం వచ్చిన పని వారు చేసుకో వచ్చుందిగా [!] స్వాతంత్ర్యం వచ్చి— ఇలాంటి పనులా!





భక్తులని సృష్టిస్తున్న లాటరీలు

స్వతంత్ర భారత దేశంలో ఏ నోట విన్నా ఒకటే మాట. ఎక్కడ చూసినా ఒకటే చేత— ఏమిటది! లాటరీ టిక్కట్లు. ఎన్ని యిక్కట్లు పడైనాసరే లాటరీ టిక్కట్లు కొని, సులభ మార్గాన్ని లక్షాధిపతులు అవడానికి అంతా ప్రయత్నించుతున్నారు ప్రజలు. పూర్వం రాజులు, మునులు, పెద్దలు తాము చేసిన పాపాలన్నీ మంచులా కరిగిపోయి తమకు స్వర్గలోకాలు వచ్చేలా చేయమని భగవంతుణ్ణి ప్రార్థించుతూ అందుకు దగ్గరమార్గాలు— యజ్ఞ యాగాదులు చేసేవారట— ఈ లాటరీ టిక్కట్ల మహత్యంవల్ల ప్రజల్లో చాలామంది మహాభక్తులుగా మారిపోయారు. ఇటీవల దేవాలయాలు కిటకిట లాడిపోతున్నాయి— కొబ్బరికాయ ధర యిప్పుడెంతో తెలుసా!

*　*　*

మార్చి 20 తేదీనుంచి కనబడడం లేదన్న లోడ్జి ఎస్టేటుకు చెందిన [ఢిల్లీలో] పుష్ప, కాంత అనే యిద్దరమ్మాయిలను పశ్చిమ బెంగాలులో పట్టుకుని, ఢిల్లీ తీసుకొచ్చి, వారితోపాటు యు. యస్. ఐ. యస్. లో పని చేస్తున్న మిస్టర్ ముఖర్జీ అనే ఆయన్ని కూడా పోలీసు పట్టుకుందట. కోర్టులో సమాధానం చెపుతూ, 'నేనేం చిన్నపిల్లనుగాను. మైనారిటీ తీరిన పిల్లను. నేనూ ముఖర్జీ వివాహం చేసుకోదలిచాం. నా యిష్టం మీదే అతనితో వెళ్లాను. కాంత మాతో జతగా [అంటే ఏమో!] వచ్చిందంతే' అన్నదట పుష్ప.

ప్రశ్నోత్తరం

— కె. రామలక్ష్మి

ఎమ్. బి. ఆర్, కోరాపుట్

ఆఫీసుల్లో పనిచేసే అమ్మాయిలు చాలామంది దృష్టిలో చులకన అవుతా రెందుచేత?

కుళ్లు! కుళ్లుచేత స్వామీ.

జె. ఆర్. ఆర్, సీతాపురం

'కాంగ్రెసుద్వారా సామ్యవాదం వస్తుందనే మీకూ, కత్తిద్వారానే కమ్యూనిజం వస్తుందనే నాకూ రాజీ అనేది కుదరదు' అని ఖచ్చితంగా చెప్పిన శ్రీశ్రీ గారు మహాప్రపంచంలో కాంగ్రెసు కెందుకంత్ జై అంత త్త్రైరు కొట్టారు?

మీరు మరీను! వారెప్పుడూ డబ్బుతో రాజీ పడనని అనలేదే!

ఆర్. ఎల్, విశాఖపట్నం

తరచు భార్యాభర్తలమధ్య కలహాలకు ఆశలు, అభిప్రాయాలు తెలియనివ్యక్తితో జీవితం ముడిపడి ఉండడమే కారణం అని అంటే ఏమంటారు?

సారపాటూ అంటాను. ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నా, తల్లి తండ్రులు కూర్చిన సంబంధం చేసుకున్నా — భర్తతో జీవితం ప్రారంభించాక కాని నిజమైన అర్థం చేసుకోవడం జరగదు. అది ఇద్దరి మధ్య ఉండే సాన్నిహిత్యంమీదా ఒకరిపై ఒకరికుండే గౌరవాభిమానాలమీదా ఆధారపడి ఉంటుంది.

వి. వి. ఎల్. ఆర్, విశాఖపట్నం

మహానిద్ర, ఆకలయ్య అనేకవులు ఏంపద్యాలు రాశారు? ఎక్కడ అచ్చయ్యాయి తెలుసుకోరుతాము.

వీరు 'నిరాకారకవు'లలో ఇద్దరు. 'కిక్కులు' అని పద్యాలు రాశారు. అవింకా అచ్చు కాలేదు. త్వరలోనే అచ్చయి—సంచలనం రేకెత్తిస్తాయి. తప్పదు!

కె. ఎస్. ఆర్, అమృతలూరు

ఈ భూప్రపంచంలో జీవితం అనేది బుద్బుదప్రాయమని -తెలిసి కూడా ఆత్మీయులు అస్తమించినప్పుడు విలపిస్తా రెందుకంటి?

నీటి బుడగ పేలిపోయినందుకు కాదా విలాపం. వారా నీటి బుడగపై వెలిగిపోయిన ఇంద్ర ధనుస్సులు జ్ఞాపకం వచ్చి.

పి. ఆర్. ఆర్, ఉండ్రాజవరం

మీ జవాబుల్లో నా కన్నీ తెలుసునసే ఆడంబరం కన్పించదు ఎలా గండీ?

ఎల్లాగో మీరే చెప్పండిసార్. ఆడంబరంగా ఉండటంటే నాకే నవ్వొస్తుంది. నే కొంచెం సీరియస్‌గా ఉన్నా నా స్నేహితుల గొంగు నాకు ఒంట్లో బాగు లేదని నిర్ణయం చేస్తారు!

కె. ఎస్, చింతూరు

జన్మ జన్మలకూ మీ వారే భర్త కావాలని కోరుకుంటున్నారా?

మా ఇరువురికీ కూడా ఇంకో జన్మ ఉండదనే గట్టి నమ్మకంతో ఈ జన్మ గడిపేస్తున్నాను— ఇది సత్యం. నమ్మండి సత్యంగారూ.

పి. ఎస్, మద్రాసు

కష్టాల నన్నిటినీ మరపించే సుఖం ఏదండీ?

చక్కని స్నేహితుల సాన్నిధ్యం.

పి. జె. ఏ, చీరాల

జీవితంలో మానవుడు తాను ఎంతో కష్టపడి సాధించాలనుకున్నది ఇంకొకడు సాధించి తన ఆశ నెరవేర్చుకొన్నప్పుడు అతనిని చూచి తాను బాధ చెందుతాడా? కష్టపడకుండానే అతగానికి దొరికినందుకు సంతోషిస్తాడా?

బాగుంది మీా వరస! తను చేయలేనిది ఇంకొకడు ఇట్టే చేసినప్పుడు మనిషైనవాడు పైకో, మనసు లోనో ఏడ్చి తీరుతాడు. అంతేకాని సంతోషిస్తాడా?

జి. ఎల్. ఎమ్, బరంపురం

మీరు రాసిన 'చీకటి దారి' నవల చాలా బాగుంది.

థ్యాంక్యూ.

ఎస్. వి. సి. హెచ్, తిరుపతి

పురుషునకు నవమాసాలూ మోసి పెంచిన తల్లి ముఖ్యమా లేక సర్వసుఖములు సమర్పించే భార్య ముఖ్యమా?

తల్లా? పెళ్లామా? అంటారు. అంతేనా?..... తల్లిని, తల్లిలాగా భార్యని భార్యలాగా చూసే బదులు—యీ కుంటి సాకులెందుకు?

కె. ఎల్. ఎన్, విశాఖపట్నం

నగ్న సత్యం ఏది?

బట్ట విడిచిన నిజం కాదా చిట్టితండ్రీ!?

బి. ఎస్, భువనేశ్వర్

మీ జవాబులు ...... గారి ధోరణిలో యింకా విపులంగా ఎందుకివ్వరు?

వేలు చూపితే మండదాకా మింగేరకం మావాళ్ళు. అంచేత ఇలా క్లుప్తంగా ఉండడం అలవాటైంది.

ఎం. కె. ఆర్, గార్లదిన్నె

కొందరు పెద్దమనుష్యులు అమాయిక ప్రజల దగ్గిర డబ్బులు సంపాదించే వాళ్లను ఏమనాలి?

కమిషన్ ఏజెంట్లు.

కె. ఎస్. ఆర్, రాజ్యలక్ష్మీపురం

మనసులు మార్చేందుకు మందులు ఉంటాయనడంలో మీ రెంతవరకు ఏకీభవిస్తారు.

మనసు మార్చడానికి కషాయాలు, మలామాల సంగతి నాకు తెలియదుగాని—ఒక్కటుంది— అదే మంచితనం. వాడి చూడండి.

ఎస్. ఎల్. ఎస్, సికింద్రాబాదు

స్త్రీ జీవితంలో ఏమిటి కోరుకుంటుంది?

మంచిమనసు కల భర్తని. స్త్రీకి ఒక్క తిండీ బట్టా యిస్తే చాలదు, ఆదరం అభిమానం వాటికి తోడు అభిప్రాయాలకి విలువా యిచ్చే మగవాడు సహచరుడుగా లభిస్తే బాగుండును అనుకుంటుంది...

బి. ఎస్. ఆర్, పెంటపాగులవలస

స్త్రీ జాతిని ఏవిధంగా అర్థం చేసుకోవాలి?

ఇది నీ ఐదవ ప్రశ్న అనీ, ఒక్కదానికీ జవాబివ్వలేదని యుద్ధమొస్తున్నావనీ రాస్తున్నావు తమ్ముడూ — స్త్రీజాతిని స్త్రీజాతిగానే వయస్సు వచ్చాక అర్థం చేసుకుందుకు ప్రయత్నిద్దువుగాని. సరేనా!

ఎం. ఎస్. ఎన్, అనంతపురం

అక్కయ్యా మీరు ఉద్యోగం చేస్తున్నారా? లేక ఇంటిపనులేనా?

ఇంటిపనులే. కాని కాలక్షేపానికి, సరదాకి అలవాటు చొప్పునా వీధిలోకి వెళ్ల నవసరంలేని ఉద్యోగం [రచన!] చేస్తూంటాను.

బి. వి. ఆర్, వారాసిగూడా

మనిషి పులిని చంపిన శూరత్వం అంటారు. పులి మనిషిని చంపిన క్రూరత్వం అంటారు ఎందువలన?

ప్రకృతి ప్రసాదించిన శక్తిని పరీక్షకు పెట్టేపని, పులిని చంపడం. అంచేత జై కొడతారు. ●



గాఢాంధ కారంలో ఒక కాంతికిరణం

తేరాలక్ష్మి

'తాతయ్యా! తాతయ్యా!'

గులాబిమొక్క పాదును సరిచేస్తున్న వెంకట్రామయ్య తనను పిలుస్తూ పరిగెత్తుకొచ్చిన మనుమరాలు సరోజకేసి చూస్తూ, నన్నగా నవ్వి, 'ఏంవిటమ్మా?' అనడిగాడు.

'మరేమో తాతయ్యా, నాన్నను డబ్బు లడిగితే కోప్పడుతున్నాడు.'

'ఎందుకమ్మా డబ్బులు?' ముద్దులొలుకుతున్న సరోజ బుంగమూతికేసి చూస్తూ తనూ బుంగమూతి పెట్టి అడిగాడు.

'ఎందుకేవిటి? స్కూలు దగ్గర ఐస్ ప్రూట్లూ, వేరుశనక్కాయలూ కొనుక్కో వద్దూ?'

'వోహో అందుకా! జానమ్మా కొనుక్కో వాలి.'

'మరి డబ్బు లివ్వవూ?' బతిమాలుతూ అడుగుతున్న సరోజను చూసి నవ్వాడాయన.

'ఇదిగో నేను పని చేస్తున్నాను గదా, జీలా యిచ్చేది? నువ్వెళ్ళి బామ్మ నడుగు. నా పేరు చెప్పితే యిస్తుందిలే.'

'మా మంచి తాతయ్యా!'

యూనిఫారంలో ముద్దొస్తున్న సరోజను చూస్తూ, 'ఆ 'బెల్టు' అంత బిగుతుగా వుంటే బాగుండదు. కాస్త వదులు చేసుకోమ్మా' అన్నాడు.

వదులు చేసుకున్నది సరోజ.

'ఏదీ ఒక్క ముద్దు పెట్టుకోవూ!' అన్నాడు లోతుకుపోయిన బుగ్గల్ని గాలితో ఉబ్బిస్తూ.

ముద్దు పెట్టుకున్న సరోజ 'ఛీ! గుచ్చుకుపోతున్నాయ్' అన్నది.

ఆమె మొహంలోని ఏవగింపును చూసి నవ్వాడు వెంకట్రామయ్య.

'వస్తాను తాతయ్యా, టాటా!' అంటూ పారిపోయింది సరోజ. వెళ్తున్న ఆమెకేసి వోసారి చూసి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

'బాబుగారూ!'

ఉలిక్కిపడి తలెత్తి చూసాడు. శుష్కించిన శరీరానికి, పాతదై చిరిగిపోయిన కమీజులాంటి వొకదాన్ని తొడుక్కొని, మాసిపోయిన గుడ్డ నొకదాన్ని గోచీగా పెట్టుకొని, తన దీనావస్థనంతా మొహంలో నింపుకొని, చేతులు జోడించి తనకేసి చూస్తున్న ఒక అపరిచిత వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రామయ్య.

'ఏమిటి బాబూ!' అనడిగాడు.

'పదిమంది మీపేరు జెప్పుకుంటూంటే యిటొచ్చాను. నాకు తవరే దిక్కు. నాకే ఆదారమూ లేదు. సెట్టుకింద నా ఆడది, కొడుకు ఆకల్తోని మలమల మాడుతున్నారు. తమరుగాదంటే సావే గతి!' ఏడుస్తూ ఆయనకాళ్ళమీద పడబోయాడు.

'వద్దు నాయనా, లే' అని లేపాడు. 'ఇంట్లో నామాటగా జెప్పి ఇన్ని బియ్యం అడుక్కుపో' అన్నాడు.

అతడలాగే నిల్చున్నాడు. 'ఏమిటన్నట్టు' చూసాడు.

'ఒద్దు బాబూ! నే నడుక్కు తినలేను. ఆ బియ్యమైపోతే మళ్ళెవరి దగ్గిర్కి బోయేది?' అన్నాడు చేతులు నులుము కుంటూ.

'మరేమిటంటావ్?'

'ఏదో తమ కాళ్ళదగ్గర పడుండనీండి సాలు. ఏ పనిజెప్తే ఆపని జేత్తా. మా నోళ్ళల్ల యింత గంజిబోయండి.'

ఏమనాలో బోధపడలేదాయనకు, అతడి దీనావస్థను చూస్తూంటే మనస్సు కరిగిపోతున్నది. తనేదో డబ్బు యిచ్చినంత మాత్రాన ఆరోజు గడవొచ్చుగానీ, అతని జీవన శకటం ఒక దార్లోకి వచ్చేందుకు దోహదమవదు. అతనికో దారంటూ చూపే విధానమేదో కాస్సేపటివరకూ బోధపడలేదు.

'పోనీ ఈతోటపని చూసుకుంటావా?' అనడిగాడు.

వికసించిన మొహంతో 'మీరేం పని జెప్పినా జేత్త' అన్నాడతను.

'సరే, ఈ రోజునుంచే వచ్చేయ్. ఈ కాంపౌండులోనే వో పాక వేసుకో. మొక్కలన్నిటినీ జాగ్రత్తగా చూస్తూండు.'

'దరమ పెబువులు తమమేలు మరిసిపోలేను' అంటూ కాళ్ళపై బడబోయాడు.

'వద్దునాయనా! నువ్వనుకునేంత ఘన కార్యమేమీ చేయలేదు నేను' అన్నాడతన్ని ఆపుతూ.

అతడు వెళ్తున్న దిక్కే చూస్తున్న ఆయన మనస్సులో గత స్మృతులు మెదలుతూంటే హృదయం బరువెక్కింది.

* * *

దీనంగా మొహం వేళ్ళాడేసుకొని, ఒట్టి చేతులతో వచ్చిన వెంకట్రామయ్యని చూసి 'ఏవైందండీ? ఏమన్నారు?' అని ఆత్రంగా అడిగింది తులసమ్మ.

తలమీది కండువాను దండెంమీదేసి కూర్చుంటూ, నోట్లో వేలేసుకొని చీకుతున్న కొడుకొని చూసి నిట్టూరుస్తూ 'కొత్తగా ఏమంటారు? పాతమాటే అన్నారు' అన్నాడు.

'ఇవ్వనన్నారా?'

'నేను సరిగ్గా మగ్గం ఆడించనని నా చేతిలో చీరెలు చెడిపోతాయనీ అన్నారు.'

'అయ్యో, ఎట్లాగండీ? మనగతేం గావాలె? మనం కడుపులు మాడ్చుకున్నా వాడిగతేంటి? వాడింతసేపూ గుక్కపట్టి ఏడిస్తే, ఇంత గంజిబోస్తే పడున్నడు.'

'ఏం చేయాలి చెప్పవే? పెట్టుబడి పెట్టే షావుకార్లందరి దగ్గరికీ వెళ్ళాను. నూలు యివ్వమనీ, కొంత డబ్బివ్వమనీ బతిమాలాను. నూలు యిచ్చేందుకే వెను కాడారు కొంతమంది. నూలిచ్చినా, చీరె నేసింతర్వాత చూసి బాగుంటేనే కూలి యిస్తామన్నారు కొందరు. ఒంట్లో ఆసరా లేందే ఎలా నేసేదే?'

ఆకలైందేమో గుక్కపట్టి ఏడున సాగాడు వెంకట్రామయ్య ఏకైకపుత్రుడు చంద్రం. వాన్ని సముదాయించే ప్రయత్నం చేసి, చివరికి వేసారి, వెన్నుపై ఒక్కటి తగలేసి, వాడితోబాటు తనూ శోకాలు ప్రారంభించింది తులసమ్మ.

వారిని చూస్తూంటే గుండె తరుక్కుపోసాగింది వెంకట్రామయ్యకు. వెన్నుకు అంటుకుపోయిన తులసమ్మ కడుపునూ, సరియైన తిండిలేక కాళ్ళూ చేతులూ నీరెక్కి, వాచి, కడుపుబ్బిన చంద్రంను చూస్తూంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. ఆకలితో ప్రేవులు గలగలమంటూ తన కడుపులో గూడా శబ్దం చేసినై.

'అబ్బ, ఊరుకోవే. వాడితో నువ్వు గూడా ఏడిస్తే ఎట్లా?'

ఆయనకేసోమారు చూసి తన ఏడవు స్థాయిని కొంత తగ్గించింది తులసమ్మ.

'ఊరుకోవే. చెప్తూంటే వినిపిస్తూ లేదూ? ఎవరో చచ్చిపోయినట్టుగా వడింట్లో ఏవిటీ రొద!'

'అదొక్కటే తక్కువైంది. రేపేపాటికి పీడు బస్సీ ఏడిచే వోపికగూడా వుండదు' అని ఏడుపుస్థాయిని తగ్గించకుండానే అన్నది తులసమ్మ.

వారివా స్థితిలో చూస్తుంటే మనస్సు చికాకుగా తయారైంది. అక్కడుండాలనిపించలేదు. చరాచరా బయటికొచ్చాడు. మనస్సంతా పిచ్చిపిచ్చిగా తయారైంది. ఏం చేయాలో తోచక కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. 'ఇప్పుడేదో ఆధారం లభించాలి. మండుతున్న కడుపులోకి ఇంత చేరవేయందే శరీరమూ, మనస్సూ అదుపులో వుండేట్టు లేవు. ఏం చేయాలి? ఎలా సంపాదించాలి? ఇంకెవరి నడగాలి డబ్బు? ఆఁ, ఒక్కటే ఆధారం! అయన్నే అడగాలి. నిన్న వెళ్తే వూరికెళ్లాడన్నారు, బహుశా ఈ రోజు రావచ్చు. అయనతో గూడా లేదనిపించుకుంటే అడుక్కు తినడమో, లేదా అందరూ కట్టుగట్టుకొని చెరువులో దూకడమో, ఏదో ఒకటి జరుగుతుంది.'

ఒంట్లో శక్తి లేక కాళ్లు తడబడుతూంటే సుందర్రామయ్య ఇంటికేసి నడిచాడు.

కాలుమీద కాలేసుకొని వరండాలోని కుర్చీలో కూర్చున్నాడాయన. చేతులు గట్టుకుని ముందు నిలిచాడు. 'మీ రొక్కరే గతి. మా నాలుగు బ్రతుకులు మీ చేతుల్లో వున్నాయి' అన్నాడు కన్నీళ్ల మధ్య.

'ఏమిటి వెంకట్రామయ్యా?' నిదానంగా అడిగాడతను.

'పెట్టుబడి యిప్పించండి. మీ పేరు జెప్పుకుని బ్రతుకుతాం.'

'నీకు సరిగ్గా నేయరాదంటారు గదయ్యా!'

'ఒక్కసారేదో పొరపాటైనంత మాత్రాన మళ్లీ అట్లా గానిస్తానా? తమరు ఈ సారి యిచ్చి చూడండి, నావని పసందనిపించకపోతే నా కూలిపైసలు పూర్తిగా యివ్వకండి.'

అనుమానంగానే చూశాడాయన. 'ఏమో! చీర చెడిపోతే పదిహేను రూపాయలు ఏటిలో గలిసినట్లవుతుంది. చెడిపోయిందాన్ని ఏ అమాయకుడు కొంటాడయ్యా?'

గాఢాంధకారంలో...

ఉన్న ఒక్క ఆశా అడియాసైనందుకు కృంగిపోయాడు వెంకట్రామయ్య. ఇంట్లో భార్యా, కొడుకూ జ్ఞాపకం రాగానే మనస్సు నీరైపోయింది. 'తమ బ్రతుకులు బాగుపడే యోగం లేదు, ఇక చావేగతి!' అనిపించగానే కళ్లు మసకలు గమ్మాయి. మొహం వేల్లాడేసుకొని వెనక్కు మళ్లాడు.

'పోనీ ఒకపని జేస్తావా?' అన్నాడాయన.

'ఏమిటి చెప్పండి' అన్నాడు ఆశతో మొహం విప్పారగా.

'మేం నేయించిన చీరల్ని మూటగట్టుకొని నాలుగూళ్లూ తిరిగి అమ్ముకొస్తావా? నీ కూలి నీకు ముట్టజెబుతాను.'

ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయిన వెంకట్రామయ్య నోటంట మాట రాలేదు. కృతజ్ఞత నిండుకున్న కళ్లతో ఆయనవేపు చూసి మూగసైగలు చేసాడు.

'సరే. ముందుగానే నీకొంత యిస్తాను. రేపటినుంచీ అమ్మేందుకు వెళ్తావా?'

తలూపాడు. ఆయనిచ్చిన డబ్బు అందుకుంటున్నప్పుడు సంతోషం హృదయకుహరాన్ని నింపి, కళ్ల గుండా బయటికి ప్రవహించింది.

* * *

'నాన్నా, నే నాఫీసుకు వెళ్తున్నాను.' అన్న చంద్రం మాట వినిపించగానే ఇహంలోకొచ్చాడు వెంకట్రామయ్య.

ఆయన కన్నీటి ధారల్నిచూసి గాభరా పడిపోయి 'ఏడుస్తున్నావేం నాన్నా?' అన్నాడు కంగారుగా.

'నే నేడుస్తున్నానా?' ఆశ్చర్యంగా చెంపల్ని తడుముకున్న వెంకట్రామయ్య, చేతులకు కన్నీరు తగలగానే, 'అది ఏడుపు గాదు బాబూ! బ్రతుకుతెరువు లభించిన సంతోషంలో ప్రవహిస్తున్న ఆనంద భాష్పాలు' అన్నాడు.

ఆయనమాటలు అర్థం గాలేదు. వాచీకేసి చూసుకొని, 'టైమైపోయింది నాన్నా! నే వెళ్తున్నాను' అని టై సవరించుకుని, స్కూటరెక్కి వెళ్లిపోయాడు చంద్రం.

'ఏమండీ! మీ రెప్పుడొచ్చారు? శంకరయ్యపోయి షాపు తెరిచి గంటన్నరవుతున్నది. మీకింకా తీరుబాటు గాలేదా?' వేలమూపులు మోస్తూ యింట్లో కొస్తున్న వెంకట్రామయ్యను చూస్తూ అన్నది తులసమ్మ.

'వెళ్తున్నానే.'

'ఈ రోజు వెళ్లట్లాగానే వుంది! త్వరగా స్నానంచేసి భోంచేయండి. కొట్లో గుమాస్తాల కప్పజెప్పి మీరింట్లో వుండటం ఏమీ బాగా లేదు.'

'వారు చాలా మంచివారే. వారి నిజాయితీపై నమ్మకంలేందే వారి కప్పజెప్పుతానా?'


'ఏం నిజాయితీయో, ఏమో? ఈ కాలంలో ఎవర్నీ నమ్మేందుకు వీల్లేదు. ఏమీ లేనివాండ్లని దగ్గరికి తీసారు. అంతో ఇంతో వెనకేసుకునేందుకు ఏదన్నా చేస్తే దిక్కేది?'

ఆమె మాటలకు హృదయంలో కలుక్కుమంది. బీదవాళ్లపై ఆమెకున్న తక్కువ అభిప్రాయానికి మనస్సు విలవిల్లాడింది. పై అంతస్థులోవుండి మాట్లాడుతున్న తులసమ్మ, తాను ఒక్కొక్క మెట్టు ఎక్కి పైకి వచ్చిందన్న జ్ఞానాన్ని కలిగి ఉండకపోవడం బాధ కలిగించింది. ఆమెతో ఏమీ మాట్లాడా లనిపించలేదు. స్నాన, భోజనాదులు వకానంగా ముగించి బట్టల షాపుకు చేరుకున్నారు. శంకరయ్య, మహదేవులు కష్టమర్సుకు బట్టలు చూపిస్తున్నారు. తానెళ్లగానే నమస్కరించినవారికేసి ఆదరంగా చూసి, వెళ్లి తన స్థానంలో కూర్చున్నాడు. ఒకొక్కరికి రశీదు వ్రాసిస్తూ, డబ్బు తీసుకొని చిల్లర యిస్తున్నాడు. నోట్లు పెట్టె నిండా నిండిపోయాయి. పది, ఐదు, ఒక రూపాయల నోట్లను వేనికవి వేర్వేరు కట్టలు కట్టి, దారంతో బిగించి, సొరుగులో దాచాడు.

ఇంతలో సూటు బూటు వేసుకున్న ఒకాయన, టెర్లిన్ బట్టల్లో మెరిసిపోతున్న మరొకావిడ వచ్చారు. వార్ని చూడగానే లేచి ఎదురెళ్లి, 'రండి, రండి' అని ఆహ్వానించాడు చిర్నవ్వు ముఖంతో.

'నా వైఫ్‌కి టెర్లిన్, టెరికాటన్ చీరెలు చూపించండి' అన్నాడాయన సల్ల

ప్రొద్దుటి
తాజాతనము
గంటలు తరబడి
రోజంతా



కొను స్నానం అయిన తరువాత ప్రొద్దుటి
పూటవుండే తాజాతనము రోజంతా
గంటల కొద్దీ వుంచుకోవచ్చు....పాండ్స్
డ్రీమ్ ఫ్లవర్ టాల్క్‌తో. భారతదేశంలో
విస్తారంగా అమ్ముడయే టాల్క్
పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్క్‌కు నాజూకైన
పరిమళము అల్లా వస్తూనే వుంటుంది..
పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్క్ తడిని
వెంటనే పీల్చుకుంటుంది,
అతిసన్నిహితంగా చేరాలనిపిస్తుంది....
చల్లగా, తాజాగా, పరిమళిస్తూ
వుంటుంది. ఉక్కతో ఒళ్లంత
అంటుకుంటూండే ఉష్ణ
ప్రదేశాల్లో కూడా. ఇది సంవత్సరం
పొడుగునా అన్నికాలాలలోను
వుపయోగించగల టాల్క్!
3 సైజులలో లభిస్తుంది
ఫ్యామిలీ-లార్జ్-మీడియమ్

పాండ్స్
డ్రీమ్ ఫ్లవర్ టాల్క్

అతి మృదువుగా ఉల్లాసకరమైన టాల్క్
చీజ్‌బ్రో-పాండ్స్ ఇన్ కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు ఎస్ ఎ లో స్థాపితము)

P.5182

కళ్ళజోడు తీస్తూ.

'చూపిస్తాను, మీరలా కూర్చోండి. మహదేవ్ ఆ ఫ్యాన్ వేయవయ్యా!' అని అతనితో అని, 'ఏం తెప్పించమంటారు? కాఫీయా, బోర్నవిటా? కూల్ డ్రింకా?'

ఆ వచ్చినతను సంతుష్టుడై, 'నో, నో, అక్కర్లేదు. క్లాత్స్ చూపించండి. దట్సాల్!' అన్నాడు చిర్నవ్వుతో.

నాలుగైదు రకాలవి తీసి ఒక్కొక్కదాని ఖరీదే చెప్పాడు. ఆవిడ విలాసంగా అన్నిటినీ తిరగేసి చూస్తూ, తన ఒంటికి ఆనించుకొని చూస్తూ పెదవి విరిచింది. ఆమె మొహంలోని భావాలను చదివిన వెంకట్రామయ్య సన్నగా నవ్వి, 'శంకరయ్యా, అ పైనున్నవి ఇలా తీసుకురా!' అని కేకేసాడు.

అతనవి తీసుకరాగానే ఒక్కొక్కటీ పర్చి చెబుతూ, 'ఇవి ఖరీదైనవి. ఇంతకన్నా మంచి డిజైన్లు మరి దొరకవు' అన్నాడు.

చూసిందే పలుమార్లు చూసి, ఆఖరుకు రెండుచీరెలు సెలెక్టు చేసుకుందావిడ.

'శంకరయ్యా! వీటిని ప్యాక్‌చేయి' అని చెప్పి, తానే రశీదు వ్రాసిచ్చి డబ్బివ్వగా పుచ్చుకొని, 'మళ్ళీ నోమారు దయ చేయండి. బొంబాయి నుంచి ఈ వారం రోజుల్లో కొత్త డిజైన్లు వస్తాయి' అన్నాడు చిర్నవ్వుతో.

వారెళ్ళిపోగనే, 'ఒక్కోదానికి పది రూపాయలు మన మామూలు లాభంకన్నా ఎక్కువ చెప్పారు!' అన్నాడు మహదేవు నవ్వుతూ.

'వారికది యిబ్బందిగా అనిపించదు మహదేవూ! డబ్బెక్కువైనదే నాణ్యమైనదనుకుంటారు.' అన్నాడు గంభీరంగా నవ్వుతూ.

కస్టమర్సు వస్తూనే వున్నారు, వెళ్తూనే వున్నారు.

'ఈ డ్రిల్లుక్లాతు యాభైపైసలు తక్కువ చేయండి తీసుకోవాలంటున్నారండి!' అన్నాడు శంకరయ్య బట్టను చూపిస్తూ.

'పరవాలేదు యిచ్చేయి'

'దానివల్ల మనకు లాభం ఉండదు'

'పోనీ లేవయ్యా! పాపం అతని దగ్గర డబ్బు గుంజడ మెందుకూ! ఈరోజు లాభమంతా టెర్లిన్ చీరల్లోనే వచ్చింది' అన్నాడు నవ్వుతూ.

వెళ్ళిపోయాడు శంకరయ్య.

మధ్యాహ్నమైంది. జనం రావడం తక్కువైంది. అడపాదడపా ఎవరో ఒకరు వస్తున్నారు. చేతినిండా పనిలేనందుకు ఆలోచనలు కమ్ముకు వస్తున్నాయి.

'మర్చేపోయాను నిన్నటితారీకు చింపనే లేదు' అంటూ మహదేవు లేచి, లక్ష్మీదేవి క్యాలెండర్‌లోని ఒకపేజీని చింపి వేశాడు.

పరధ్యానంగా అటుచూసిన వెంకట్రామయ్య ఆతారీకు కనిపించగానే ఉలిక్కిపడ్డాడు. 'అవును! ఇదే తారీకు! తన జీవనగతిని మార్చివేసిన పవిత్రదినమిదే!' మనస్సు గతంలోకి వెళ్ళింది.

ఆనాడు, మూటలోని చీరెలన్నీ అమ్ముకుని, డబ్బంతా సుందర్రామయ్య కప్పజెప్పి, తన కూలిడబ్బులు తీసుకోవాల్సిన వెంకట్రామయ్యను జూసి నిండుగా నవ్వింది తులసమ్మ.

'ఎందుకో అంత సంబరపడి పోతున్నావేమే? పిల్లవాడేడీ?' అనడిగాడు వెంకట్రామయ్య, భార్య నవ్వులోని అంతరార్థమేమిట్రా బోధపడక.

'చంద్రం బడినుంచింకా రాలేదు. మీరు నామాటవింటే మూర్ఛపోతారు!' అన్నది ఆ చిర్నవ్వింకా మాయకుండా.

'అంత గొప్పసంగతేమిటీ?' కుతూహలాన్ని నుచుకోలేక పోయాడు.

'గొప్ప సంగతే. ఇన్నేండ్లు డబ్బాలో వేసిన రూపాయల్ని మంచి దినమని ఈనాడే లెక్కబెట్టాను. ఎన్ని అయినాయో తెలుసాండీ!' కనుబొమ లెగరేస్తూ, కళ్ళు పెద్దవిచేస్తూ అన్నది.

ఆమె ఊరింపు మాటలకు ఆగలేకపోయాడు. అదెంతైందో తెలుసుకోవాలన్న కుతూహలానికి, ఆమె ఆలస్యం కోపం తెప్పించింది. 'చెప్పవే' అన్నాడు కోప్పడుతూ.

'అయిదువందలు!' గుండెపై చేయి వేసుకొని అంది.

'అయిదువందలే! నిజమా? నిజంగానే అంటున్నావే?' విస్మయానందాలతో ఆమెను కుదుపుతూ అన్నాడు.

'అవును, అయిదువందలు.'

'ఆఁ!'

వెంకట్రామయ్య నమ్మలేకపోతున్నాడు. 'తాను అయిదువందలు కూడబెట్టాడంటే అది మామూలు విషయంగాదు. తనేమిటి, ఐదువందలు జమచేయడమేమిటి?' అని లెక్కబెట్టేంతవరకూ మనస్సు కుదుటబడలేదు. గబగబావెళ్ళి డబ్బాను బోర్లించి, లెక్కబెట్టాడు.

'అవును, ఐదువందలు. అన్నట్లుగానే అయిదువందలు! అబ్బో, అయిదువందలు!!' గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మనస్సు సంతోషంతో తేలికై ఆకాశంలో రెక్కలు విప్పుకొని విహరించ సాగింది. ఏమేమో చేయాలన్న ఊహలు గజిబిజిగా అల్లుకుపోయి మనస్సును వ్యాపించేస్తున్నాయి. 'ఆ సుందర్రామయ్య చలవ వల్ల తానో స్థితికి రాగలిగాడు. తన కాళ్ళపై తను నిల్చుండే శక్తిని సంపాదించుకోగలిగాడు. అబ్బ, ఎంతహాయిగా వుంది మనసు కిప్పుడు! మొదట ఆయన దగ్గరికెళ్ళి, ఆయన కాళ్ళపై బడాలి. ఆయన అనుమతి పొందాలి. ఆయన ఆశీర్వాదంతో తన సొంత వ్యాపారం ప్రారంభించాలి.'

ఇక అక్కడ నిలువలేక సుందర్రామయ్య దగ్గరికి పరిగెత్తాడు. మాట తడబడుతూంటే ఆయనకు తన అభిప్రాయాన్ని చెప్పాడు.

'సరే నీయిష్టం వెంకట్రామయ్యా.. నువ్వో రేవుకు రాగలిగితే నాకూ సంతోషమే' అన్నాడు ఏ కల్మషమూ మనస్సులో పెట్టుకోక.

ఆయన కాళ్ళపై పడ్డాడు వెంకట్రామయ్య కృతజ్ఞతా భావంతో.

మరునాడు కొన్ని చీరెలు ఖరీదు చేసుకొని, మూట చంకనేసుకుని బయలుదేరి 'సొంత వ్యాపారం చేస్తున్నానన్న' సంతోషంతో యింకా ఎక్కువ ఊళ్ళు తిరిగాడు. అదృష్టదేవత కరుణ దృక్కులు ప్రసరించింది. దశ తిరిగింది. తొందరగా అమ్ముడయాయి. ఎక్కువ లాభాలు వచ్చాయి. ఇంకా ఎక్కువ చీరెలు ఖరీదు చేసాడు. ఇంకా ఎక్కువ లాభాలతో అమ్మాడు. కొత్తకొత్త రకాలని యింకా కొన్నాడు...

ఇంకా ఎక్కువ లాభాలు ...

సంవత్సరం కల్లా ఎన్నడూ వూహించనంత సంపాదించ గలిగాడు. తుఫానుల నెదుర్కొన్న జీవితనావ నిశ్చల, నిశ్శబ్ద, గంభీర వాతావరణంలోకి వచ్చింది.

'ఈ డబ్బు తీసుకోండి.'

ఉలిక్కిపడి చూశాడు వెంకట్రామయ్య. నోట్లు లెక్క పెడుతూ ఇస్తున్నా డాయన. శంకరయ్యనడిగి, రశీదు వ్రాసిచ్చి డబ్బు తీసుకున్నాడు. చిల్లరయిచ్చి పంపాడు.

రాత్రయింది. డబ్బు లెక్క బెట్టుకొని, కట్టలుగా కట్టి, సొరుగులో పెట్టి తాళంవేసి, గుమాస్తాలను వెళ్ళమనిచెప్పి, దుకాణం మూసి యింటికి వచ్చాడు వెంకట్రామయ్య.

చంద్రం సూటు వేసుకొని తయారై ఎటో వెళ్తున్నవాడు ఆయన్ని చూసి ఆగాడు.

'ఈరాత్రి ఎక్కడికి వెళ్తున్నావ్ చంద్రం?' అనడిగాడు.

'సిటీ కెళ్ళాలి నాన్నా. నా ఫ్రెండు సబిన్స్పెక్టర్ భాస్కర్ లేడూ, వాడి చిన్నాన్నయింట్లో డిన్నరుందట, రమ్మన్నాడు. ఈ రాత్రే వస్తాం. కాస్త ఆలస్యం కావచ్చు' అన్నాడు.

'వెళ్తే వెళ్ళావుగానీ, ఈ రాత్రికే గాకుండా రేపు రా చంద్రం. ఈ మధ్య ఈ ప్రాంతంలో దొంగలు తిరుగుతున్న సంగతి నీకు తెలుసు'

'ఫరవాలేదు నాన్నా పిస్టల్ తీసుకెళ్తున్నాను' అన్నాడు నిర్లక్ష్యంగా నవ్వుతూ.

అతడి ధోరణికి నిట్టూర్చాడు వెంకట్రామయ్య. 'నీ యిష్టం బాబూ!' అన్నాడు.

టకటక బూట్ల చప్పుడు చేస్తూ వెళ్ళిపోయాడు చంద్రం.

భోజనాలయేసరికి రాత్రి పదైంది. తనగదికి చేరుకొని మంచంపై కొరిగాడు వెంకట్రామయ్య. అలసటతో వెంటనే కన్ను మూతబడింది.

లైటేసిన చప్పుడు కాగానే కళ్ళు తెరిచాడు. ఎదురుగా ముగ్గురు భయంకర వ్యక్తులు, వి[illegible] దుస్తులేసుకొని, కళ్ళకు గంతలు కట్టుకొని తుపాకులతో నిల్చుండటం చూసి అదిరిపడి దిగ్గున లేచి కూర్చున్నాడు.

'కదలకు. ప్రాణాలు తీస్తాను' అన్నాడొకతను తుపాకి గురిపెడుతూ.

అయోమయంలో పడ్డాడాయన. వారెవరో మొదట అర్థం గాలేదు. కానీ పేపర్లలో తరచుగా చదువుతున్న వార్తలు గుర్తుకు రాగానే కుదుటపడ్డాడు. మనస్సుకు ధైర్యం తెచ్చుకున్నాడు. వారి ఉద్దేశాలేవో, వారి ప్రవర్తనల్లో, వారి చర్యల్లో గల ఆంతర్యమేమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

'ఎవరు మీరు? ఎందుకొచ్చారు?' అన్నాడు శాంతంగా.

'అదంతా నీ కనవసరం. తాళపుచేతులివ్వు. మా పనేదో మేం జూసుకొని వెళ్తాం. పిచ్చిపిచ్చి ప్రయత్నాలు చేస్తే ప్రాణాలు దక్కవు' కర్కశంగా వుందా కంఠం.

'ఏమిటి మీపని?'

'బిగ్గరగా నవ్వాడతను. 'మే మెవ్వరమో యింకా నీ కర్థం కాలేదా? ఈ ప్రాంతంవారందరికీ మే మెవ్వరమో, మా పనేమిటో తెలుసు.'

'ఏమిటిదంతా బాస్? నాన్సెన్స్. వాడితో నీకు మాటలేమిటి? నాలుగు తన్ని తాళం చేతులు లాక్కో' అన్నాడింకొకతను మండిపడుతూ—

'మీ పనేమిటో, మీ ఉద్దేశమేమిటో చెబితేగాని తాళంచేతులు యివ్వను' తొణక్కుండా అన్నాడాయన.


'ఇవ్వవూ? నీలాంటి పీనాసిగాండ్లందరూ అవే మాటలే యివి. నాలుగు తంతే లబో దిబోమంటూ నువ్వే చెబుతావ్' పైపైకి రాబోయిన అతన్ని చూసి బెదరలేదాయన. మనస్సులో ఒక విధమైన తెగువ కలిగింది. వారి గురించి పూర్తిగా తెలుసుకోనిదే లొంగిపోకూడదనుకున్నాడు.

'నా దగ్గర తాళపుచేతులు లేవు. అవెక్కడ పెట్టానో మీకు తెలీదు. కానీ అవి మీకిస్తాను, నేనడిగినవాటికి సమాధానం చెప్తేనే యిస్తాను. లేకుంటే మీరు నన్ను చంపినా ఆ చోటు చెప్పను'

సడలని అతని బింకాన్ని చూసి, అదరని అతని గుండె ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు వారు. కొరకరాని కొయ్యగా తయారైన అతన్నెలా లోబరుచుకోవాలో బోధపడలేదు వారికి.

'సరే చెబుతాను విను. విని తాళం చెవులు ఎక్కడున్నాయో చెప్పకుండానే హఠాత్తుగా గుండాగి చచ్చేవు.' అని ఆయన శాంత గంభీర వదనంలోకి చూస్తూ, 'నా పేరు నాగమల్లు. మా గ్యాంగ్‌కు బాస్‌ను నేను. అర్థమైందా?' అన్నాడు.

చిర్నవ్వుతో తలూపాడాయన. అంతకే



...తడు తొణకకపోవడం చూసి ఆశ్చర్య పోయాడు నాగుమల్లు. తన చరిత్రలో అంత గుండె నిబ్బరంగల మనిషిని చూడని అతను ఆయన సంగతేమిటో తెలుసుకోవా లనుకున్నాడు.

'నా పనేదో అడిగావు గదూ? చెప్తాను విను. ధనవంతుల్ని దోచుకోవడం, బీదవాండ్లకు పంచి పెట్టడమన్నది నా పవిత్ర లక్ష్యం! అది నెరవేర్చడమే నా పని' అన్నాడు నాగుమల్లు.

'అలాగా? మీరు దోచుకున్నది ఎంత మంది బీదవాండ్లకు పంచి పెట్టారు?'

'అబ్బ!' పళ్లు పట పట కొరికాడు నాగుమల్లు. నా మాటకు మా గ్యాంగు లోనే ఎదురు లేదు. నన్ను ఎదురు ప్రశ్న అడుగుతావా?' అన్నాడు గర్జిస్తూ.

'నీకు తాళంచేతులు గావాలా, వద్దా?' శాంతంగా అన్నాడు వెంకట్రామయ్య.

'కావాలి! అందుకోసమే వచ్చాం. నీ సర్వస్వం దోచుకుంటాం!'

'అదెంతమంది బీదవాళ్లకు పంచి పెడతారు?'

'అది నీ కనవసరం' గర్జించాడతను.

'కోప్పడకు మల్లూ! నే నడిగినదానికి విడమరచి సమాధానం చెప్పు. ధనవంతుల యొద్దలో డబ్బెందుకు దోచుకుంటు న్నావ్?'

ఆయన శాంత గంభీర ధోరణికి,

గాఢాంధకారంలో...

తొణకని నిండుదనానికి కొంచెం చలిం చాడు నాగుమల్లు. మిగిలిన యిద్దరూ చోద్యం చూస్తున్నట్టు చూస్తూండి పోయారు.

'మీ ధనవంతుల దగ్గరున్న డబ్బు దుర్వినియోగం అవుతున్నది. పేదవాండ్లు ఆకలికి మల మల మాడుతూంటే మీరు స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తున్నారు. అలా అయేందుకు వీల్లేదు. ఆ డబ్బును సద్విని యోగ పర్చాలి. అది మిమ్మల్ని దోచు కుంటేనే సాధ్యపడుతుంది.'

'కానా? సద్వినియోగ పరిచేందుకే గదా, ధనాన్ని దోచుకుంటున్నావ్! నువ్వు దోచుకున్న డబ్బు ఎలా సద్వినియోగ పర్చావో చెప్పు?'

నాగుమల్లు ఏం చెప్పాలో తోచక, సమాధానంకోసం తికమక పడుతూ మౌనం వహించాడు.

'ఏయ్! ఏమిటావాగుడు? బాస్! అలా నిలబడతావేం? నాలుగు తన్నాలా?' అన్నాడొకతను గర్జిస్తూ.

'నువ్వాగు డేవిడ్! అవును, ఎవరికీ పంచలేదు. కానీ బీదవాండ్లను పీడించి అన్యాయంగా మీరు ఆర్జిస్తున్న డబ్బును దోచుకుంటాం.'


'నా కథ వింటావా? విని నీకు తోచి నట్టుగా ప్రవర్తించు. నేను అన్యాయంగా ధనాన్ని సంపాదించానని తోస్తే, నీ కిష్ట వచ్చిన రీతిగా దోచుకుపో. నేను సంపా దించిన ఈ ధనం చెమటోడ్చి, నా రక్తాన్ని కండబల్నా నీరుగా మార్చగా లభించింది. ఒకప్పుడు నేనుగూడా బీదవాణ్ణే. తిండికి గతిలేక, భార్యా బిడ్డలు ఆకలితో అలమ టిస్తూ అష్టకష్టాలు పడ్డవాణ్ణే కానీ మీలాగా ఏ ధనవంతుణ్ణీ దోచుకోలేదు. కష్టపడ్డాను, సంపాదించాను. దైవ కృప వలన ఈస్థితికి చేరుకోగలిగాను.'

ఆశ్చర్యంగా వింటున్నాడు నాగుమల్లు.

'ఇంతధనం సంపాదించినా బీదల నెన్నడూ హింసించలేదు. వారి బాధ కున్నాను. ఒకప్పుడు నాలాగే ఆకలికి అలమటించిన వారిని చేరదీశాను. నా వ్యాపారంలోనైనా బీదలకు అన్యాయం జరుగనివ్వలేదు. ధనవంతులనుండి డబ్బు ఎక్కువ గుంజినా, లాభమివ్వలేని స్థితిలో నున్నప్పుడు లేనివారినుండి లాభా లాశించ లేదు. ఒక్కొక్కప్పుడు నాకెంత నష్టం వచ్చినా యిచ్చివేసేను. నా గొప్పలు చెప్పుకోవడం గాదుగానీ, నా దుకాణంలో వున్న గుమాస్తాలూ, నా తోటమాలీ, మా యింట్లో వున్న పనివారూ అందరూ మొదట ఆకలికి అలమటించిన వారే. వారికో ఆధారం లభించింది వారు కష్ట పడి బాగుపడితే నాకంతకన్నా ఆనందం ఉండదు. మీరు బీదవారుగదా, డబ్బులేక గదా మీరీస్థితికి దిగజారింది? రండి మీకు పనులిప్పిస్తాను, మీకో ఆధారం చూపి స్తాను. నాలాగే కష్టపడండి, డబ్బు సంపాదించండి, సుఖపడండి.

'మల్లూ! పదిమంది బీదవాండ్లను ఆదుకున్నది నేనా? డబ్బును కొల్లగొట్టి అనుభవిస్తున్న నువ్వా?'

నాగుమల్లుకు తల తిరిగిపోతున్నది. 'నిజమే! తాను డబ్బును ధనవంతుల ఖజానాల నుండి కొల్లగొట్టడమే కానీ, ఎన్నడూ పేదలకు పంచియివ్వ లేదు. తనదగ్గర డబ్బు మూలుగుతున్నది. తనూ ధనవంతు డయ్యాడు. కానీ ఏ మార్గం వలన? ధనవంతుల నిర్మూలించాలన్న తన వాదానికే, తన లక్ష్యానికే తాను వ్యతిరేకి అయ్యాడు. తానుసరిస్తున్నది నీతిమార్గమన్న తనది! పవిత్ర లక్ష్యమతి



కురిపించేవాడు. కాని యిప్పుడు...?'

'నేను ఆవేశంగా మాట్లాడినందుకు నాపై కోపం తెచ్చుకోకు మల్లూ! నువ్వీ ధనాన్ని సద్వినియోగ పరుస్తానని త్రికరణ శుద్ధిగా వాగ్దానమిస్తే, నా స్వహస్తాలతోనే నీకీధనాన్ని అప్పగిస్తాను ఆ వాగ్దానం యివ్వగలవా మల్లూ? మాట్లాడవేం?'

ఆయన ముఖం లోకి సూటిగ చూసాడు నాగుమల్లు. ఆ శాంత గంభీర వదనా న్నవలోకించలేక చూపు మరల్చుకొని, 'పదండ్రా, యింకోచోటికి వెళ్దాం' అన్నాడు వెనక్కి తిరుగుతూ.

'ఒరేయ్! బాస్‌వైనా నీకు బుద్ధుందా? ఇంత కష్టపడివచ్చి వెనక్కుబోవటమా? ముసలాడేదో స్వీడ్‌గా వాగుతే నువ్వు ఫూల్‌వై మమ్మల్ని ఫూల్స్‌చేస్తావుట్రా? వాడంతేదో నేను తేల్చుకుంటాను చూడు' అరుస్తూ ముందుకు రాబోతున్న డేవిడ్ చేయి పట్టుకు వెనక్కి లాగాడు మల్లు.

'ఖాన్! పిడ్ని పట్టుకో. పదండి వెళ్దాం' అన్నాడు.

డేవిడ్ ఎగిరి పడటం చూసి, 'నే చెప్పినట్టుగా వినకపోయావో షూట్ చేస్తాను' అన్నాడు నాగుమల్లు కోపంగా.

'ఉగ్! నన్ను షూట్ చేస్తావుట్రా రాస్కెల్!' పళ్ళు పటపట కొరుకుతూ బాకుని నాగుమల్లు గుండెల్లోకి పేల్చాడు డేవిడ్.


'దేవుడా!' అంటూ పడిపోయాడు నాగుమల్లు.

వెన్వెంటనే 'ఓ గాడ్!' అంటూ నేల కొరిగిపోయాడు డేవిడ్.


'హాండ్సప్! కదిలావంటే కాల్చేస్తా!' అంటూ ఖాన్ వెన్నుపై పిస్తలుంచి అరిచిన చంద్రాన్ని చూసి విస్తుపోయాడు వెంకట్రామయ్య. హఠాత్తుగా జరిగిపోయిన ఆ సంఘటనకు తల తిరిగిపోయింది.

బాధతో మెలికలు తిరుగుతున్న నాగుమల్లు దగ్గరికి వెళ్ళి, 'ఎంతపని జరిగిపోయింది మల్లూ!' అన్నాడు కన్నీటి మధ్య.

బాధతో పొర్లుతూ, గాయాన్ని చేతో అదుముకుంటూ, వెంకట్రామయ్య కళ్ళల్లోకి చూస్తూ చిన్నగా నవ్వాడు నాగుమల్లు.



సీరియల్



జరిగిన కథ

శ్యామల రాధలతో పాటు మాధవిని కూడా స్వంత కూతుర్లాగే పెంచింది పరమేశ్వరి. శివప్రసాద్‌కి మాధవి మీద కంటే మాధవి తెచ్చే జీతం మీద అభిమానం ఎక్కువ. శ్యామలకి రాజారావుతో పెళ్ళయింది. శ్యామల బిడ్డని కని కన్ను మూసింది. ఆ బిడ్డభారం మాధవిపై పడింది. ఆ యింట్లోనే అద్దెకుంటున్న మధు మాధవిని ప్రేమించాడు. మాధవిని రాజారావు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడని తెలుసుకుని మధు కలత చెందాడు. రాధ తిరుగుళ్ళ గురించి మాధవి హెచ్చరించవలసి వస్తుంది.

10

ఆ ఉత్తరం రాసి తీరా పోస్టుబాక్సులో వేశాక తను చేసింది అంత మంచి పని కాదేమో అనిపించింది మాధవికి. 'శకుంతలను తీసుకొని ప్రయాణం అవుదామనుకుంటున్నాను' అన్న చివరి వాక్యం ఆమె మనస్సును ముల్లులా తొలవసాగింది. తను త్వరపడలేదు కదా? అలా రాసి వుండాల్సింది కాదు. బావ ఆ వాక్యం చదివి ఏమనుకుంటాడు! ఇలాంటి విషయాల్లో ఆడది తొందరపడి అడుగు ముందుకు వెయ్యకూడదు. మగవాడు చెయ్యి చాచేంత వరకూ, ఆడది తన చేతిని అందించటానికి కలవరపడుతున్నట్లు కనిపించకూడదు. తను తొందరపడిందా నిజంగా!

కాని బావ, తనను మౌనంగా కళ్ళతోనే ఆరాధించే బావ, తను అలా రాసినందుకు ఏమీ అనుకోడు! బావ మనస్సులోని ఆర్ద్రత అతని ప్రతి మాటలోనూ కనిపిస్తుంది. తన ఉత్తరం చూసి బావ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయి పోతాడు! మరుక్షణంలోనే రెక్కలు కట్టుకొని వచ్చి తనముందు వాలిపోతాడు.

బావ తన జీవితంలోకి ఈ విధంగా ప్రవేశిస్తాడని ఏనాడైనా ఊహించిందా? అక్కయ్య చనిపోతుందనీ, అక్కయ్య కన్న బిడ్డ భారం తనమీద పడుతుందనీ కలలోనైనా తలచిందా? మనిషి అనుకొనేది ఒకటి—జరిగేది మరొకటి. మనిషి విధి చేతిలోని కీలుబొమ్మ. తను అనుకున్నదంతా జరిగితే అంతా తన ప్రయోజనమే నన్నుకొంటాడు. అలా కాకపోతే విధిని నిందిస్తాడు.

మధు అనుకోకుండా తన జీవితం నుంచి నిష్క్రమించాడు. మాధవిని మధు జ్ఞాపకం కలవరపెట్టింది.

మధుకు తను ద్రోహం చెయ్యటం లేదు కదా? మధును తను ప్రేమించాననుకోవటం వట్టి భ్రమేనా? లేకపోతే మధును అంత త్వరగా ఎలా మర్చిపో కలిగింది? తను మధును మర్చిపోయిందా? లేదు! ఇంతకాలంగా మధును మర్చిపోయినట్లు తనను తానే భ్రమ పెట్టుకొంది. మధు మొరటుగా తన మనస్సులోని సున్నిత భావాలను నొప్పించాడు. అందువల్లనే తన మనస్సు అతనిమీద విముఖత్వాన్ని వహించింది. మధ్యాహ్నం ఎండలా యవ్వనం తనను కాల్చేస్తూ వుండగా, మధుకలశంలా వున్న తన మనస్సు మొదటిసారిగా మధును చూసినప్పుడు తొణికింది. ఆనాడు...తను ఏనాటికీ మర్చిపోలేని ఆనాడు...కనుచీకటి పడుతుండగా కాలేజీనుంచి తను ఇంటికి వచ్చింది. వాకిట్లో పెదనాన్నతో మాట్లాడుతున్న పొడవాటి యువకుణ్ణి తనకు తెలియకుండానే మంత్రముగ్ధలా చూస్తూ నిల్చుండిపోయింది కొద్దినిముషాలు. తరవాత పెదనాన్న, పెద్దమ్మతో అతన్ని గురించి ఏదో చెబుతూ వుంటే తను శ్వాస బిగబట్టి, వళ్ళంతా చెవులు చేసుకొని వినసాగింది. ఆ అబ్బాయిపేరు మధుసూదనరావనీ, గది అద్దెకోసం వచ్చాడనీ విన్నది. తమ ఇంటికి అతను అద్దెకొస్తున్నాడని విని తన హృదయం ఇంద్రధనస్సే అయింది.


మధు తిరిగిన గదిలోని గాలిని పీల్చటానికీ, మధు తాకిన వస్తువుల స్పర్శ సుఖాన్ని అనుభవించటానికి తన మనస్సు తహతహ లాడిపోయేది. అతను లేని సమయాల్లో ఆ గదిని ఊడ్చి, సర్ది, ఏదో సంతృప్తి పొందేది. మధు ప్రేమాభిమానాలను పొంది అంతవరకూ జీవితంలో తను రుచిచూసిన చేదును మర్చిపోగలిగింది. మధు మొదటిసారిగా తన హృదయ కవాటాన్ని తెరిచాడు. వాకిట్లోనే నిలబడిపోయాడు. కాని బావ అనుకోకుండా, తెరచివున్న ద్వారంనుంచి లోపలకు ప్రవే

శించాడు. అది చూసి మధు అలిగి వాకిట్లోనుంచే తిరిగి వెళ్ళిపోయాడు. బావ తనకు కావాల్సినవస్తువుకోసం చేతులు చాచాడు. మధు తనకు సులభంగా లభ్యమయే వస్తువును వదిలేసి, అభిమానపడి వెళ్ళిపోయాడు.

బావ! మధు! ఇద్దరి స్వభావంలో వింత వైవిధ్యం వుంది! మధు స్వభావం ఎత్తునుంచి కిందకు దూకే జలపాతం వంటిది. అందులోని ఆవేగం, చుట్టుపక్కల వాతావరణాన్ని ఉద్రిక్తపరుస్తుంది, ఉరకలు తీయిస్తుంది, ఇట్టే ఆకర్షిస్తుంది. బావ స్వభావం నిర్మల ప్రశాంత సరోవరం లాటిది. జలపాతంలో వుండే ఉద్రేకం, ఆకర్షణా, రంగుల్మా, సరోవరంలో వుండవు. కాని అలసటతో, దాహంతో దరిచేరిన బాటసారి దాహం తీర్చి, బడలికను పోగొట్ట గల శక్తి సరోవరానికి వుంది. జలపాతం దాహంగొన్న బాటసారిని ఆకర్షించలేదు. తను జీవితంలో అలసిపోయింది. ఇరవై ఏళ్ల బ్రతుకులో ఏడు జన్మల బడలికను పొందింది పసితనంలోనే బ్రతుకుభారం తెలుసుకొన్న తను చాలాకాలంగా అలసిపోయి వుంది. తనకు బడలిక తీర్చగల చల్లని ఆశ్రయం కావాలి. బావ అమృత హృదయుడు. అర్థం చేసుకోగల సహృదయుడు. తనకు రక్షణ కావాలి. భద్రత కావాలి.

ఆనాడంతా మాధవి మనస్సు పరిపరి విధాల మథనపడ సాగింది. వివేకం ఆమెను రాజారావు వైపుకు లాగుతూంటే, హృదయం మధు వైపుకు లాగుతోంది. బుర్రంతా ఆలోచనలతో చెదల పుట్టలా వుంది.

పాయంత్రం గడపలో అడుగు పెట్టిన మాధవికి రాధ ఎదురైంది. చక్కగా ముస్తాబు చేసుకొని ఎక్కడికో బయలు దేరింది. రాధ వంటిమీద కనీసం నలభై రూపాయలైనా ఖరీదుచేసే టెర్లిన్ చీర వుంది. మాధవి చూపులు అప్రయత్నంగానే తను కట్టుకొని వున్న చీరమీదకు మరలాయి. పదిహేను రూపాయల ఫోనిక్స్ వాయిల్ చీర. అదీ బాగా పాత పడి తన బ్రతుకులాగే వెలవెల పోతూ వుంది అనుకుంది మాధవి హైహీల్స్ టకటక లాడించుకుంటూ వెళ్ళిపోతున్న రాధను



చూస్తూ నిలబడిపోయింది మాధవి.

మాధవి లోపలకు వస్తూనే 'పెద్దమ్మా! రాధ ఎక్కడకు ఈ వేళప్పుడు వెళ్తుంది?' అడిగింది పరమేశ్వరిని.

'ఎవరో స్నేహితురాలు సినిమాకు రమ్మందట! ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళింది.' అంది చేటలో వున్న బియ్యంలోని వెడ్డలను ఏరివేస్తూ తల ఎత్తకుండానే పరమేశ్వరి.

పరమేశ్వరి అమాయకత్వం మాధవికి చిరాకు కలిగించింది. ఏం మనుషులో! తల్లీ దండ్రీ తమ పిల్లల ప్రవర్తనను గురించి ఎందుకు ఆలోచించరు? పెద్దమ్మకి అర్థం కాకపోవచ్చు. కాని పెదనాన్న అంత తెలివితక్కువ వాడేం కాదు. తనకు శ్రమ లేకుండానే, ఆడపిల్ల తనకి కావాల్సినవేవో తనే సంపాదించుకుంటోందని తెలిసీ తెలియనట్టు వుంటున్నాడా? మాధవికి పెదనాన్న మీద అసహ్యం వేసింది.

పెద్దమ్మకు రాధ వ్యవహారం ఏం బాగా లేదని చెప్పేస్తే! కాస్త అదుపులోనైనా పెడుతుంది. కాని పెద్దమ్మమాట రాధ లక్ష్యపెట్టదు. అందువల్ల ప్రయోజనం ఏమీ వుండదు, పెద్దమ్మను బాధ పెట్టడం తప్పించి. ఆ మాట కొస్తే రాధ ఎవర్నీ లక్ష్యపెట్టదు. మళ్ళీ నవలలు తెగ చదువుతుంది. అప్పుడప్పుడు కథలూ అవీ రాస్తూ వుంటుంది. కాని

అపరాజిత

లాభం ఏముంది? ఆడపిల్లకు వుండవలసిన ఒద్దికా, మర్యాదా బొత్తిగా లేదు. వాస్తవాన్ని వదలి ఎప్పుడూ ఊహాలోకాల్లో విహరిస్తూంటున్నట్టు కనిపిస్తుంది.

బాత్‌రూంలో మొఖం కడుక్కొని తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ లోపలికి వచ్చిన మాధవితో పరమేశ్వరి అంది కాఫీగ్లాసు అందిస్తూ.

'మధూ! చూడమ్మా! నా చీరలు బొత్తిగా చిరిగిపోయాయి.'

'మొదటి తారీఖున తెస్తాలే పెద్దమ్మా!' అంది మాధవి.

'అమ్మాయ్! నా పంచెలు కూడా బొత్తిగా చిరిగిపోయాయ్! చెప్పులు చూడు మరీ ఎలా తెగిపోయాయో!' అప్పుడే లోపలకు వచ్చిన శివశాస్త్రి అందుకున్నాడు.

మాధవికి వళ్ళు మండిపోయింది. 'ఎలాగన్నా చావండి. ఇక ఈ సంసారాన్ని ఈదటం నావల్ల కాదు.' అనాలనుకుంది. 'అలాగే పెదనాన్నా!' అని మాత్రం అనగలిగింది. మాధవికి ఎందుకో చెప్పలేనంత దుఃఖం పొర్లుకొచ్చింది. అక్కడనుంచి గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది. మంచానికి అడ్డం పడింది. కళ్ళు మూసుకుంది. అందరూ తనను తమ స్వార్థంకోసం ఉపయోగించుకో చూసేవాళ్ళే, తనకేం కావాలో అడిగేవాళ్ళు కానీ, అర్థం చేసుకొనే వాళ్ళు కాని లేరు. ఒకప్పుడు మధు ఉండేవాడు. కాని ఆ మధు కూడా తనను సరిగా అర్థం చేసుకోలేకపోయాడు. మధుతో అంత సహసించలేదు. పసివాడి మనస్తత్వం. ఆలోచించి అర్థం చేసుకోగలవాడు రాజా ఒక్కడే.

ఆ రాత్రి మాధవికి అన్నం తినాలని పించలేదు. పరమేశ్వరి ఎన్నిసార్లు భోజనానికి పిల్చినా వినిపించుకోనట్టే కళ్ళు మూసుకొని పడుకుంది. అలాగే నిద్రపోయింది. తెలవారుతూనే శకుంతలను తీసుకొని తను బావదగ్గరకి వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాకనే ఆమెకు నిద్రపట్టింది.


తెల్లవారి లేచి మామూలుగానే అన్ని పనులూ ముగించుకొని కాలేజీకి బయలుదేరింది. తీరా ఉత్తరం రాసింది కాని రాజారావు నుంచి సమాధానం లేకుండా బయలుదేరాలంటే ఏదో అభిమానం అడ్డు పడింది. తన ఉత్తరం చూడగానే రాజా రానే వచ్చేస్తాడని ఆశించింది.

మాధవి రాజారావు రాకకోసం ఎదురు చూసి నిరాశ చెందింది. వారం గడిచినా అతనినుంచి ఉత్తరమైనా రాకపోవటంతో అభిమానపడసాగింది. తను తొందరపడి ఉత్తరం రాసినందుకు సిగ్గుపడసాగింది. మనస్సు పరిపరి విధాల ఆలోచించసాగింది.

ఆ రోజు కాలేజీలో వుండగా పోస్టుమాన్ రెండు కవర్లు తెచ్చి ఇచ్చాడు. ఒకటి రాజారావు నుంచి వచ్చిన ఉత్తరం. రెండో కవరు సంతకం పెట్టించుకొని ఇచ్చాడు. అదికూడా రాజారావునుంచే వచ్చింది. మాధవి కవరు విప్పి చూస్తే నాలుగు వేలకు బ్యాంక్ చెక్ వుంది. మాధవికి ఏమీ అర్థం కాలేదు. రెండో కవరు తెరచింది. రాజారావు మాధవికి రాసిన ఉత్తరం. అంత పెద్ద ఉత్తరం, బ్యాంక్ చెక్, ఆమెలో ఏవేవో అనుమానాలు రేపాయి. ఆత్రంగా ఉత్తరం చదవసాగింది.

'మాధవీ!

మాధూ! బావ ఎదురుగా నిల్చొని




శుభోదయమ్ముతో
విశిష్ట జీవితము
పనిపాటలతో అవశ్య భోగ్యము
రుచిసంపద అపూర్వమది
ఘుమఘుమల గుబాళింపు
A-1 డస్ట్‌ను వాడండి
డబ్బులు ఆదాచేస్తుంది!
Brooke Bond Tea
Brooke Bond
A-1 Dust Tea
బ్రూక్ బాండ్ A-1 డస్ట్
ప్యాకెట్టుకు హెచ్చు కప్పుల మంచి టీ
BB 5379

అపరాజిత

పిల్చినట్లే అనిపించింది. అలా పిలుస్తున్నప్పుడు బావ కంఠం ఎంత మెత్తగా వుంటుందో! మాధవి ఉత్తరం మీదకు కళ్లు తిప్పింది.

'నీ ఉత్తరం అందింది. చదివాను. చాలా బాధ కలిగింది.'

మాధవి ముందుకు చదవలేక పోయింది. బావకు తన ఉత్తరం బాధను కలిగించిందా? బావ తన ఉత్తరం చదివి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతాడనుకొన్న తన ఉత్తరం బావకు బాధను కలిగించిందా?

'నీ ఉత్తరం చదివాను. మరోసారి... మరోసారి చదివాను. అలా ఎన్నిసార్లు చదివానో చెప్పలేను.'

మాధవి తేలిగ్గా నిట్టూర్చింది. అనవసరంగా భయపడినందుకు, తనలో తనే నవ్వుకుంది.

'ఉత్తరం ఆలోచించాను. చాలా చాలా ఆలోచించాను. ఎంతో ఆలోచించే ఈ నిర్ణయానికి రాగలిగాను.'

మాధవి ఊపిరి బిగబట్టి చదవసాగింది.

'మాధవీ నన్ను నీవు చాలా స్వార్థపరుడుగా ఊహించి వుంటావు గదూ? అవును మాధవీ! నేను చాలా స్వార్థంగా ప్రవర్తించాను. నాకు ఊహ తెలిసింతరవాత నేను ఎన్నడూ ఇంత చిన్నవాణ్ణిగా ప్రవర్తించలేదు. కేవలం నీకోసం...నిన్ను నా దాన్ని చేసుకోవటంకోసం, చాలా సంకుచితంగా ప్రవర్తించాను. నీ సున్నితమైన మనస్సును నొప్పించాను. నిన్ను, నువ్వు ప్రేమించే వ్యక్తినుంచి దూరం చేశాను. అయినా, నువ్వు నన్ను నిందించలేదు. అసహ్యించుకోలేదు. నువ్వు కారుణ్యమూర్తివి మాధవీ! నువ్వు చాలా ఎత్తైన దానివి. అందుకే నామీద జాలితో, నీకు నీ అక్కయ్య అంటే వున్న అభిమానంతో...ఆమె కిచ్చిన వాగ్దానానికి బద్ధురాలివై శకుంతలకోసం, నీ ప్రేమను సహితం త్యాగం చెయ్యటానికి సిద్ధపడ్డావు.'

ఏమిటి ఇలా రాస్తున్నాడు. బావ బహుశా తనను...కాదు...బావ ఎప్పటికీ ఇలా రాయడు. బావకు తను కావాలి ఆ కళ్లలో ఎంత ఆరాధనా, ఆర్తి? తనకోసం ఎంత తపన.

'నన్ను అర్థం చేసుకుంటావు గదూ మాధవీ! నిన్ను ఇలా సంబోధించే అధికారం నాకు లేదని నాకు తెలుసు. అయినా నిన్ను ఇలా పిలవటమే నాకు ఇష్టం. నువ్వు మధును ప్రేమిస్తున్నట్లు నాకు తెలియదు. మధు నువ్వంటే పడి చస్తాడని, నిన్ను తనదాన్నిగా చేసుకోవాలని నీకు డబ్బు అప్పు ఇచ్చాడని తలచాను. అతను చేసిన సహాయానికి కృతజ్ఞతతో నువ్వు కట్టుబడి వుండాల్సి వస్తుందను కున్నాను. అందువల్లనే నిన్ను ఋణ విముక్తను చేద్దామని, నిన్ను నా దాన్నిగా చేసుకుందామని ఆశ పడ్డాను. నిన్ను నా దానినిగా చేసుకోవాలనే ఆర్తి నాలో ఈనాడు రగిలింది కాదు. ఏనాడో...పెళ్లి మావుంకు వచ్చిన, నాడే...నిన్ను చూసిన ప్రథమ క్షణంలోనే నేను ఇంతకాలంగా నా కలల్లో...ఊహల్లో వెతుక్కుంటూ న్నది నిన్నేనని గుర్తించాను. నిన్ను చూడగానే నాకు నువ్వు, నాలో మరుగు పడిన ఏదో మధుర స్మృతిలా అనిపించావు. నువ్వే పెళ్లికూతురిగా ఊహించుకున్న నా మనస్సు తన చుట్టూ ఓ సుందర ప్రపంచాన్నే అల్లేసుకుంది. కాని దురదృష్టవంతుణ్ణి, ఆ ప్రపంచంలో ఎంతోసేపు వుండలేక పోయాను. ఎవరో నన్ను బలవంతంగా ఆ ప్రపంచం నుంచి క్రిందకు తోసేశారు. సుఖస్వప్నం చూస్తూ ఆనంద డోలికల్లో ఊగిపోతున్న నన్ను బలవంతంగా నిద్రనుంచి లేపారు. స్వప్నం చెదిరిపోయింది. మనస్సు విరిగి పోయింది. నువ్వు పెళ్లికూతురువు కావని, నీ అక్క పెళ్లికూతురని తెలిసింది. వెంటనే అక్కడనుంచి వెళ్లిపోవాలనిపించింది. కాని అలా వెళ్లిపోలేకపోయాను. కారణం నువ్వేనంటే నమ్ముతావు కదూ? ఆ ఇంటి వాతావరణం బాగా వురిపెట్టిన తాడులా వుందని గ్రహించాను. అందరూ బిగుసుకొనిపోయి వున్నట్లు కనిపించారు. నీ పెద్ద కళ్లలో ఏదో ఆందోళన కనిపించింది. మీ అక్కయ్య వివాహం ఆ ఇంటికి ఓ పెద్ద సమస్యగా పరిణమించిందని గ్రహించాను. ఆ ఇంటిలో నువ్వు కూడా

వున్నావు కనుక, ఆ ఇంటికి నాకూ ఏదో అనుబంధం వున్నట్లు అనిపించింది. ఆ ఇంటి సమస్యను పరిష్కరించగలగటం నాకు వో అదృష్టంగా అనిపించింది. మీ అక్కయ్యను వివాహం చేసుకోవటానికి అంగీకరించాను. కట్నం మా నాన్నగారి ప్రోద్బలంవల్ల తీసుకోక తప్పిందికాదు. అలాగని పక్షంలో మా నాన్న ఈ వివాహానికి అంగీకరించరని నాకు తెలుసు.


మీ అక్కయ్యను భార్యగా, జీవిత భాగస్వామినిగా గౌరవించగలిగానేకాని ప్రేమించలేకపోయాను. మీ అక్కయ్య అకాలమరణానికి గురికావటం, శకుంతల బాధ్యత నీ మీద పడటం చిత్రంగా లేదూ? మోడు వారిన నా జీవిత తరువు నాకు తెలియకుండానే చిగుళ్లు వేయసాగింది. కళ్లలోనే కరిగిపోయిన కలల్ని కళ్ల ఎదుట చూడాలనే కాంక్ష మరోసారి తల ఎత్తింది. నిన్ను నాదాన్ని చేసుకోవాలనే వాంఛ తీవ్రం అయింది. నువ్వు మధును ప్రేమిస్తున్నావనే అనుమానం కలిగినా, నాలోని స్వార్థం ఆ అనుమానాన్ని జోకొట్టి నిద్రపుచ్చటానికి ప్రయత్నించింది. ఆనాడు మధును కలుసుకోవటానికి నువ్వు పడిన ఆరాటం, కలుసుకోలేక పోయినందుకు పొందిన ఆవేదనా నాకు అర్థం కాకపోలేదు. అయినా అర్థం కానట్లే నటించాను. నిన్ను నాతో పార్కుకు రావలసిందిగా బలవంతం చేశాను. అయిష్టంగానే నాతో పార్కుకు వచ్చావు. నీ మనస్సు సున్నితం. ఇతరులను నీ కారణంగా నువ్వు బాధ పడనివ్వవు. అందుకే నువ్వు బాధపడి, నాతో పార్కుకు వచ్చావు.'

మాధవి ఉత్తరంనుంచి తల పైకెత్తి వో క్షణం ఎక్కడకో దూరాలకు, ఆలోచనారహితంగా చూస్తూ వుండిపోయింది.

'ఆ రోజు నన్ను వివాహం చేసుకోమని, నిన్ను ఒప్పించటానికి అనేక విధాల ప్రయత్నించాను. ఇంటికి వచ్చాక నాలోకి నేను తిరిగివచ్చాను. తాపీగా ఆ విషయం గురించి ఆలోచించాను. నేను ఎంత సంకుచితంగా ప్రవర్తించానో అర్థం చేసుకున్నాను. నా ప్రేమ మీద నాకే చిన్నచూపు ఏర్పడింది. అందులో స్వార్థపు వాసన వున్నట్లు గ్రహించాను. పవిత్ర ప్రేమ ఎప్పుడూ తను ప్రేమిస్తున్న వ్యక్తులనుంచి దేనిని పొందుదామా అని ఆరాటపడదు. తను ప్రేమిస్తున్న వ్యక్తులకు తాను ఏమి ఇవ్వగలదా అనే తహతహ మాత్రమే తెలుసు నిజమైన ప్రేమకు. ఆలోచించాను... ఆలోచించాను ...ఎన్నో రాత్రిళ్లు ఆలోచిస్తూనే గడిపాను. శకుంతల మిషతో నిన్ను నాదానినిగా చేసుకోవటానికి ప్రయత్నించటం, ఎంత అల్పత్వమో తెలుసుకొని సిగ్గుపడ్డాను. బలవంతంగా, నీ ఇష్టానికి వ్యతిరేకంగా, నిన్ను నాదాన్ని చేసుకోవటానికి ప్రయత్నించాను. నా సుఖం కోసం ...నా ఆనందంకోసం...నా ప్రేమకోసం... నీ సుఖాన్ని...నీ ఆనందాన్ని...నీ ప్రేమనూ ...నలిపి వేయటానికి ప్రయత్నించాను. మాధవీ...మాధవీ...నిన్ను ఇలా పిలవటం ఆఖరుసారే కావచ్చు... నన్ను క్షమిస్తావు గదూ ?'

మాధవి చేతిలో కాగితాలు గాలికి రెపరెపలాడాయి. ఆమె గుండెలు దడదడలాడాయి. అయితే బావ... కాదు... అలా ఎన్నటికీ కాదు...ఊపిరి బిగబట్టి ముందుకు చదవ సాగింది.

'నేనే నీకు ఉత్తరం రాయాలనుకున్నాను. నీనుంచే ఉత్తరం వచ్చింది. మధు వెళ్లిపోయాడని రాశావు. బహుశా మధు కోపగించుకొని వెళ్లివుంటాడు. అలా మధు వెళ్లి పోవటం నీ మనస్సును లోతుగా గాయపరచింది. చాలా లోతైన గాయం తగిలినప్పుడు వెంటనే బాధ తెలియదు. మధు అలా వెళ్లిపోయినందున, నువ్వు బాధపడుతున్నావో లేదో కూడా నీకు తెలియనంతగా దిమ్మెరపోయావు. ఎంతో లోతుగా దెబ్బతగలటం వల్లనే నీకు జీవితంమీద విరక్తి కలిగింది. దెబ్బతిన్న ప్రేమ నీలో ద్వేషంగా మారింది. నీకు తెలియకుండానే మధు మీద ప్రతీకారం తీసుకోవాలనే కసి నీలో బయలుదేరింది. అందువల్లనే నీవు నాకు ఆ ఉత్తరం రాశావు. శకుంతలను తీసుకొని వస్తున్నానని రాశావు. కాని నేను నిన్ను భార్యగా స్వీకరించిన మరుక్షణంలోనే, నీలోని ప్రతీకారేచ్ఛ చల్లారుతుందనీ, ప్రతీకారం తీర్చుకోగలిగిన ద్వేషం పశ్చాత్తాపంగా మారుతుందనీ, పశ్చాత్తాపాగ్నిలో దగ్ధం అయిన ప్రేమ తప్త స్వర్ణంలా కల్మషరహితంగా హృదయాన్నంతా ఆక్రమించుకుంటుందనీ నీకు తెలియదు. ఆతరవాత నువ్వు చేసిన తప్పు గ్రహించుకొని కుమిలిపోతావు. మధుకోసం రోదిస్తావు. అదీకాక నీకు నేనంటే జాలి. జాలి వల్లనే ఆవేశంలో ఇంత త్యాగానికి తయారయావు. నాకు కావాల్సింది జాలి కాదు.



నామీద ఎవరైనా జాలి చూపటాన్ని నేను భరించలేను. అది నా స్వభావానికి విరుద్ధం. నాకు కావాల్సింది నీమనస్సు. అది నీదగ్గర లేదని నాకు తెలుసు. మధుకు కోపం రావటంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఆనాడు మనిద్దర్నీ పార్కులో చూసి వుంటాడు. అందుకే అలిగి వెళ్ళిపోయి వుంటాడు. అంతమాత్రానికే అభిమాన పడిపోతే ఎలా మాధవీ! ప్రేమ...అభిమానం ... రెండు కత్తులు ఒక ఒరలో ఇమడవన్నట్లు...ఒక్క హృదయంలో ఇమడవు. మధు ముందు అభిమానం ఏమిటి? అతన్ని కలుసుకో. అతనికి కలిగిన భ్రమను తొలగించు. నేను కట్నంగా తీసుకొన్న నాలుగువేలూ పంపిస్తాను. మధుకు ఇవ్వవలసిన డబ్బు ఇచ్చేయ్! మీరిద్దరూ సుఖంగా వుండాలని మనసారా కోరుతున్నాను.'

'శకుంతల బాధ్యత ఎలా అని ఆలోచిస్తున్నావా? నేను బ్రతికివుండగా నా బిడ్డకు మరో వ్యక్తి తండ్రిగా వ్యవహరించటాన్ని నేను భరించలేను. నేను మళ్ళీ వివాహం చేసుకోబోవటం లేదు. ఈ జీవితానికి ఈ అనుభూతి చాలు. మా దూరపు బంధువుల్లోని ఒకామె శకుంతలను పెంచటానికి ఒప్పుకుంది. ఆమెకు ఎవరూ లేరు. వయసు మళ్ళిన ఆమెకు ఇంత ఆశ్రయం ఇచ్చినట్లూ అవుతుంది. శకుంతలకు ఓ పెద్దదిక్కూ ఏర్పడుతుందని ఈఏర్పాటు చేసుకున్నాను. శకుంతలను అత్తయ్యచేత గాని, మామయ్యచేత గాని పంపించు. నువ్వు మాత్రం రాకు. తీరా నిన్ను చూశాక నేను ప్రలోభానికి గురికావచ్చు.

రాధ విషయం బాధపడుతూ రాశావు. రాధ చిన్నపిల్లకాదు. చాలా తెలివైంది కూడా. ఒకరు చెబితే వినే తత్వంకాదు. చాలా ధైర్యం కలది. జీవితంలో ఎలాంటి ఒడుదుడుకులైనా ఎదుర్కొ గల మనస్థైర్యం కలది. ఆమె గురించి దిద్దిగా బాధపడకు.

నువ్వు ఎక్కడ వున్నా, ఎలా వున్నా, ఎల్లవేళలా సుఖంగా వుండాలని కోరుతూ

నీ

బావ

అపరాజిత

మాధవికి దుఃఖం పొర్లుకొచ్చింది. గబగబా బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది. రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. బయటనుంచి కాలేజీ బెల్ వినిపించింది. ముఖం కడుక్కొని అద్దంలో చూసుకుంది. ఏడ్చినట్లు కనిపిస్తోంది. ముఖానికి ఇంత పౌడరు అద్దుకొని బయటకు వచ్చింది. ఇంటర్వెల్ కావటంవల్ల కాలేజీ అంతా హడావిడిగా వుంది. మాధవి అర్ధరోజు శెలవు పెట్టి ఇంటికి బయలుదేరింది. మాధవికి ఆలోచించాలని లేదు. కళ్ళుమూసుకొని పడుకోవాలని వుంది.

'ఏమ్మా అప్పుడే వచ్చేశావ్?' మెల్లిగా ఇంట్లో కూర్చొని అప్పడాలు ఒత్తుతున్న పరమేశ్వరి ప్రశ్నించింది.

'తల నొప్పిగా వుంది పెద్దమ్మా' అంటూ గదిలోకి వెళ్ళిపోయింది మాధవి. చేతిలో వున్న హ్యాండ్ బ్యాగునూ, పుస్తకాలనూ టేబుల్‌మీదకు విసిరేసి మంచానికి అడ్డంపడింది. చీర మార్చుకొనే ఓపిక కూడా లేదు. కళ్ళు మూసుకుంది. లేడి వెంటబడే వేటగానిలా తరుముకొస్తున్న ఆలోచనలను తప్పించుకొని పారిపోలేక పోతుంది ఆమె మనస్సు.

బావ తనను ఎంత తేలికగా తృణీకరించగలిగాడు! తనకు తాను అర్పించుకోవటానికి సిద్ధంగా వున్న అడదంటే ఏ మగవాడికైనా లోకువేనేమో! తన కోసం ఇంత కాలంగా తపస్సు చేసిన బావేనా, తను వస్తున్నానని రాస్తే వద్దని రాశాడు! తనను యింత అవమానిస్తాడా!

బావ తనను అవమానించాడా? బావ తనకోసం త్యాగం చేసిన మహాపురుషుడు. బావ రాసింది అక్షరాలా నిజం. మధుమీద కోపంకొద్దీ, ఆవేశంలో తను బావ దగ్గరకు వెళ్ళాలనుకుంది. కాని తన మనస్సులో వున్న మధు బొమ్మను చెరిపేసే శక్తి తనలో వుందా? బావ ఎంత మంచివాడు, తనకు కావాల్సిందేదో తనకే తెలియని పరిస్థితి! 'నీకు కావాల్సింది [illegible] అని తెలియజెప్పాడు.

'కాఫీ తాగుతే తలనొప్పి తగ్గుతుందేమో' పరమేశ్వరి గొంతు విని మాధవి కళ్ళెత్తి చూసింది. లేచి కూర్చొని కాఫీ గ్లాసు అందుకుంది.

'పెద్దమ్మా!' అంటూ ఆగిపోయింది మాధవి.

'ఏమ్మా! ఎందు కలా వున్నావ్? కళ్ళు వాచి వున్నాయేం?' ఆదుర్దాగా ప్రశ్నించింది పరమేశ్వరి.

పెద్దమ్మకు తనంటే ఎంత ప్రేమో!

'బావ ఉత్తరం రాశాడు.' అంది. ఆమె వేసిన ప్రశ్నను వినిపించుకోనట్లు.

'ఏం రాశాడు?' మాధవి కళ్ళలో దేన్నో వెతకటానికి ప్రయత్నిస్తూ అడిగింది పరమేశ్వరి..

'శకుంతలను పెంచటానికి ఎవరో మనిషి దొరికిందట. శకుంతలను పంపించమన్నాడు.'

పరమేశ్వరి తేలిగ్గా నిట్టూర్చింది. మాధవిమీద శకుంతల బరువును మోపటం మొదటినుంచి యిష్టం లేదు.

'ఎప్పుడు పంపించమన్నాడు?'

'వెంటనే పంపించ మన్నాడు.'

'మరెప్పుడు తీసుకెళతావు?'

'నేనా?' మాధవి గ్లాసులో మిగిలిన కాఫీని ఒక్క గుక్కలో తాగేసింది.


'రాధ వెళుతుందా? శకుంతల రాధ దగ్గర వుండదు' అంది పరమేశ్వరి మామూలుగానే.

'నేను వెళ్ళలేను పెద్దమ్మా. కాలేజీలో పని చాలా వుంది. నువ్వెళ్ళకూడదూ? పెద్దదానివి. నువ్వెళితేనే బాగుంటుంది. బావ కూడా నన్నే పంపించవద్దన్నాడు.'

పరమేశ్వరి ఓ క్షణం ఆలోచించి 'సరే! రేపు పొద్దుటే బస్‌కు వెళతాను' అంది. పరమేశ్వరికి ఆ పెంచే మనిషిని కూడా చూడాలని వుంది. పసిబిడ్డను ఎవరి చేతుల్లోనో పెట్టాలంటే కొంచెం బాధగా కూడా వుంది.

'నేనే వచ్చి ఎక్కిస్తాను,' అంది మాధవి. పరమేశ్వరి ఖాళీ గ్లాసు తీసుకొని అక్కడనుంచి వెళ్ళిపోయింది.

(ఇంకా ఉంది)


అపొలో పదమూడు!
లవెల్.....
అయిపోతుందని ముందు
గానే చెప్పేశా! మూన్ కి
వెళ్ళడానికి మరో చాన్సు
స్వైగర్ట్....
జాయిన్ సరిగ్గా
నేను వెళ్ళినప్పుడే
ఇలా జరగాలా!!
మాటింగ్లీ.....
థాంక్స్ టు మీజిల్సు!
మొన్నయ్యా! బ్రతికాను!!
మిషన్ కంట్రోల్సు..
ఈ పదమూడు — తల్లో
ఒక్క వెంట్రుకయినా మిగల్చ
లేదురా నాయనా!!
రాక్షసులు......
ఆహా! ఓహో!
భలే! భలే!!
మెటియొరైట్లు...
ఇందాక మనలో గుద్దు
కుంది ఒకటి! అది
ఏమయ్యుంటుందంటావ్
చంద్రుడు......
ఇప్పుడిప్పుడే
ఇదెలా సాధ్యం!!
ఇంకాస్త శ్రమపడుండే!
బాటిల్ లిక్ నెత్తిట్టావెం!
మనుషులు...
కోట్లు కొద్ది ఖర్చు పెట్టి
ఎందుకొచ్చిన అవస్థ!!
దర్జాగా కాలుమీద
కాలేసుకుని ఉండక!!
అపొలో 14 వాళ్లు.....
14 బయలుదేరే సరికి
మనముగ్గురికీ మీజిల్సు
వస్తే బాగుణ్ణు!!
13 వ నంబరు....
ఎలా వుంది?
మన తడాఖా!



'బంగారంలాంటి ఇంట్లో దూరి ఇంటి యజమానిని పొడిచి చంపాడు' దీన్ని హత్య అంటాం మనం. కాని ఈ వార్త చదవండి.

'ఓ డాక్టరు పెన్సిలిను మార్ఫియా ఇవ్వటానికి మారుగా 'స్ట్రిక్నిన్' ఇవ్వగా కొన్ని క్షణాలలోనే పేషంట్ మరణం పొందాడు'—ఇది హత్య! కాని ఇది సామాన్యమైన హత్యకాదు, వైద్యశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే ఇది 'మెడికల్ మర్డర్', వైద్యుని అచాతుర్యంవల్లనో లేక రోగ నిర్ణయంలో పొరబడటం వల్లనో, వేరే మందులు వాడటం వల్లనో జరిగే అనాహుతం! మొత్తంమీద ఆ చావుకు వైద్యుడే కారణం. అయితే హత్య చేసిన వాళ్ళందరినీ శిక్షించినట్టుగా వీరిని శిక్షిందరా? శిక్షిస్తారు. కాని—డాక్టర్ చేసిన నేరం, ఖూనీకోరు చేసిన నేరంలాగా బయటపడదు' అంతే............

ఏ డాక్టర్ ఇలాంటి నేరం చేసినప్పుడు దానిని తన వృత్తి బాంధవుల ముందు చెప్పుకుని మనస్సు తేలికపరుచుకోకపోతే మనస్సుకు శాంతి ఉండదు.

ఎప్పటికప్పుడు తాము చేస్తున్న మెడికల్ మర్డర్స్ ను నివేదించడానికి మా నగరంలోనే డాక్టర్ల క్లబ్ ఒకటి ఉండేదని ఈ మధ్యే తెలిసింది నాకు. డా- ముఖర్జీ ఈ 'ఎక్స్ క్లబ్' గురించి నాకు చెప్పకపోయినట్టయితే ప్రపంచంలో నేను తెలుసుకోవాల్సిన అత్యంత అమూల్యమైన విషయాల్లో ఒక విషయాన్ని తెలుసుకోని లోటు నా జీవితంలో ఎప్పటికీ మిగిలిపోయేది.

మా ఊళ్ళోని ప్రసిద్ధులైన డాక్టర్లందరూ కలిసి ఈ 'ఎక్స్ క్లబ్'ని స్థాపించారుట. ఆ సభ అక్కడి అత్యాధునికమైన హోటల్లోని గుప్తమైన నో గదిలో జరిగేదట. అక్కడి కార్యకలాపాలన్నీ రహస్యంగా ఉంచబడేవి. మూడు నెలలకోమారు జరిగే ఈ సభలో సభ్యులు తాము చేసిన హత్యల గురించి నివేదించే కార్యక్రమం ఉండేదిట.

నా స్నేహితుడు డా. ముఖర్జీ, వో ర్మాతి విందు భోజనానికి మా ఇంటికి వచ్చినప్పుడు ఈ సంగతంతా చెప్పారు. ఇప్పుడు ఆ 'ఎక్స్ క్లబ్' రూపుమాసిపోయిందట. చాలామంది దేశమాత పిలుపును అందుకుని మన జవాన్ల యోగక్షేమాలకోసం చైనా పాక్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్ళిపోయారట. మిగతావారు తమ పనుల ఒత్తిడివల్ల సభకు రాలేకపోతున్నారట. కొంతమంది ఇహలోకయాత్ర ముగించినందున 'ఎక్స్ క్లబ్' పూర్తిగా మూతపడింది.

ఎక్స్ క్లబ్ గురించి తెలుసుకోవాలన్న నా కుతూహలాన్ని గమనించి డా. ముఖర్జీ దాన్ని గురించిన మరికొన్ని వివరాలను చెప్పసాగారు. అందులో ఎక్స్ క్లబ్ ఏభైమూడో అనగా ఆఖరి సమావేశం, మరింత రసవత్తరంగా ఉందని చెప్తూ ఆ సభ కార్యకలాపాలను రసవంతంగా వర్ణించసాగారు.

* * *

ఆ రోజు 'ఎక్స్ క్లబ్' ఏభయిమూడవ సమావేశం. విందు భోజనాలవగానే అందరికన్నా వృద్ధుడైన డాక్టర్ బిపిన్ చంద్ర శహా ఆ రోజు సభకు అధ్యక్షత వహించారు.

డెబ్బయ్యేళ్ళు దాటిన డాక్టర్ శహా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్గా చాలాకాలంగా సేవ చేశారు. ఆయన క్లాసులో పాఠాలు చెప్పేటప్పుడు విద్యార్థుల నుద్దేశించి 'నే నివాళ మీకు నేర్పే విద్య ఓ మూర్ఖుని మిథ్యావేదాంతమని నిర్ణయింపబడవచ్చు. ఇదే సత్యమని ఎప్పుడూ మనం చెప్పలేము. రోజులు గడుస్తున్నకొద్దీ కొత్త సంశోధనలు, కొత్త సిద్ధాంతాలు వెలుగులోకి వస్తాయి. పాత సంశోధనలు, పాత సిద్ధాంతాలు మూలపడతాయి' అని అంటూండేవారు. ఆయన మాటల్లో వినయశీలత' వైద్య విజ్ఞాన ప్రగతి పట్ల ఆయన కున్న ప్రగాఢ విశ్వాసం కనిపిస్తూండేవి.

డాక్టర్ శహా సభ నొక్కసారి కలయచూసి సభలో కొత్త మొహాన్ని చూసి, ఇలా అన్నారు. 'మిత్రులారా, ఇవ్వాల్టి సభకు కొత్త సభ్యు లొకరిని పరిచయం చెయ్యగలుగుతున్నందుకు సంతోషిస్తున్నాను. డాక్టర్ గుప్తా ఈ క్లబ్బులో కొత్తగా సభ్యత్వం స్వీకరిస్తున్నారు. వయస్సులో చిన్నవారైనా అసాధారణ ప్రతిభాశాలి ఆయన' అని అన్నారు. సభికుల కరతాళధ్వనుల మధ్యలో డాక్టర్ శహా. డాక్టర్ గుప్తావేపు తిరిగి 'డా. గుప్తా మీరు ఈ క్లబ్బుకు కొత్తవారు గనుక మీకు ఇక్కడి ధ్యేయాలను గురించి కొద్దిగా చెప్పడం నా కర్తవ్యం. మే మందరం ఇక్కడ ఇలా కలుసుకోవటం కేవలం ఒకే ఒక్క ఉద్దేశంతో. ఇక్కడ రోగుల రోగాలను కనుక్కోము. కాని డాక్టరు చేసిన తప్పులను కనుక్కుంటాము.

'మనలో ఎవరైనా ఓ హత్య చేసివుంటే దాన్ని గురించి సభ్యులందరకు తెలియపర్చాలి. హత్య అంటే మెడికల్ మర్డర్. రోగి చికిత్స పొందుతున్నప్పుడు మరణిస్తే అది హత్య కాదు. రోగ నిర్ణయంలో పొరపడడంవల్ల; ఒక మందుకు మారుగా మరో మందు ఇవ్వటంవల్ల, ఒక ఆపరేషన్కు మరొక ఆపరేషన్ చెయ్యటంవల్ల రోగి మరణిస్తే అది హత్య. టెక్నికల్గా చెప్పాలంటే ఇది మెడికల్ మర్డర్. కాని ఈ హత్యల గురించి పోలీసులకుగాని, పత్రికలవాళ్ళకుగాని రిపోర్టు చెయ్యబడదు. ఆ విషయంలో మీరు నిశ్చింతగా ఉండవచ్చు. కనుక మిస్టర్ గుప్తా, మీరు అమాయకురాలైన స్త్రీని పరలోకానికి పంపినా లేక మీ మేనమామను స్వర్గద్వారానికి ప్రయాణం కట్టించినా సభికులకు విన్నవించడానికి ఎంతమాత్రం సంకోచపడవలసిన అవసరం లేదు.'

డా. శహా 'మనమంతా మనమన క్షేత్రాలలో ప్రతిభ గలవారమే. కాని 'తప్పుచెయ్యటం మానవ సహజం' అన్న సిద్ధాంతాన్ని మరవకూడదు. మన మెంత తెలివిగలవారమైనా ఎప్పుడో ఒకప్పుడు తప్పు చెయ్యనే చేస్తాము. అలా చేసిన వారికి తమ అపరాధాన్ని నిండుమనస్సుతో బయట పెట్టటానికి అనువైన స్థానం ఇది. కనుక ఏదీ డా. కుమారస్వామిజీ, మీ 'హత్య'గురించి చెప్పండి. వినటానికి మేమంతా కుతూహల పడుతున్నాం' అని చెప్పి చిరునవ్వుతో ఆసీనులయ్యారు.

డా. కుమారస్వామి లేచి నుంచుని చెప్పసాగారు 'ఇప్పుడో నెలరోజుల క్రిందట నా నర్సింగ్ హోమ్లో ఒక పేషంటుకు అర్జంటుగా 'బేరియం ఎక్సరే' తియ్యాల్సి వచ్చింది. 'ఫ్లూరో స్కోప్' రూమ్కి పంపాను. నా అసిస్టెంట్ డా. రత్నం ఆ పేషంట్కు బేరియా త్రాగించి ఎక్సరే యంత్రం ముందు నిలిపారు. నేను ఆ పేషంట్ స్క్రీనింగ్ చూస్తుండగానే అతనివళ్ళు బిగుసుకు పోసాగింది. రెండు నిమిషాల్లోనే ఆ వ్యక్తి రాతిలా బిగుసుకుని అక్కడికక్కడే మరణించాడు.'

సభలో గుసగుసలు మొదలయ్యాయి.

'అదెలా సాధ్యం ?' డాక్టర్ జోసెఫ్ ప్రశ్నించారు.

డా. కుమారస్వామి మెల్లగా చెప్పారు. 'పేషంటుకు బేరియం త్రాగడానికి ఇచ్చిన గ్లాసులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పొడి వుంది. అది అతని గొంతుకలో దిగగానే గట్టిపడ సాగింది. హృదయం మీద దీని పరిణామంగా జరిగిన ఒత్తిడివల్ల రెండు నిమిషాల్లోనే హార్ట్ ఫెయిలయింది.'

'బేరియంమీల్ పొడి కాకుండా గ్లాసులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పొడి ఎలా వచ్చింది'

మలొకరి ప్రశ్న.

'తయారు చేసినవారి అశ్రద్ధ ఫలిత మయుండవచ్చు' డా. కుమారస్వామి అన్నారు.

డా. శహ మధ్యలో అందుకుని 'రోగి మీ దగ్గరకు రావటానికిముందు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తిని ఉండవచ్చుగా' అన్నారు.

డా. కుమారస్వామి 'వీల్లేదు. రోగి వాకేం కొత్తవాడు కాడు. నానర్సింగ్ హోంలో 15 రోజులనుండి ఉన్నతను. అతనికి 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' దొరికే అవకాశం లేదు.

'అతను 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' మింగాడని ఎలా తెలిసింది?'—డా. శహ ప్రశ్నించారు,

'పోస్టుమార్టం రిపోర్టులో రోగి కడుపులో 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' ఉందని తెలియజేయబడింది' కుమారస్వామి జవాబిచ్చారు.

సభలో మళ్ళీ గుసగుసలు ప్రారంభమయ్యాయి.

అంతలో డా. శహ లేచి నుంచుని 'ఇప్పుడు డా. గులాం హుస్సేన్‌గారు తమ అనుభవం చెబుతారు. కమాన్ డా. హుస్సేన్' అన్నారు.

డా. గులాం హుస్సేన్ నిలబడి తమ అనుభవాన్ని వివరించసాగారు.

వైద్యుల వ్యాధి

'నేను కొద్దిరోజులక్రితం ఊళ్ళోని శ్రీమంతులొకరి ఇంటికి వెళ్ళాను. వారి పిల్లలిద్దరు కడుపునొప్పితో బాధపడుతున్నారని ఒకసారి వచ్చి చూడమని కబురు వచ్చింది. నేను వారింటికి వెళ్ళినప్పుడు రాత్రి తొమ్మిది కావొస్తోంది. ఆ రోజు ఆస్పత్రిలో చాలా రద్దీగా ఉన్నందువల్ల సాయంత్రానికల్లా నేను బాగా అలసిపోయాను. ఆ పెద్దమనిషి పిలుపును మన్నించక తప్పదు గనుక వారింటికి వెళ్ళాను. ఆయన ఇద్దరు పిల్లలనూ (పది—ఎనిమిది సంవత్సరాలు) పరీక్ష చేశాను. సాధారణ పరీక్షలో ఆ కడుపునొప్పి స్వరూపం నాకంతగా అవగాహన కాలేదు. కడుపులో వర్మ్స్ ఉండొచ్చని సందేహించి పిపరాజైన్ సిట్రేట్ త్రాగించమని, ప్రొద్దున్నే ఇద్దరికీ ఆముదం ఇమ్మని చెప్పి వెనక్కి వచ్చేశాను. మరుసటిరోజు ఉదయం షుమారు పదింటికి ఆ పిల్లలను చూడటానికి వెళ్ళేసరికి పెద్ద పిల్లకు విరోచనంలో పాములు పడ్డట్టు తెలిసింది. కాని చిన్నపిల్ల పరిస్థితి విషమించింది. ఆ పిల్లను పరీక్షించినప్పుడు జ్వరం 105° డిగ్రీలు ఉంది. నాడి అతివేగంగా కొట్టుకుంటోంది. కడుపు క్రికెటబంతిలాగా బిగుసుకుపోయింది. కాస్సేపట్లో...' డా. హుస్సేన్ మాట తడబడింది.

'కాస్సేపట్లో ఆ పాప చనిపోయింది కదూ డాక్టర్?' డా. చౌదరి సూటిగా అడిగారు.

అవునన్నట్టు తల ఆడించారు డా. గులాం హుస్సేన్.

గెలుపు సాధించినట్టుగా చౌదరి అన్నారు 'జరిగిందింతే. డా. హుస్సేన్ రెండోపిల్ల పరిస్థితి తప్పుగా అంచనా వెయ్యటంవల్లనే ఈ అనాహుతం జరిగింది. రెండోపిల్ల కడుపులో వర్మ్స్ లేవు. నిజానికి ఆ పిల్ల 'అపెండిసైటిస్'తో బాధపడుతోంది. మన వైద్యమహాశయులు చెప్పినట్టుగా ఆముదం త్రాగినందున పేగుల్లో ఒత్తిడి ఎక్కువై రోగగ్రస్తమైన అపెండిక్స్ పగిలి చీము పేగుల్లో వ్యాపించి 'పెరిటొనైటిస్'తో పిల్ల చనిపోయింది.

సభలో కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది. డా. శహ ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అన్నారు. 'డా. రాంసింగ్ ఇప్పుడు మీ వంతు.'

డా. రాంసింగ్ సుప్రసిద్ధులైన సర్జన్. ఏభయ్యేళ్ళున్నా చూట్టానికి దృఢంగా ఉన్నారు. ఆయన ఆకారం —ఆయన కాలేజీలో చదువుకునే రోజుల్లో మంచి ఆటగాడన్న సంగతి తెలుపుతోంది.


ఒకసారి సభను కలయచూసి డా. రాంసింగ్ ప్రారంభించారు. 'ఈ హత్యను గురించి ఎలా వర్ణించాలో తెలియటం లేదు. బహుశ ఇది నా సర్జరీ అనుభవంలోనే ఓ ఆకస్మిక దుర్ఘటన అని చెప్పాలి'

డా. శహ మధ్యలో కలుగజేసుకుంటూ 'మీరు మీ స్పోర్ట్స్ ఆక్టివిటీస్‌ని తగ్గించి ఆ సమయాన్ని కూడా శస్త్ర చికిత్సా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవటానికి ఉపయోగిస్తే ఇలాటి ఆకస్మికాలు జరక్కుండా ఉంటాయేమో' అన్నారు నవ్వుతూ.

ఓ క్షణం సభికుల నవ్వులతో హాలు మార్మోగిపోయింది.

రాంసింగ్ మళ్ళీ చెప్పసాగారు.

'రోజుకి నేను నాలుగయిదు ఆపరేషన్‌లు చెయ్యాల్సి వుంటుంది. శలవు రోజుల్లో



శుస్తీవల్ల నీరసమా ?



బిడ్డల వికాసములో లోటా ?



ఆకలి లేదా ?



ఆరోగ్య క్షీణతయా ?



—అయితే వింకోలా-12 ఎందుకు తీసుకోరు ?

...ఇదే మీ ఆనందమయమైన ఆరోగ్య జీవితానికి మార్గము

వింకోలా-12 అద్భుతమైనది. క్షణంలో ఎంత స్ఫూర్తినిస్తుందో! మీరు శక్తివంతమైన అనుభూతిని పొందుతారు. మీరు జీవితమాధుర్యాన్ని దవిజారా గోరుతారు. వింకోలా-12 ఆనందదాయకమైనదేగాక: మీ రక్తములోని ఎఱ్ఱకణములను వృద్ధించే శక్తివంతమైన లోహ పదార్థముగూ సమకూర్చి, మీకు ఉత్తేజమును తిరిగి ప్రసాదించును. విటమిన్ బి-12 ఆకలిని పెంచి, పటుత్వమును వృద్ధిచేయును. ఆరోగ్యక్షీణతను నిర్మూలించుటకు ప్రఖ్యాతి చెందిన భారతీయ ఔషధము ద్రాక్షారిష్టతో పాటు ఆరోగ్యమును ప్రసాదించి, బలము, పటుత్వము, పోషణమునకు కావలసిన ఖనిజ లవణములు. విటమినులు గలవు.



వింకోలా-12 సేవించి
ఆనందమయమైన ఆరోగ్యజీవితమును అనుభవించండి.

వింకోలా-12

కూడా ఏదైనా 'ఎమెర్జన్సీ' ఉండనే ఉంటుంది. అలాగయినా కూడా యిన్ని యేళ్ల నా అనుభవంలోనూ ఇలా జరగటం ఇదే మొదటిసారి.'

డా. ముఖర్జీ 'ప్రతి డాక్టరుకు మూడు నెలలకో మెడికల్ మర్డర్ చేసే అధికార మున్నపుడు ఇన్నాళ్ళ అవకాశాన్ని ఉపయోగించుకోకపోవటం మీ అసాధారణమైన సహన శక్తిని నిరూపిస్తోంది. అభినందనలు' అన్నారు నవ్వుతూ.

సభలో మరోసారి నవ్వులు ప్రతిధ్వనించాయి.

డా. శహా 'దయచేసి మీ ప్రసంగం కొనసాగించండి' అని మనవి చేశారు.

డా. రాంసింగ్ డా. శహావేపు తిరిగి 'మీకు 'అక్యూట్ కోలిసిస్టైటిస్' రోగ చిహ్నాలు తెలుసుగదా' అన్నారు.

తెలుసునన్నట్టు శహా తల ఊపారు.

డా. రాంసింగ్ 'కొన్ని రోజులక్రిందట నా సర్జికల్ నర్సింగ్ హోమ్‌లో ఒకామె చేరారు. ఆమె అడ్మిట్ అయినప్పుడు రాత్రి షుమారు ఎనిమిది గంటలయి ఉంటుంది. నే నామెను చూసినప్పుడు కడుపు కుడిభాగంలో విపరీతమైన జబ్బుతో బాధపడుతున్నారు 'గాల్‌బ్లాడర్' ఉన్నచోటులో నొక్కితే మరీ నొప్పిగా ఉందన్నారు. నొప్పి కుడివైపు భుజాస్థిదాకా (రైట్ స్కాపులా) వ్యాపించింది. ఆమె అప్పుడప్పుడూ వాంతి చేస్తోంది. జ్వరం 103 డిగ్రీలదాకా ఉంది. నా పరీక్షలో ఆమె గాల్‌బ్లాడర్ వాచినందువల్ల బాధపడుతున్నట్టనిపించింది. వెంటనే నొప్పి తగ్గటానికి ఓ ఇంజక్షన్ ఇచ్చాను, కాని ఆమె రాత్రంతా నిద్రపోలేదు. నొప్పి ఎక్కువవసాగింది. అప్పుడు నేను ఆపరేషన్ చెయ్యటమే మంచిదన్న నిశ్చయానికొచ్చాను. కాని ఆపరేషన్ చేసి 'గాల్‌బ్లాడర్' పరీక్షించినప్పుడు అక్కడ రోగ చిహ్నాలేమీ కనిపించలేదు. ఇంకో గంటలోనే ఆమె మరణించింది.

కాస్సేపు సభలో నిశ్శబ్దం తాండవించింది, ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ 'మీలో ఎవరైనా ఆమె జబ్బు ఏమిటో ఊహించగలరా?' అని ప్రశ్నించారు.

డా. జోసఫ్ లేచి నుంచుని 'నాదగ్గరి

వైద్యుల వ్యాధి

కెవరైనా కడుపునొప్పి, రొమ్మునొప్పి అని వస్తే వెంటనే అతనిగుండె సరిగ్గా పనిచేస్తోందో లేదో పరీక్షిస్తాను. అది సక్రమంగా పనిచేస్తుందని రూఢీ పరుచుకున్నాకనే నొప్పికి కారణం ఏమిటో చూస్తాను' అన్నారు.

'కరెక్ట్.' డాక్టర్ శహా, డాక్టర్ జోసఫ్ అభిప్రాయాన్ని ఆమోదించారు. 'పోస్ట్‌మార్టంలో ఏమని రిపోర్ట్ వచ్చింది డాక్టర్ రాంసింగ్?' అని ప్రశ్నించారు.

'ఆమెకు గుండెలోని రక్తనాళంలో గడ్డ కట్టిందని తెలిసింది.'

డాక్టర్ శహా 'మా శారా, మీరు 'కొరోనరీ థ్రాంబోసిస్' కేసును పొరపాటుగా భావించి ఆపరేషన్ చెయ్యటంవల్ల ఇలా జరిగింది. మీలాటి ప్రఖ్యాత సర్జన్ ఇలా చెయ్యగలరని నే నూహించలేకపోయాను' అన్నారు.

డా. రాంసింగ్ 'నిజమే, ఇదే నా మొదటి మరియు ఆఖరి నేరమవుతుందని మీకు భరోసా ఇస్తున్నాను. మరెప్పుడూ ఇలా జరగదు' అంటూ కూర్చున్నారు.

తరువాత డా. శహా నిలబడి సభికుల నుద్దేశించి 'మిత్రులారా ఇవ్వాళ్టి మన సభకు విచ్చేసిన కొత్త సభ్యులు డా. గుప్తా వయసులో చిన్నవారైనా శస్త్రచికిత్సలో ప్రావీణ్యం గలవారు. వ్యాహత్యా నివేదనలో ఇప్పుడు ఆయన వంతు. అందరికన్నా చిన్నవయస్కులైన హంతకుడు డా. గుప్తాను ఆయన చేసిన నేరాన్ని సభవారికి విన్నవించాలని కోరుతున్నాను' అన్నారు.

డా. గుప్తా లేచి నుంచున్నారు. వరాసంగా అందర్నీ ఒక్కసారి పరిశీలనగా చూసి నెమ్మదిగా ప్రసంగించసాగారు.

'నేను ఈ హత్యను గురించి వివరంగా చర్చించదలుచుకున్నాను. ఇలాటి సంఘటన వైద్య ప్రపంచంలోనే అరుదుగా సంభవిస్తూ ఉంటుంది. నేనిప్పుడు చెప్పబోయే విషయం ఇరవయ్యేళ్ళ హరిజన యువకునికి సంబంధించినది. అతను అతి వినయవంతుడు. ప్రతిభాశాలి. చక్కని గేయాలను రాసేవాడు. ఆ యువకుని పరిచయం నాకు వృత్తిరీత్యా కాకుండా గేయాల మూలంగానే అయింది. అతని గేయాలను చదివి మెచ్చుకుంటూ అతనితో స్నేహ వ్యవహారం ప్రారంభించాను. ఇలా పెంపొందింది మా స్నేహం...'

ప్రసంగం మరో దారి పట్టినందుకు సభలో గుసగుసలు బయలుదేరాయి.

డా. శహా 'సారీ, మీరోగి వివరమ్మేదో చెప్పమాట' అన్నారు.

డా. గుప్తా 'అవును. అతనో వర్గ సమానత్వం కోసం పోరాటం సాగించే కవి. సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలకు విరుద్ధంగా యుద్ధం ప్రకటిస్తున్న ధీరకవి. అతని గేయాలన్నీ సంఘంలో జరుగుతున్న అక్రమాల, అన్యాయాలకు విరుద్ధంగా ప్రస్తావిస్తున్నవయినాయి.'

డా. చౌదరి మధ్యలో కల్పించుకుంటూ 'డా. గుప్తా, ఇది వైద్యుల సభ, సాహిత్య సమ్మేళనం కాదు. గుర్తుంచుకోండి' అన్నారు.

డా. గుప్తా 'నిజమే, నాకా సంగతి తెలుసునండి. నేను చెప్పబోతున్నది వైద్యకీయ హత్యను గురించే. ఎవరు అందులోనే తొందరపడుతున్నారు మరి' అంటూ తమ ప్రసంగం కొనసాగించారు.

'రెండువారాలు అనారోగ్యంతో బాధపడ్డ తరువాత ఆ యువకుడు నాకు కబురు పంపాడు. అతని పరిస్థితి కళ్ళారా చూసిన నేను వెంటనే అస్పత్రిలో జాయిన్ చేసుకున్నాను.

ఆ యువకుని కడుపులో ఎడమవైపు భరించలేని నొప్పి వచ్చేదట. మొదట్లో డాక్టర్ని [illegible] నొప్పి కొద్దిగా తగ్గటంవల్ల అశ్రద్ధ చేశాడు. మళ్ళీ నొప్పి మొదలయి జ్వరం కూడా రాసాగింది. రానురాను పరిస్థితి క్షీణించసాగింది. మలవిసర్జనలో చీము, నెత్తురు పడసాగింది. ఆ స్థితిలో నేనతన్ని చూడటం జరిగింది. మలపరీక్ష చేసినప్పుడు పెథాలజీ రిపోర్ట్‌లో రోగాణువు లేవి మలంలో లేవని తెలిసింది. నొప్పి ఎడంవేపు గనుక అపెండిసైటిస్ కాదని తెలుస్తోంది. రోగలక్షణాలనుబట్టి పెద్ద పేగులో పుండువల్ల బాధపడుతున్నాడని పించి లివర్ ఎక్స్‌ట్రాక్ట్ ఇంజక్షన్, రక్త వృద్ధికి టానిక్ తమాను, బెల్‌నోవాలు

వల్ల మాత్రలు ఇవ్వసాగాను. ప్రోటీన్ ఉన్న పదార్థాలు, పాలు ఎక్కువగా తీసుకోమని చెప్పాను. అతని దేహస్థితి ఎంత జాగ్రత్తగా చూస్తున్నా క్షీణించసాగింది. కడుపులో నొప్పికూడా ఎక్కువవసాగింది. కడుపును వేలితో ముట్టుకున్నా నొప్పితో కేకలు పెట్టేవాడు. నేను రెండువారాలు పడిన శ్రమంతా విఫలమయింది. ఆఖరికి రోగి అతను...మరణించాడు.'

'పోస్టుమార్టం రిపోర్టు ఏమంటుంది?' డా. రాంసింగ్ అడిగారు.

'పోస్టుమార్టం చెయ్యలేదు. కాని నేనా రోగి విషయంలో తగినంత శ్రద్ధ తీసుకున్నాను. నా శక్తివంచన లేకుండా శ్రమ పడ్డాను. ఇది నిజం.'

'మీరు జబ్బును సరిగ్గా గుర్తించి చికిత్స చేశారేమో. కాదని ఎందుకను కుంటున్నారు?' డా. ముఖర్జీ అడిగారు.

'కాదు. జబ్బును గురించి నేను సరిగ్గా గ్రహించి ఉంటే నా చికిత్సవల్ల అతను ఆరోగ్యవంతుడయ్యేవాడు కదా. అలా జరగకుండా నా చికిత్స సమయంలోనే అతను మరణించటంవల్ల నా రోగ నిర్ణయంలో పొరపాటు ఉందన్న తీర్మానానికొచ్చాను.

సభలో మళ్ళీ మౌనం రాజ్యం చేయసాగింది.

డా. గుప్తా ఆ మౌనాన్ని ఛేదిస్తూ సభికుల నుద్దేశించి—

'ఇక్కడ ఉన్న అతిరథ మహారథుల్లో ఎవ్వరికి నా పేషంటు జబ్బేమిటో అర్థం కాలేదనుకుంటా' అన్నారు. ఆయన కళ్ళు విజయాన్ని చేపట్టినవానిలా వెలుగుతున్నాయి. 'మీ గొప్ప పాండిత్యం ఇంతేనా ఏమిటి?' అన్న సవాలు కూడా ఉంది ఆయన కంఠంలో.

డా. శహా వెంటనే లేచి నుంచుని 'డా. గుప్తా, మీరు మొదటినుండి రోగి జబ్బు ఏమిటో గ్రహించకుండా వ్యర్థ చికిత్స చేశారు. పెద్ద ప్రేగులో పుండు ఉన్నట్లయితే దీర్ఘకాలపు నొప్పి, జ్వరం ఉండకూడదు. కాబట్టి మీ రోగి జబ్బు అది కాదని స్పష్టమే. అసలు జబ్బు ఇంకేదో అయుంటుంది. డా. కుమారస్వామి, డా. గుప్తా చెప్పిన లక్షణాలు వేరే ఏ యే రోగాలకుంటాయో వివరించండి' అన్నారు.

డా. కుమారస్వామి 'రోగి కడుపు ఎడంవేపు నొప్పి అనేవాడు. నొప్పి ఒక్కసారి వచ్చి తగ్గిపోయి మళ్ళీ వచ్చిందన్నారు. ఈ లక్షణాలు గ్యాస్ట్రిక్ అల్సర్‌కి ఉంటాయి' అన్నారు.

డా. శహా 'ఉహూఁ. నే నొప్పుకోలేను. రోగికి జ్వరం వచ్చింది. విరోచనంలో చీము, నెత్తురు పడటం గ్యాస్ట్రిక్ అల్సర్ లక్షణాలు కాదు' అన్నారు.

డా. ముఖర్జీ 'డా. గుప్తా, మీ రోగి ఆఖర్లో కడుపుమీద వేలుంచినా నొప్పి అని అరిచేవాడన్నారు కదూ?' అనడిగారు.

డా. గుప్తా 'అవున'న్నారు.

డా. ముఖర్జీ 'ఈ లక్షణాలు చూస్తే మీ రోగి 'పెరిటోనైటిస్' తో బాధ పడ్డాడేమో ననిపిస్తోంది. పెరిటోనైటిస్ అయినప్పుడలాటి నొప్పి వస్తుంది కదా' అన్నారు.

డా. శహా కల్పించుకుంటూ 'అవును కాని పెరిటోనైటిస్ అవటానికి ముందు ప్రేగులో ఏదైనా బాధ ఉండుండాలి. రోగగ్రస్తమైన ప్రేగులో చిల్లుపడి ఆ చీము కడుపులో వ్యాపించాలి. పెరిటోనైటిస్ అయితే రెండే రోజుల్లో ప్రేగులు కుళ్ళి రోగి చావటం ఖాయం. కాని ఈ వ్యక్తి రెండు వారాలు అనారోగ్యంతో బాధపడి డాక్టర్‌కి కబురంపాడంటె అది పెరిటోనైటిస్ కానే కాదు' అని వివరించారు.


'ఒకవేళ అపెండిక్స్ ఎడంవైపు ఉండి దానివల్ల నొప్పి వచ్చిందేమో' డా. చౌదరి తమ సందేహాన్ని వ్యక్తపరిచారు.

'వీల్లేదు. మొదటినుంచి నొప్పి ఒక్క వేపే ఉంది. ఎడంవేపు అపెండిక్స్ ఉన్నట్టయితే నొప్పి ఒక్కచోటనే ఉండదు. కాసేపు ఎడంవేపు కాసేపు కుడివేపు వుంటూంటుంది' అంటూ డా. కుమారస్వామి వాదించారు.

ఇదంతా చూశాక ఒక సంగతి స్పష్టమౌతుంది. పేషంటుకు పేగుల్లో పుండు ఉన్నమాట నిస్సందేహం. కాని అది డా. గుప్తా అనుకున్నట్లుగా కొలైటిస్ పుండు కాదు. ఇక్కడో ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతుంది. 'పేగుల్లో పుండవటానికి కారణమేమిటో అని' డా. ముఖర్జీ ప్రశ్న లేవనెత్తారు.

'ఓహో! కొలైటిస్ కాకుండా మరో పుండు ఉండొచ్చన్న సంగతే ఊహించలేదే నాకు' డా. గుప్తా నాలిక్కరుచుకున్నారు.

అంతలో డా. సలీం హుస్సేన్ కూర్చున్న చోటులోనే ఇబ్బందిగా కదలటం గమనించి డా. శహా 'ఏమిటండీ హుస్సేన్ సాబ్, రోగనిర్ణయంలో మీకేదయినా కొత్త సంగతి తట్టిందా?' అనడిగారు.



డా. హుస్సేన్ తడబడుతూ 'అదే ఆలోచిస్తున్నా, డా. గుప్తా తమ రోగి ఇరవయ్యేళ్ల యువకుడంటున్నారు చిన్న పిల్లలయితే పిన్ను, మేకు ఇలాటివి మింగటంవల్ల కడుపులో పుండయ్యే అవకాశం ఉండేది. కాని ఇరవయ్యేళ్ల యువకుడు...' అంటూండంగానే,

'అయితేనేం. ఇరవయ్యేళ్ల యువకుడు ఆత్మహత్యకోసం దోసెడు పిన్నులు మింగకూడదా?' డా. కుమారస్వామి సవాల్ చేశారు.

'ఛ! ఛ! ఆ యువకుడు ఆఖరి నిమిషందాకా బ్రతుకుమీద ఆశ కలిగే ఉన్నాడు. తను బ్రతుకుతాననే నమ్మకం బలంగా ఉందతనిలో'. డా. గుప్తా దీర్ఘంగా నిట్టూర్చారు.

'ఆ రోగి మాంసాహారి అయుంటే చికెన్ ఎముకతో అలాటి గాయం అయ్యే అవకాశం ఉంది' అన్నారు డా. రాంసింగ్.

'అలా కుదరదు. 'చికెన్' ఎముక చిన్న ప్రేవులదాకా అడ్డులేకుండా వెళ్లలేదు.' డా. జోసఫ్ అలా చెప్పారు.

డా శహ లేచి నుంచుని గంభీరంగా అన్నారు, 'ఇప్పటిదాకా మనందరం డా. గుప్తాగారి కేసునుగురించి మనమంతా దీర్ఘంగా చర్చించాం. నొప్పి క్రమంగా ఎక్కువవుతూ వచ్చిందన్న అంశం పరిశీలిస్తే పేగుల్లో పుండయిందని అది తర్వాత చీము పట్టిందని తేలుతోంది. డా. గుప్తా వివరించిన అంశాలవల్ల అది కొలైటిస్ కాదని తెలుస్తోంది. ఇక ఈ రకమైన పుండు కడుపులో అవ్వాలంటే రోగి ఏదైనా చిన్నపదార్థాన్ని అకస్మాత్తుగా మింగి ఉండాలి. అది పిన్, చికెన్ ఎముక కాకపోతే ఇక అద్ది...'

'చేప ఎముక కాక మరేమీ అయ్యుండదు' కొన్ని కంఠాలు ఏకంగా పలికాయి.

'కరెక్ట్' అన్నారు డా. శహ.

డా. గుప్తాగారి మోహంలోకి వింత కాంతి మెరిసి మాయమయింది. డా శహ చిరునవ్వు నవ్వుతూ డా. గుప్తా నుద్దేశించి 'డా. గుప్తా, మీరు మీ రోగి రోగ నిర్ణయాన్ని గురించి ఇక్కడి అతిరథ, మహారథులను సవాల్ చేశారు. ఇప్పుడా అతిరథ, మహారథులవల్ల మీకు తగిన సమాధానం దొరికినట్లే కదా' అంటూ

వైద్యుల వ్యాధి

మళ్లీ సభ నుద్దేశించి 'ఇక్కడ చేరిన వైద్యులందరి ఏకగ్రీవమైన నిర్ణయం, డా. గుప్తా తమ రోగికి కొలైటిస్ అల్సర్ ఉందన్న భావనతో చికిత్సచేసి చంపారు దానికి మారుగా వారు చిన్న ఆపరేషన్ చేసి పేగుల్లో చిక్కుకున్న చిన్నచేప ఎముకను తీసి ఉంటే రోగి బ్రతికేవాడేమో...'

డా. శహ మాట పూర్తికాక మునుపే డా గుప్తా లేచి తలుపువేపు గబగబా అడుగులు వేయసాగారు.

అందరూ దిగ్భ్రమంతో ఆయనవేపు చూడ సాగరు.

డా. శహ 'ఇదేమిటి, ఇంకా సభ పూర్తవనే లేదు. అలా వెళ్లిపోతున్నారేమిటండి?' అన్నారు.

డా. గుప్తా తలుపుదగ్గరున్న కోటు స్టాండు నుంచి తమ కోటు తీసుకుంటూ చిరునవ్వుతో,

'క్షమించాలి డా శహ. నాకిపుడు అత్యవసరమైన పనిఉంది. ప్రతి ఒక్క క్షణంకూడా నాకు అమూల్యమైనది. కాని మీ అందరికీ ధన్యవాదాలు చెప్పకుండా వెళ్లలేను. నా రోగిజబ్బేమిటో తర్కించి నాకు తెలిపిన మీ అందరికి నా హృదయపూర్వక అభివందనలు. నేను నా రోగికి పొరపాటుగా చికిత్స చేశానని చర్చించి నిర్ణయించినందుకు ధన్యవాదాలు. రెండు వారాలుగా నా చికిత్సలో దోషముందని పిస్తోందే కాని ఆ తప్పు ఎక్కడుందో గ్రహించలేక పోయాను. కాని ఈ సాయంత్రం మీరు నా కళ్లు తెరిపించారు'

టమేటోలు కొంచెం పండువి కోయడం అర్జె—అందులో స్లా పచ్చివి సలాడ్‌లో తినడానికి, మామూలు కత్తితో కంటే రంపం అంచుండే రొట్టె కత్తితో కోస్తే సులభంగా కోయబడతాయి. అంతే కాదు — అందంగా బిళ్లలుగా కోసుకోవచ్చు. టొమేటో బద్ద సిట్‌గా లేకపోతే బాగుండదు.

డా. గుప్తా తలుపు తెరుస్తూ 'నా రోగి చనిపోలేదు. ఇంకా బ్ర...తికే...ఉన్నాడు. ఆపరేషన్ చేసి అతన్ని కాపాడుకోవడానికి ఇదిగో ... వెడుతున్నా ... అభివందనలు' అంటూ డా. గుప్తా పరుగెడుతున్నట్టుగా అక్కడినుండి వెళ్లిపోయారు.

* * *

'తరువాతేం జరిగింది,' డా. ముఖర్జీ కథంతా విని ఆత్రుతతో అడిగాను నేను.

'ఇక జరిగేదేముంది? అరగంట తరువాత 'ఎక్స్‌క్లబ్' సభ్యులందరి ఎదుట డా. గుప్తా తమ పేషంటుకు ఆపరేషన్ చేసి అతని పేగులోనుండి చేప ఎముకను బయటికి తీశారు ఆ హరిజన యువకుని అదృష్టం చూడండి. ఏ రాజ మహారాజులకో లభ్యంకాని మహా మేధావులైన వైద్యుల సంఘం, స్వయం—పర్యవేక్షణలు ఆ యువకునికి లభించాయంటే — దీన్ని అదృష్టం అనక మరే మనాలి?' అంటూ డా. ముఖర్జీ ముగించారు. అప్పటికే చాలా ఆలస్యమయింది. గనుక ఆయన బయల్దేరడానికి లేచి నుంచున్నారు నేను ఆయనకు తోడుగా కొంతదూరం వెళ్లి వీడ్కోలు చెప్పి వచ్చాను.

ఇంటికివచ్చి పక్కమీద పడుకున్న నాకు వెంటనే నిద్రపట్టలేదు డా. ముఖర్జీగారి 'ఎక్స్‌క్లబ్' ఘటనలు నా కళ్లముందు మెదులుతున్నాయి. అలాగే మరోచిత్రం దృశ్యంకూడా నా కళ్లముందు నిలిచింది. అదో దారుణచిత్రం. వియత్నాంలో చైనా, పాక్ సరిహద్దుల్లో అరబ్, ఇస్రైల్ రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగిన దారుణ రక్తపాతాలు సైనికుల కష్టాలు, వేలకొలది నిరపరాధి ప్రజల చావులు ఇది బ్రతుకులోని రాక్షస మనోవృత్తి. మానవుని మరో ముఖం. ఆ చిత్రం మాసిపోయి దానిస్థానే మరో చిత్రం నా కళ్లెదుట నిలిచింది—ఆస్పత్రిలో హరిజన యువకుని ప్రాణాలను కాపాడటం కోసం ఎంతోమంది ప్రముఖ వైద్యులు శ్రద్ధాసక్తులతో, ఆశాద్యక్తులతో పాటు పడుతున్న దృశ్యమది. భవిష్యత్తులో నమ్మకం కలిగించే, దైవిక మనోవృత్తి కలిగిన జీవితంలో మరో ముఖం!

ఇదీ జీవితమే!

ఇదీ జీవితమే!! ●



పశ్చాత్తాపం

బులుసు వేంకటరమణయ్య


తెలిసో, తెలియకో ఏదైనా తప్పుపని చేసిన తర్వాత— తాను చేసినది చాలా తప్పుపని అని గ్రహించి విచారించడం పశ్చాత్తాపం. కేవలం విచారించడమే కాదు. 'అలాటి తప్పు మరి ఎన్నడూ చెయ్యకూడదు' అనే దృఢ నిశ్చయం కలిగి—మరి దాన్ని చెయ్యకుండా ఉన్నప్పుడే పశ్చాత్తాపమనేది సార్థకమవుతుంది.

కొందరికి ఇలాటి దృక్పథం ఉండదు. ఏదేనా తప్పు పని చేసే —'ఎందుకు అలా చేసేవు?' అని ఇతరులు ప్రశ్నించగా 'ఏదో పొరపాటు జరిగింది లెండి' అని తప్పుకొనిపోతాడు ఆ ఆసామీ, తేలికగా చూస్తూ. అలా తేలికగా తీసుకోనడంవల్ల అలాటి తప్పు మరి చెయ్యకూడదనే సంకల్పం కలగకపోవచ్చు. తిరిగి అలాటి తప్పే చేసినా "ఏదో గ్రహపాటువల అది జరిగిం" దని తనలో తాను తృప్తి పడతాడు. అందువల తిరిగి అట్టి తప్పే చేసే అవకాశం ఉంటుంది. అంటే—తప్పు చెయ్యడం అలవాటు పడిపోతుంది. అలవాటయిన దానిని మానడం కష్టసాధ్యమే! ఇట్టి వారికి పశ్చాత్తాపం కలగడం అరుదు!

చాలామందికి 'దేవా దీవేషు' కథ తెలిసే ఉండవచ్చును. పండుగకు అత్త వారింటికి వెళిన అలుళలో పెద్దాయన వేద పండితుడు. చిన్న అల్లుడు సంస్కృతం చదువుకున్నవాడు. అప్పట్లో వేద పండితులకన్న సంస్కృతం చదువుకున్నవారు కొంత నాగరికత ఉన్నవారుగా చెలామణి అయ్యేవారు. చిన్నలుడికి గదిలో మంచంమీద పడక అమర్చబడింది. పెద్దాయన ఆ గది ముందు వసారాలో చాపమీద పడుకున్నాడు. అత్తగారు బలవంతంచేసి ఎక్కువ పిండివంటలు తినిపించినందున—చిన్నల్లుడికి అజీర్ణం చేసి ఆ రాత్రి అయిదారుసార్లు బహిర్భూమికి వెళ్లవలసి వచ్చింది. అది చీకటి రాత్రి! అందువల గదిలోనుంచి వస్తూ చిన్నలుడు అన్నగారి కాలు తొక్కాడు—తెలియక. వెంటనే తన సంస్కృత పాండిత్యాన్ని వెల్లడిస్తూ 'క్షమధ్వం' అన్నాడు. పెద్దలుడు. 'చీకటో తెలియలేదు కాబోలు' అనుకుని వూరుకున్నాడు. మరి అయిదు నిమిషాలకు మళ్ళీ చిన్నలుడువచ్చి, అన్నగారి కాలు తొక్కి "క్షమధ్వం" అని క్షమాపణ చెప్పుకున్నాడు మళ్ళీ. ఒకసారి తెలియకపోతే—రెండోసారి గమనించి అడుగు వెయ్యడం న్యాయం. కాని అలా జరగలేదు. పెద్దలుడికి కొంత కోపం వచ్చినా సహించి వూరుకున్నాడు. మరోసారి అలా జరిగితే తగిన బుద్ధి చెప్పాలని అనుకుంటూ. మరో పది నిమిషాలకు మళ్ళీ సంస్కృత విద్వాంసుడు అన్నగారి కాలు తొక్కి 'క్షమధ్వం' అన్నాడు. అలా అంటే తీరిపోతుందని అనుకున్నాడేకాని, అతని హృదయంలో పశ్చాత్తాపం కలగలేదు. ఈసారి పెద్దలుడు కోపం పట్టలేక — నీకేం సంస్కృతం తెలుసు? నాకు వేదం రాదనుకున్నావా?— అన్నట్టు 'దేవా దీవేషు దాస ధ్వమ్—ప్రథమా, ద్వితీయేషు...ద్వితీయా! తృతీయేషు....!' అని ఏకరువు పెడుతూ రెండు చెంపలూ వాచిపోయేటట్టు తమ్ముడికి బహుమానాలు అందించాడు. పశ్చాత్తాపం పడని చిన్నలుడికి తగిన ప్రతిఫలం ముట్టింది!

యావద్భారతాన్నీ ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించాలనే రాజ్యాకాంక్షతో కూడిన అశోక చక్రవర్తి ఇతర ప్రాంతాలను జయిస్తూ కొని వస్తూ కళింగం మీద పడ్డాడు! ఆ యుద్ధంలో లక్షలకొద్దీ జనులు దుర్మరణం పొందారు. ఆ భీకర దృశ్యాన్ని చూసి చక్రవర్తి చలితుడై పోయాడు. తన విశాల రాజ్యకాంక్ష లక్షలకొద్దీ జనాన్ని బలి గొన్నందుకు ఆయన ఎంతో బాధపడ్డాడు. పశ్చాత్తాపం కలిగి— ఆ వెంటనే దండయాత్ర నిలిపివేసి తన రాజధానికి పోయినాడు. బౌద్ధమతాన్ని స్వీకరించి, జీవహింసను అరికట్టి ప్రజోపయోగకరములయిన కృత్యాలు ఎన్నో చేశాడు. రాజ్యపాలన పద్ధతిలో గొప్ప మార్పులు తెచ్చిపెట్టాడు. తన కీర్తిని శాశ్వతంగా నెలకొల్పాడు.

తప్పు చెయ్యడం తప్పించుకోరానిది. కాని, తప్పుచేస్తే—పశ్చాత్తాపం పొందడం ఉత్తమ స్వభావానికి లక్షణం. నిజంగా పశ్చాత్తాపపడినవాడు మరెన్నడూ ఆ తప్పు చెయ్యడు. ముమ్మాటికీ చెయ్యడు. ●



నండూరి విఠల్

జరిగిన కథ

స్వామికి స్కూల్లో టీచరు ఉద్యోగంతోపాటు రఘుపతిగారింట్లో ఆశ్రయంకూడా దొరకటంతో అదృష్టవంతుడిని అనుకున్నాడు. అయితే రఘుపతి గారమ్మాయి పావనికి ప్రైవేటు చెప్పాల్సి వచ్చే టప్పటికి అతడికి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లయింది. పావని గడుగ్గాయి. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ వుండే ఆ అమ్మాయి స్వామికి కాస్త ఇబ్బందిగానే తయారయ్యింది. స్వామి తల్లి వచ్చి మామయ్య కూతురు శ్రీదేవిని జ్ఞాపకం చేసి వెళ్ళింది.

5

'ఏం శ్రీదేవి తల్లీ! బావను చేసుకుంటావుటే?'

'ఏం చేసుకోవాలి నాయనమ్మా బావను.'

'పెళ్ళి'—బోసినోరులో నానిన పచ్చి పెసరపప్పు గింజలు నములటానికి ప్రయత్నిస్తూ నవ్వింది.

'పెళ్ళంటే ఏమిటే నాయనమ్మా?'

'పెళ్ళంటే—అదీ — ఆడపిల్లకూ వండగే తల్లీ—బావను పెళ్ళి చేసుకుంటావా?'

'ఎందుకు నాయనమ్మా?'

'ఓసి వెర్రి తల్లీ— నీకు బోలెడు పట్టుచీరలూ నగలూ అన్నీ కొని పెడతాడమ్మా బావ.'

'చేసుకుంటా నాయనమ్మా.'

'మరి నచ్చాడుటే నీకు.'

'ఊఁ.'

'స్వాములు కేమిటే అమ్మా! బంగారపు తగలాంటి కుర్రాడు.'

* * *

'చిన్ననాడు—'

శలవలకు మేనమామగారి ఊరు వెళ్ళినప్పుడల్లా యిటువంటి మాటలూ ఛలోక్తులూ వినడం స్వామికి అలవాటై పోయింది. 'పెళ్ళిచేసుకుందాం రా బావా మరి' అంటూ తనను చెయ్యి పుచ్చుకొని చెరువుగట్టు దగ్గరకు లాక్కుపోయేది శ్రీదేవి. తడిసి నానిన బంకమన్నుతో బొమ్మలు చేసి, పదిమందిని పిలిచి, ఆ బొమ్మలకు పెళ్ళి చేసేసేవారు. అందులో ఒక బొమ్మ పేరు శ్రీదేవి. మరొక బొమ్మ పేరు స్వాములు. 'భడవాకానా! ఎక్కడికెళ్ళావే యిందాకటినుంచీ?' అనేది నాయనమ్మ. 'పెళ్ళి చేసుకున్నాం నాయనమ్మా' అనేది శ్రీదేవి. విరగబడి— వోపిక లేకపోయినా—నవ్వేది ఆ ముసలమ్మ గారు.

'ఈ భడవాకాన లిద్దరికీ వచ్చే మాఘ మాసానికీ కానిచ్చెయ్యరా. బొమ్మల పెళ్ళిలా చూడ ముచ్చటగా వుంటుందీ.'

'నాకూ చేయాలనే వుంది. చూద్దాం రాజయ్యబావ ఏమంటాడో.'

స్వామి మేనమామ పేరు మంగపతి. కోనేటిగూడెంలో కరిణీకం చేస్తున్నాడు. దానికి తోడుగా పదెకరాలు బంగారంలాంటి మాగాణముంది. అంగబలం — అర్థబలం, అధికారదర్పం — అన్నీ వున్న ఆసామీ. స్వామి కుటుంబం అంతకంటె ఘనంగా బ్రతుకుతున్న రోజులవి. తమకంటె గొప్పవారితో స్నేహాలూ, సంబంధ బాంధవ్యాలూ కలుపుకోవాలనే తాపత్రయం మనిషి రక్తానికే వుందేమో. నీటిలా పల్లానికి పారాలనే గుణంకంటె — ఏదు రెక్కల కొండ శిఖరాన్ని చేరాలనే గుణం దానిది. చెల్లెల్ని యిచ్చినా, చాలాకాలం స్వామి తండ్రి రాజయ్యగారంటే మంగపతికి అంతగా పడిందికాదు. దానికి కారణం వుంది.

రాజయ్యగారిది మొదటినుంచి స్థితిగతి కుటుంబమే. కాని ఆయన హయాం వచ్చే సరికి చాలాభాగం తరిగిపోయింది. తాత ముత్తాతలనాటి బ్రహ్మాండమైన ప్రాకారాలుగల లంకంత మండువాయిల్లు— మిగిలిన ఆస్తిపాస్తులకంటె — ఆ వంశగౌరవానికి పతాకంగా నిలిచింది. ఇంచుమించు ఊరికి మధ్యగా ఒక పెద్ద మెరక దిబ్బమీద కట్టబడటంతో, ఆ ఊరి మొత్తానికి అది కిరీటంలా కనిపిస్తున్నది. అప్పటికింకా మేడలు లేవు ఆ కోనూరు అగ్రహారంలో, బయటనుంచి ఊళ్ళోకి



వనే స్వామివారికీ, తాటివనాలమధ్య నుంచి కనబడే కట్టడాలు రెండే రెండు. ఒకటి గుడి గోపురం. రెండవది రాజయ్యగారి 'దివాణం'. రాజయ్యగారి తాతలకాలంనుంచీ ఆ అగ్రహారాన్ని పరిపాలించిన దివాణమే అది. యాభైఏళ్ల మాన్యమున్న శివాలయానికీ — ఆ వూరి రామాలయానికీ ఆ కుటుంబంవారే చిరకాలంగా ధర్మకర్తలు. శివభక్తులైనప్పటికీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించడం ఒక సంప్రదాయంగా పెట్టుకున్న కుటుంబం రాజయ్యగారిది. ధనుర్మాస పుణ్యకాలంలో ఊరు ఊరంతా కల్యాణమంటపంలా వెలిగిపోయేది.

రాజయ్యగారి చావడి ఎప్పుడూ పది మంది మనుష్యులతో సందడిగా కనిపించేది. గ్రామానికి కరణం, మున్సబులూ, పంచాయితీ ప్రెసిడెంటూ వున్నా — రాజయ్యగారికున్న ప్రతిపత్తి వేరు. కాని గ్రామ రాజకీయాల్లో ఎక్కువ ప్రమేయం పెట్టుకోవడం రాజయ్యగారికి ఎన్నడూ అలవాటు లేదు.

రాజయ్యగారి చావడిలో పిఠాపురం నుంచి తరలివచ్చిన ఒక అవధానిగారు నిత్యం మహాభారతం చెబుతూండేవారు. పద్యం చదవడంకంటె వ్యాఖ్యానం చెప్పడంలో ఆయన ప్రజ్ఞ కొట్టొచ్చినట్లు కనబడేది. ఊరి రాజకీయాలనూ, దేశకాలమాన పరిస్థితులనూ జొప్పించి వ్యాఖ్యానం కొనసాగించేవాడు. రాజయ్యగారిని ఒక్కొక్కసారి ధర్మరాజుతోనో, దానకర్ణునితోనో. మరీ తిక్క రేగినపుడు సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణ పరమాత్మతోనో పోల్చేవాడు.

పర్యవసానంగా ఆ సంవత్సరం జరగబోతున్న స్వామివారి కల్యాణానికి సదరు అవధానిగారిని రామాయణ గానం చేయవలసిందిగా ఆహ్వానించారు రాజయ్యగారు. అవధానిగారు అమందానంద కందళిత హృదయారవిందుడై — 'రాజయ్యగారూ! ఇంత ఘనంగా జరిపిస్తున్నారు కల్యాణం. స్వామివారి భోగానికి తగినట్లుగా ఒక మంచిభోగం మేళం గూడా ఏర్పాటుచేస్తే బావుంటుందండి' అంటూ సూచించి, అతను పిఠాపురమంతటికీ 'పిట్టమోక్కు తెట్టు' మాదిరి వెలిగిపోతున్న రంగాజమ్మను పిలిపించవలసిందని ప్రోత్సహించాడు. సహాశానికి అంటేలా వశ్యం పట్టించి, హుషారుగా ఆ రంగాజమ్మ పడుచుతనపు పసలవిసురుల్ని — పురాణానికి వ్యాఖ్యానం చెబుతున్న ధోరణిలోనే — అంతకంటె పదిరెట్లు ఉత్సాహంతో వర్ణించాడు.' 'సరే' అన్నారు రాజయ్యగారు.

రంగాజమ్మ మేళాన్ని కుదుర్చుకు రావడానికి రైలుఖర్చులకోపాతిక అడ్వాన్సుగా పుచ్చుకుని, నున్నగా క్షురకర్మ చేయించుకుని, చలువధోవతి కట్టి, జరీఉత్తరీయం వేసుకుని, వెండిపన్ను పొడుంబుర్ర బొడ్లో దోపుకుని, ముస్తాబై వెళ్ళిన అవధానిగారు, అన్నట్లే ఆ రంగాజమ్మ భోగంమేళాన్ని కుదుర్చుకొచ్చాడు. స్వామివారికి ప్రతిసంవత్సరం జరిగిన భోగాలొకయెత్తు. ఆ సంవత్సరం జరిగింది మరియొక ఎత్తు. పెద్దలూ చిన్నలూ ఇసుకవేస్తే రాలకుండా తరలి వచ్చారు మేళం చూడటానికి.

అంతకుమించి —

ఆనాటి రంగాజమ్మ ప్రదర్శనం — రాజయ్యగారి జీవితాన్ని తారుమారుచేసింది. రాజయ్య కడుపున పుట్టిన స్వామి జీవితానికీ ఆ సంఘటనకూ గల గాఢ సంబంధం తెలుసుకోవాలంటే — పాఠకులకు రంగాజమ్మకథ కొంత చెప్పక తప్పదు.

టొమేటో తొక్క తియ్యడం వో పరీక్ష. మరుగుతున్న నీళ్ళలో పడేసి తీసి, తొక్క తీస్తారు కొందరు. ఆ తొక్క వచ్చేలోగా టొమేటో పితపితలాడుతూ నీళ్లు కారిపోతుంది. టొమేటో ఆకారం చెడకుండా తొక్క తీయాలంటే వో చిట్కా ఉంది. ఏ ఫోర్కుతోనో, కత్తి కొనతోనో టమేటోని గాస్ మీద అటూ యిటూ తిప్పుతూ వేడి చేయాలి. పై తొక్కు పగుళ్లు వేస్తుంది. అప్పుడిట్టే దాన్ని ఒల్చేయవచ్చు.

ఆలయ ప్రాంగణంలో కల్యాణ మంటపం ముందు గజ్జకట్టిన రంగాజమ్మ — జావళీ పాడుతూ సరాసరివచ్చి రాజయ్యగారి ముందు కూర్చుంది! — అడమహాజనంలో కూర్చున్న రాజయ్యగారి భార్య సీతమ్మగారిని 'ఏమిటి వదినగారూ ఈ అఘాయిత్యం?' అంటూ భుజం తట్టి అడిగింది కరణంగారి భార్య కనకమ్మగారు.

'రవ్వలాంటి గువ్వండీ' — రసగుల్లా పాకంలాంటి పాట ఇంతకూ రాజయ్య అదృష్టవంతుడూ' అన్నాడు కరణం గున్నేశ్వర్రావు.

'తొందరపడకు బావా! నీ దగ్గరకొచ్చి నీకు గంధంరాసి పసందైన పదం పాడితే — వో పదిరూపాయల నోటిలా పారెయ్' అన్నాడు కరణంగారి బావగారు గురవేశ్వర్రావు.

'పిలిచిన బిగువుటరా' — ఒకే చరణాన్ని ర క ర కా లు గా వి రు స్తూ — విసరుతూ రాజయ్యగారిముందే నిలిచి పాడుతున్న రంగాజమ్మను చూసి 'అక్కడే తిష్ఠవేసిందేమిట్రా బావా? ఆలయం డబ్బు బోలెడు తగలేసి భోగం మేళం పిలిపించింది స్వామివారి భోగానికా లేక ఈ రాజయ్య వైభోగానికా?' అన్నాడు కరణంగారింక తాళలేక.

'తాళలేనురా'

రంగాజమ్మ పాడుతూంది రాజయ్యగారి కళ్లల్లోకి చూస్తూ. చలనం లేని శిలా ప్రతిమలా కళ్లు అలాగే అప్పగించి సర్వ ప్రపంచాన్నీ విస్మరించి వింటున్నారు రాజయ్యగారు. కాదు కాదు. చూస్తున్నారు.


రంగాజమ్మ!

జరీతో మెరుస్తున్న పట్టుచీరను ఒరిపిడి పెడుతున్న యౌవన మాధుర్యం. సౌందర్యం కప్పుకున్న యౌవనం.

'అబ్బ! ఏం మెరుపండీ' అన్నాడు పిట పిట లాడిపోతూ జబ్బలను నొక్కుతున్న పట్టుచోళీ అంచుమీదనే, చూపును సూది మొనలా చేసి నాటి ఆయాసంతో రొప్పుతూ చూస్తున్న కరణం గున్నేశ్వర్రావు.

ఒక చరణంపాడి రంగాజమ్మ నవ్వింది. ఆమె కాటుకరేఖలూ సన్నబడిపో నవ్వినట్లు. మరొక్కచరణం విరిచి నిట్టూ

దిగ్విజయానికి సమకట్టినవారిలో మీరొకరా?



కార్యసిద్ధులైన అదృష్టవంతులకు జీవితం
ప్రబోధపూర్వకమైన సమస్య. దీనికి ప్రోత్సాహకశక్తి కార్యదీక్ష,
సంస్కారము అభ్యుదయేచ్ఛ దోహదంకల్పిస్తాయి.
మీ జీవితాశయం అదేనా?
ఫిలిప్స్ మీకు కావలసిన సైకిలు!
అది మీ సంతోషాతిశయాన్ని ప్రతిబింబిస్తుంది. మీ ధైర్యాన్ని
చాటుతుంది. మీ ప్రగతికి కృతనిశ్చయాన్ని ప్రకటిస్తుంది.
నాగరికమైన మెషీను. విశిష్టమైన ఉక్కు.
కచ్చితమైన యింజనీరింగు నైపుణ్యము. అతి సుఖయానంగా.
తొక్కవచ్చు. దిట్టమైనది.

ప్రగతిని పొందండి
ఫిలిప్స్
సైకిల్ తో

భారతదేశంలో తయారుచేయువారు టి ఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా అంబత్తూరు మద్రాసు 53
ప్రొప్రైటర్లు ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-అనుమతిని పొందినవారు.
* రిజిష్టర్డ్ ట్రేడ్ మార్కు ఆఫ్ ఎన్. వి. ఫిలిప్స్ కంపెనీ లిమిటెడ్ యు కె.

TIC/PM/5382

గ్గింది రంగాజమ్మ. నుదుటన కస్తూరి తిలకం కుంచించుకుని చిన్నబోయింది. రెండుచేతులూ వంగిన ఇంద్రధనుస్సులా వంచి, వింటినారిలా బిగించి, క్రీగంట చూసి చిరునవ్వుల్ని రువ్వింది రంగాజమ్మ. పంటిమధ్య చిక్కిన పెదవి — రాక్షస వివాహానికి కావాలని లొంగి — నెచ్చెలి కౌగిలినుంచి బయట పడలేక తన్నుకుంటున్న భ్రమరాలిలా అదిరింది రాజయ్యను చూసి. ఒక సిగ్గు దొంతర కరిగి కళ్ళనుంచి కారి — గులాబీపూతల్లా చెక్కిళ్ళపై జారి — కొండబండల తాకిన సెలయేటిలా ఉక్కిరిబిక్కిరై కదిలి — జారిన పయ్యెదను పైకి లాగింది. కదలిన కడలిలా మెదలిన రంగాజమ్మ కంఠాన కరిగిన గంధపుపూత చిరుచెమటల పరిమళం తోడు రాగా — చిరుగాలి గుర్రమెక్కి స్వారీ చేస్తూ — రాజయ్యగారిని ముట్టడించింది. ఆనాటి నాట్యంలో కరణంగారి ముచ్చట తీరనే లేదు. గురవేశ్వ(రావు గుప్పిట్లోనే తడిసి నానింది కరణంగారి కరెన్సీనోటు.

చివరకు రంగాజమ్మ నెత్తిన తులసి దళాలు వేసి, శఠగోపం పెడుతున్న అర్చకులు మహాదేవసంధానాచార్యులవారుగూడా బ్రహ్మానందపడిపోతూ కొయ్యబారిపోయారు ఒకక్షణం స్వామి సాన్నిధ్యంలో — అంతమంది ముముక్షువులముందు నిలబడ్డాననే విషయం మరచి.

'తాను ధర్మకర్త గనక — అంత డబ్బు తగలేసి — మున్నాట పరిహార్లిచ్చి — స్వామివారికంటూ మేళం పెట్టించడం. చివరకు తానే స్వామిపై కూర్చున్నాడు. అంత బహిరంగంగా అంతమంది జనంలో లజ్జాలతో ఆ పిచ్చి శృంగారసేమిటయ్యా అనేవాడు లేకగాని' అంటూ వరసకు బావగారైన గురవేశ్వ(రావు చెవిలు కొరుకుతూ వాపోయిన కరణం, అంతలో తేలుకుట్టినట్లు ఎగిరిపడి 'నా పదిరూపాయలనోటు' అంటూ కేక పెట్టాడు.

వారంరోజుల తర్వాత —

ఆ వార్త అడవిమంటలా వ్యాపించింది.

రాజయ్యగారింటి కులీనుడు — రంగాజమ్మనంటే 'చెడిపోయిన మనిషిని చేరదీసి, సమస్త ప్రపంచాన్నీ విస్మరించి 'నరకంలో పడిపోయి' ఆ 'కొంపలుకూలే' జాణతో 'గవ్వలాడుతూ' కాలక్షేపం జేస్తు

మమత

డని — ఆ పరగణాలో ఎవ్వరూ కలగనలేదు.

'రహస్యం దాగుతుందిటయ్యా! నాలుగు రోజుల కొకసారి వూలరంగడులా బయలుదేరి పోతున్నది ఎక్కడికంటావ్? పిఠాపురం స్టేషన్లో మా వియ్యంకుడికి కనిపిస్తానే వుంటాట్ట. ఎవరు వియ్యంకుడంటే? గూడ్సు క్లర్కు చేయడంలా ఆయన' — కరణం గుస్పేశ్వ(రావు.

'అయితే పూర్తిగా మునిగిపోయి నట్లేనన్నమాట? ఎంత చిత్రం?'

— వరసకు బావమరిది గురవేశ్వ(రావు.

'చిత్రమేముంది బావా? అసలు చీరలోనే వుంది ఆ మహాత్యం. ఊరికినే అన్నాడూ మహానుభావుడూ? ఎంత వారలైనా కాంతదాసులే — అంటూ —'

'చివరకు మహాసాధ్వి సీతమ్మ తల్లికి యింత అన్యాయం తల పెట్టాడన్న మాట.'

'అన్యాయమేముందిలే ఆవిడకు మాత్రం పిల్లామేకా ఏముంది గనక?'

'ఏంమాట బావా? భార్య కడుపున బిడ్డలు పుట్టలేదని — పదుపు కత్తెతో కాపురం వెలగబెట్టటం న్యాయమంటావా? కాకినాడ పరగణా మొత్తాన్ని ఒక ఆట ఆడిస్తున్నదట ఈ మహాతల్లి'

భర్త ఆదేశం ప్రకారం కరణంగారి భార్య కనకమ్మగారు స్వయంగా వచ్చి, జరుగుతున్న ఘోరం గురించి — రాజయ్యగారి భార్య సీతమ్మగారిని హెచ్చరించిందిగూడా.

గిట్టనివాళ్ళ మాటలండీ వదినగారూ యివన్నీ. ఇన్నాళ్ళా అలా నిప్పులా బ్రతికినవారు — యిప్పుడటువంటి పని చేస్తారా?' అంటూ సమాధానం చెప్పినా — అంతకుముందే మనస్సులో మెదులుతున్న అనుమానం కొద్దీ —

ఒకనాటి రాత్రి భోజనాలయ్యాక —

పందిరి మంచంమీద తాంబూలం నములుతూ పడుకున్న భర్త పాదాలు వత్తుతూ — 'ఇలా అనుకుంటున్నారండీ ఊళ్ళో' అంది తల వంచుకునే సీతమ్మగారు —

'అసలు సంగతి ఏమిటి?' అని నిగ్గదీయకుండానే.

పతివ్రతాలు ఆలోచనలో మునిగి 'నమ్ముతున్నావటే అమ్మ మవ్వ!' అన్నారు రాజయ్యగారు.

'ఎలా నమ్మమంటారండీ మీరు అటువంటి పనిచేస్తారంటే?'

'నమ్మలేదన్న మాట'

'ఒకనాటికీ నమ్మను'

'ఎందుకని?'

'పదేళ్ళ కాపురం చేసినదాన్ని మీ మనస్సెంత కనిపెట్టలేనా?'

'ఏం కనిపెట్టావే నా మనస్సు?'

పల్చటినవ్వు తృప్తిగా మెదలింది రాజయ్యగారి పెదిమలమీద.

'ఒకళ్ళకు అన్యాయం చేయరని'

'అంటే ఏమిటి?'

'భగవంతుడు విషం పెడతాడుటండీ ఎవరికైనా?'

రాజయ్యగారు నిట్టూర్చారు.

'అమ్మా! ఒకమాటడగనా?'

'ఏమిటండీ — అందరూ — పదిమందీ పదిరకాల మాటలంటుంటే మాటవరస కడిగాను గానీ — మీరు అంతగా పట్టించుకోవాల్సినపని లేదిమాట'

'కాదే! పోనీ మాటవరసకే అడుగుతున్నా చెప్పు. రంగాజమ్మను గురించి నీ అభిప్రాయమేమిటి?'

'బావుందండీ మీరడిగేది. అభిప్రాయాలంటూ వుండటానికి ఆవిడ నాకేమవుతుందనీ — అసలు ఎక్కువ గుర్తు కూడా లేదావిడ'

'ఆనాడు చూశావుగదుటే కళ్యాణ మంటపంలో'

'ఏమో! అప్పుడే మరచి పోయాననుకోండి'

'అమ్మా! ఒక నిజం చెప్తాను నమ్ముతావా?'

'ఎందుకు నమ్మనండీ?'

'అందరూ అనుకుంటున్నట్లు — అలా పుట్టినా — చెడ్డమనిషి కాదే రంగాజమ్మ'

'మీకెలా తెలుసండీ ఆవిడ మంచి చెడ్డలు'

'బాధపడనంటే జరిగింది చెప్తాను'

'చెప్పండి'

'ఆమాట నిజమేనే సీతా! ఇన్నాళ్ళూ నీకు చెప్పలేకపోయాను. ఎలా చెప్పాలో

తెలియక నీ దగ్గర దివ్యంగా ఏ రహస్యము దాచినవాణ్ణి కాదు.'

జరిగిన కథంతా చెప్పారు రాజయ్యగారు.

చెప్పి—చివరకు 'ఏమ్మ బాధపడుతున్నావా?' అన్నారు.

'లేదండీ సమ్మతేకుండా వున్నాను'

తర్వాత మాట్లాడలేకపోయింది సీతమ్మగారు. పురుగు తాకినట్లు రక్తం విరిగింది. తల తిరిగింది.

కళ్ళు తుడుచుకుంది. మౌనంగా రోదిస్తున్న మనస్సును పగిలిపోకుండా చిక్కబట్టుకుంటూ—

'.........' సీతమ్మగారి ముఖంలోకి చూశారు రాజయ్యగారు.

భర్త ముఖంలోకి క్రొంగొత్త మనిషిని పరీక్షించి చూస్తున్నట్లు — సూటిగా చూస్తున్నది సీతమ్మగారు.

తల వంచుకున్నారు రాజయ్యగారు.

జీవితంలో మొదటిసారి భార్య చూపుల్ని భరించలేక బెదిరి చెదిరిపోయాయి ఆయన చూపులు.

పాపంలా కురుస్తున్న చీకటిని పులుముకుంటూ తిప్పిన కిటికీ తలుపును ఊడగొట్టి శబ్దం చేస్తూ గదిలో ప్రవేశించిన గాలి తాకిడికి త్రుళ్ళిపడింది సీతమ్మగారు. రాజయ్యగారి ఒంట్లో రక్తం చల్లబడ — జివ్వున లాగింది ప్రాణం.

'పడుకోనే వెర్రిదానా! నీకేం అన్యాయం జరగదులే.'

'నాకు తెలుసండీ.'

* * *

'ఏమండీ.'

గ్లాస్కో పంచ కట్టి—సిల్కు లాల్చీ తొడుక్కుని లెదరుబాగుతో ప్రయాణమై వెళ్తున్న భర్తను వెనక్కు పిలిచింది సీతమ్మగారు.

ఆగారు రాజయ్యగారు.

'ఎక్కడికి వెళ్తున్నారు?'

'పిఠాపురం.'

'నాకిష్టం లేదండీ!'

'వెళ్తున్నాను.'

దుఃఖభారాన్ని ఆపుకోలేక కుమిలిపోయింది సీతమ్మగారు.

వెనక్కు తిరిగి వచ్చి రాజయ్యగారు 'సీతా! ఏం చెయ్యను. దాన్ని చూడకుండా ఉండలేకపోతున్నానే' అన్నారు.

'నేనేం తక్కువ చేశాను మీకు?'

'ఎవరన్నా రామాట?'

'ఏం పాపం చేశాను. ఎలా భరించగలమంటారు? నేను బ్రతకలేనండీ.'

భర్త పాదాలమీదపడి రోదించింది సీతమ్మగారు. రాజయ్యగారు ప్రయాణం మానుకున్నాడు. మౌనంగా తిరిగిపోయి పందిరి మంచం మీద ఆ బట్టలతో అలాగే పడుకున్నారు. బయటకు రాలేదు. రాత్రి భోజనం చేయనంటూ అలాగే పడుకున్నారు. సీతమ్మగారి సహనం ప్రయోజనం లేకపోయింది. నాలుగు రోజులు ఆయన భోజనం చేయలేదు. భర్తను అనుసరించింది భార్య. చివరకు 'వెళ్ళిరండి. మీరు పది కాలాలపాటు చల్లగా ఉంటే అదే పదివేలు నాకు' అంది సీతమ్మగారు.

'మనస్ఫూర్తిగా అంటున్నావా సీతా?'

'కట్టుకున్న భార్య ఎంత మనస్ఫూర్తిగా అనగలదో అంత మనస్ఫూర్తిగా అన్నానండీ. నాకు తెలుసు. ఎంత పాపిష్ఠి దాన్ని కాకపోతే యిటువంటి గోడాయి బ్రతుకైపోతుంది నాది.'

భర్త పాదాలదగ్గర అలాగే పడుకుని కళ్ళు మూసుకుంది. పక్కన పడుకో మన్నారు రాజయ్యగారు. బలవంత పెట్టారు. 'నాకు యిక్కడే బావుందండీ. బ్రతికినంతకాలం ఈ మాత్రం చోటు దొరికితే చాలు నాకు' అంది ఒదిగి కాళ్ళు ముడుచుకుంటూ.


* * *

ఈ సంఘటన జరిగి యిప్పటికి మూడు నెలలు దాటిపోయినా, రంగాజమ్మ విషయం ఎన్నడూ భర్తదగ్గర ప్రస్తావించలేదు సీతమ్మగారు.

'అలా సంసారం తగలబెడుతుంటే చూస్తూ వూరుకుంటావేం వదినా? నీకు నోట్లో నాలుక లేదని, అలా దోచిపెడ్తున్నాడే. నల్లరేగడి చెరువు క్రింద ఆ నాలుగెకరాలూ బేరం పెట్టమని మళ్ళీ నీ అన్నయ్యను పురమాయించారట' అంటూ మరొకనాడు పనిగట్టుకొని వచ్చి రహస్యంగా చెప్పి హెచ్చరించింది కరణంగారి భార్య కనకమ్మగారు, బేరం కుదరగానే వచ్చిన కమీషనుతో నాన్తాడు చేయిస్తానని భర్త ఆశపెట్టిన తర్వాత.

'ఆయనకు మనం చెప్పేది ఏముంది వదినా? అన్నీ తెలిసినాయన. పొలముంటావా? ఇవాళ అమ్మితారు. రేపు కొంటారు.' అంటూ నిర్లిప్తంగా సమాధానం చెప్పి — 'మీ అమ్మాయికేమన్నా సంబంధాలు చూస్తున్నారుటమ్మా' అంటూ మాటమార్చింది సీతమ్మగారు.

మర్నాటి ఉదయం నీలాటిరేవు దగ్గర కనకమ్మగారి అధ్యక్షతన సమావేశమైన ఆ గ్రామ మహిళామండలి అమిత శ్రద్ధాసక్తులతో సీతమ్మగారి సంసారం గురించి చర్చించి, 'భగవంతుడుకూడా యింక ఆ కాపరాన్ని నిలబెట్టలేడు' అనే నిర్ణయానికివచ్చి—'తనకు యిష్టమయ్యే



మమత

తింపేస్తున్నాది సీతమ్మ మొగుణ్ణి పీని దగ్గరకు' అంటూ తిట్లు చెప్పుకుని చివరి ముక్కలమీద వాళ్ళ వ్రేళ్ళు పెట్టుకుంటూ ఉమ్మడిగా మునిగారు లేపులో.

అనతి కాలంలోనే శేషజీవితం నిష్ఫలంగా మారిన కళ్యాణంకోసం బ్రతుకుతున్న అమృతాక్షులంతా మాసిపోతున్న సీతమ్మగారి సంసారాన్ని నిలబెట్టాలనే ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

*　　　*　　　*

ఈ వార్త—

పెళ్ళలు కట్టుకుని వెళ్ళివెళ్ళి సీతమ్మగారి అన్నగారూ — మనస్ఫూర్తిగా మేనమామ—అయిన మంగపతి చెవిలోపడింది.

జమాబందీకి తాలూకా కచేరీకి పోతూ ఒకసారి పనిగట్టుకొని రాజయ్యగారింటికొచ్చి—ఒకరోజు బస చేశాడు మంగపతి.

పేలు చూసుకొని 'నిజమేనా చెల్లెమ్మా' అన్నాడు.

చిరకాలంగా దాచుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

'ఇంత జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటావా తల్లీ! ఊరూ — వాడా అంతా మొహాన ఉమ్మేస్తున్నారు సుమా. ఈ ఆస్తికూడా పోతే...'

'నేనేం చేయగలన్నయ్యా ఆడదాన్ని.'

'పోనీ — పలుగురిలో పంచాయితీ పెట్టించి నేనే అడుగుతా.'

'వద్దన్నయ్యా. అటువంటి పని మాత్రం చేయబోకు'

'నీకు తెలియదమ్మా నే చెప్తానుండు.'

'అన్నయ్యా! ఆయనకు కోపం వస్తుంది.'

'రానీ—ఏం తలగొట్టి మొలేస్తాడా?'

'నిన్ను తలగొట్టి మొలెయ్యలేరు గానీ —వద్దన్నయ్యా'

'అడుక్కు తింటాడే చివరకు రోడ్ల మీద పడి'

'అంతేసి మాట లెందుకన్నయ్యా?'

'వీడికి చివరకు కుక్కచావు తప్పదు. అరిచి చచ్చినా వీడి గడప త్రొక్కను సుమా! కుళ్ళి కుళ్ళి చావలసిందే. నేనుమాత్రం గడప తొక్కేది లేదు.'

'నీ దయ ఎలావుంటే అలాగే కానీ అన్నయ్యా! అంతా నా ఖర్మ. ఇంత కాలం పదిమందికి చెప్పిన మనిషి ఈ రోజు అద్దమైన వాళ్ళ చేతా చెప్పించుకోవలసి వస్తున్నది.'

'అతగాడు చేసిన దౌర్భాగ్యపు పనికి— రేపు అడుక్కుతినే రోజు వస్తే — బాధ పడేది మనమే అని చెబుతున్నాను'

'నువ్వేం అంత బాధ పడనవసరం లేదు బావా!' అంతకుముందే వచ్చి ప్రక్కగదిలో నిలబడి మంగపతి మాట లన్నీ విన్న రాజయ్యగారు బయటకొచ్చి తీక్షణంగ అన్నారామాట.

'కాదు బావా!'

'కాదు బావా! నువ్వనుకున్నట్లు నాకు అడుక్కుతినే రోజు వచ్చినా — నీ యింటికి వచ్చి మాత్రం ముష్టెత్తను కోనులే. అటువంటి జంగలు పెట్టుకోకుండా నువ్వు యింటికి తిరిగి పోవడం చాలా మంచిది. నేను మొరటు మనిషిని. నువ్వు పిల్లలు గల వాడివి. నీ పళ్ళు సక్రమంగా ఉండటం చాలా అవసరం. వెళ్ళు బావా. అసలే బక్క ప్రాణం నీది. అంతంతసేపు అటువంటి ఉపన్యాసాలివ్వడం నీ వంటికి మంచిది కాదు'

ఆ నాటితో అప్పటికి మంగపతి కుటుంబానికీ— రాజయ్య కుటుంబానికీ రాకపోకలు నిలిచి పోయినై.

*　　　*　　　*

ఆ తర్వాత ఒకసారి కరణంగారు స్వయంగా సీతమ్మగారి దగ్గర కొచ్చి, 'చెల్లాయమ్మగారూ! నే చెప్పినట్లు చెప్పబోకండి. దేవాలయం అర్చకులు మహదానందాచార్యులవారు కడుపులో పెట్టుకోమని రహస్యంగా నాకు చెప్పిన మాట, ఉండబట్టలేక— మీ కుటుంబం మీదున్న అభిమానం కొద్దీ మీ చెవులో వేస్తున్నాను.' అనడం జరిగింది.

ఒకానొక దొరగారు — రంగాజమ్మ కోటీలు కడుతున్న రోజుల్లోనే ప్రమిసి కస్తూరికం పెట్టారట తాంబూలంలో ఓ రవ్వల నెక్లెసుతో పాటు వెయ్యి నూటపదహార్లు పెట్టి. ఆ బొర మిసాలాయన నాకు నచ్చలేదంటూ కలాయించిందట ఊడేరిన తర్వాత రంగాజమ్మ. తుపాకి తోటా నింపి పేలుస్తానంటు మీసం దువ్వి గర్జించారట దొరవారు. 'చంపండి' అంటూ ఎదుట నిలిచిందట రంగాజమ్మ మొండికెత్తి. అంత అందగత్తెను చంపటానికి చేతులు రాక ఎప్పటికైనా మనసు మార్చుకుంటుందనే ఆశతో ఎదురుచూస్తూ 'చివరకు నేను ముసలివీనుగునైనా కోరిక తీరకుండానే కన్ను మూస్తానేమో' అనే బెంగతో మంచం పట్టారట. అదును చూసిన పడిందట రాజయ్యగారి శృంగారం. 'రాజయ్యను పట్టించండి. ఆ నాడు రంగాజమ్మ గుండెలను తీయవలసిన తోటా, ఈ నాడు ఆ రాజయ్య గుండెలను తీయాలి' అంటూ ఎదురుంచి తుపాకీలను — గుండులు తిరిగినా వాళ్ళను — రంగాజమ్మ యింటిముట్టూ కాపలా పెట్టారట.

—ఈ కథ ఎంత నిజమో పర్ణించి చెప్పటానికి అవకాశముందో — అంత వట్టులో చెప్పి 'మీ పసుపు – కుంకుమ దక్కించుకోండి చెల్లాయమ్మగారూ' అంటూ హెచ్చరించి వెళ్ళారు కరణంగారు.

ఇనప పెట్టెలో ధగ ధగ మెరుస్తున్న బాకు గుర్తొచ్చింది సీతమ్మగారికి. పిఠాపురం వెళ్ళినప్పుడల్లా రాజయ్యగారు ఆ బాకును వెంట తీసుకు పోతున్నారని అర్థం చేసుకుంది. అందుకనే ఆనాడు పిఠాపురం బయలుదేరి వస్తున్న భర్తకు ఎదురువెళ్ళి 'ఎక్కడికి వెళుతున్నారు?' అంది.

'నీకు తెలియదా?' అన్నారు రాజయ్యగారు.

'తెలుసు. ఒక్కమాట అడగాలని...'

'అడుగు'

'మీరు పిఠాపురం వెళ్ళటం నా కిష్టంలేదు'

రాజయ్యగారు ఒక క్షణం తటపటాయించి మళ్ళీ బయలుదేరుతున్నారు.

'నేను అనేది—'

'???'

'నా మనస్సు ఏదో కీడు శంకిస్తూంది. ఆ పిదపే యిక్కడకు తీసుకు రండి. నా కళ్ళముందు మీరు సుఖంగా ఉండటమే నాకు కావలసింది. ఏమండీ? నన్ను అర్థం చేసుకోరూ?'

'వెర్రిదానా'

'ఏమంటారు?' వెంట పడుతూ అడిగింది సీతమ్మగారు.

'చూద్దాం'

(ఇంకావుంది)


సౌందర్యము మరియు తాజాదనపు భావన...సింథాల్ సబ్బుతో
మీ కోసము...అపూర్వమైన సౌందర్యము, రోజంతా తాజాదనము... రెండు విధములుగా పనిచేసే సింథాల్ సబ్బుతో.
సింథాల్ లో ప్రపంచములో కెల్ల ఎంతో బాగుగా పనిచేసే క్రిమిహారి జి-11 (హెక్సాక్లోరోఫీన్) ఉంది.
జి-11 గల సింథాల్ మాత్రమే మిమ్మల్ని అందముగా తాజాగా ఉంచగలదు.
MEDIUM
CINTHOL
DEODORANT AND COMPLEXION SOAP
సింథాల్ నిజంగా దుర్గంధ నివారిణి సబ్బు

దేవుడాడని జీవిత నాటకాలు

అమల



యమునకి కోపం వచ్చింది. కొంచం కాదు. చాలా వచ్చింది. అలా చాలాసార్లు వస్తుంటుంది. వచ్చినప్పుడల్లా మూతి ముడుచు కూర్చుని ఎవ్వరితో మాట్లా కుండా సీరియస్‌గా కథ రాసేస్తుంది. రాస్తూ, రాస్తూ ఊహాలోకంలోకి వెళ్లి పోయి కోపంమాట మరచిపోతుంది. ఆ తరు వాత దాని అడ్రస్ కూడా గుర్తుండ దామెకి.

అయితే ఈ సారి యమునకి కోపం చాలా విచిత్ర పరిస్థితులలో వచ్చింది కథ రాయడం మీదకి మనసు పోవడం లేదు. అసలా ఆలోచనే లేదు బుర్రలో. ఉన్న ఆలోచనల్లా మధ్యాహ్నం వచ్చిన ఉత్తరం మీదే. ఆ ఉత్తరంలో వాక్యాలు తలచు కొన్నప్పుడల్లా నీటి మట్టంలాగ కోపం ఒక్కొ క్కడుగూ పెరుగుతుందే తప్ప రవ్వంత కూడా తగ్గడం లేదు.

'ఎంత తనకా స్వాతంత్ర్యం వుంటే మాటుకు అంతలా ఖరితెగించి, విమర్శించే

అధికారం అతని కెవరిచ్చారు. అయినా తన కథలో విమర్శించాల్సిన అంశం ఏ కోణానా లేదని ఎంతో అద్భుతంగా వుందని ఇంకా ఇలాంటి కథలే నా కలంనుంచి వెలువడాలని ఆశిస్తున్నామని పత్రికా ముఖంగా కొందరు పాఠకులు రాస్తే మొదటి కదే ఇంతా బాగా రాశావు. ఇంకెంత మంచి కథలు రాస్తావో! అని బంధువులు, స్నేహితులు మెచ్చుకుంటే తనెంత పొంగి పోయింది. భవిష్యత్తులో తనో పెద్ద రచయిత్రి అయిపోయినట్లు, ఎన్నెన్నో సన్మానాలు అందుకుంటున్నట్లు ఎన్ని బంగారు కలలు కనేసింది. హా! ఈ జన్మకీ అనుభూతి చాలు. పెళ్ళి, పెటాకులు అఖర్లేదనుకునేగా ఆనాడు ఆ సంబంధం అన్ని విధాలా నచ్చింది, వరుడు స్వయంగా మెచ్చింది, వద్దని తిరస్కరించింది. అలాంటిది ఇవ్వాళ నేనున్నానంటూ ఈ మహానుభావుడు బయల్దేరి, నువ్వు రచయిత్రిగా వుండతగవు. నీ రచనలో సహజత్వం లేదు. కథా విధానంలో పట్టు లేదు. చెత్త కథలు రాసి సాహిత్యపు విలువలు పోగొట్టే కంటే చేతులు ముడుచు కూర్చుని రామ నామ స్మరణ చేస్తే మోక్షమైనా... వగైరాలు రాసి పారేస్తాడు? ఈ పెద్దమనిషి. ఎంత సాహసం? ఒక అపరిచిత యువతికి రాసే విధానం (డైరెక్ట్‌గా) ఇదేనా.

'ఛీ! పాడు జన్మ. ఇంత బ్రతుకూ బ్రతికి రాయక రాయక రాసిన ఒక్కగా నొక్క కథవల్ల, తన వాళ్ల విమర్శలకి కూడా గురికాకుండా, అల్లారు ముద్దుగా పెరిగిన తను ముక్కూ, మొహం తెలియని వ్యక్తి చేత ఘోరంగా అవమానించబడింది. విమర్శించబడింది. ఇంతకంటే వేరే నరకం ఎక్కడా వుండదు. తిని కూర్చోలేక 'వినాశ కాలే విపరీత బుద్ధి' అని పాడు పనిచేసింది. ఇకమీద వాటి జోలికే పోకూడదు. పోతే పోయింది వెధవ కథలు పరువు తీసి నడి వీధిలో పారేసేట్లున్నాయి. రాస్తే రాసేడు అని మరిచిపోదామంటే అదీ సాధ్యం కావడం లేదే ఖర్మ! రేపు ఇంకో కథ ప్రచురిస్తే దానికి ప్రతికా ముఖంగా ఇంకా ఘోరంగా విమర్శించడని గ్యారంటీ ఏమిటి! నలుగురిలో సిగ్గుచేటు. చక్కగా బి.య్యే కంప్లీట్ చేసి ఏ ఉద్యోగమో చూచుకుంటే దర్జాగా వెళ్లిపోతాయి రోజులు' అని గట్టిగా నిర్ణయం చేసుకుంది యమున.

కోపం కాస్త ఒక్కొక్క మెట్టు దిగి చక్కా పోయింది. రావలసిన చిత్తూ, చెత్తా తీసి డెస్కులో పడేసి క్లాస్‌బుక్ పట్టు కూర్చుంది యమున, రెండు నెలల్లో రానున్న లాస్టియర్ పరీక్షలని గుర్తు చేసుకుంటూ.

వారం రోజులు గడిచాయి. యింట్లో వాళ్లందరికి ఆశ్చర్యం వేసింది యమున కథల జోలికి పోకపోవడం చూసి. ఏమని అడుగుతే దూర్వాసుడ్ని మించి పోతుందని అనుభవం వల్ల తెలిసిన వాళ్లంతా నోర్లు నొక్కుకున్నారు.

రెండునెల్లు తిరిగి పోయాయి. పరీక్షలు పూర్తయినాయి. శలవుల్లో యమున కాలేజీ స్టూడెంట్స్ జాలీగా మహాబలిపురం పిక్నిక్ పెట్టుకున్నారు. ఆడవాళ్లు పదిమందయితే మగవాళ్లు పదిహేనుమంది. అందులో కొందరికి కార్లు వుండటం వల్ల టాక్సీ యోగం పట్టలేదు.

ఎవరికి వారే టిఫిన్, ఫ్లాస్కులో కాఫీలు, ట్రాన్సిస్టర్లు, కెమెరాలు పట్టుకుని నాలుగు కార్లల్లో హాలో మంటూ బయలుదేరారు.

దారి పొడుగునా జోక్స్ విసురుకోవడాలు, ఒక కారు కంటే ఒక కారు ముందు వెళ్లిపోవడం, మధ్యలో మంచి సీనరీ వున్నదంటూ కారాపి కెమేరాలకి పని కల్పించడంతో పక్షితీర్థం చేరుకునే సరికి ఒంటిగంట దాటి పోయింది. పక్షులెళ్లి పోతాయి. అక్కడ నువ్వూ, నేనూ ముఖ ముఖాలు చూసుకోవడం తప్పించి మరేం వుండవని కొందరు చెప్పడం వల్ల, కడుపుల్లో ఆత్మారాముడు ఆవురు, ఆవురు మంటుంటే అందరూ సరేనంటే సరేననుకుని తిన్నగా మహాబలిపురం చేరుకుని టూరిస్ట్ బంగళాలో మకాం వేసారు.

హోటల్‌కి ఆర్డర్ యిచ్చి సుష్టుగా భోజనం చేసాక కాస్త సేపు విశ్రమించి లేచి టాయిలెట్ కావడం మొదలెట్టారు.

యమున లేతాకు పచ్చ నైలెక్స్ చీర, అదే రంగు బ్లౌజ్ వేసుకుని, పచ్చ బొట్టు పెట్టుకొని, అదే రంగు పొళ్ల నెక్లస్‌తో వాల్జడనిండా పూలు పెట్టుకుని వన కన్యలా తయారయి కెమేరా భుజానికి తగిలించుకుని రెడీగా బంగళా యివతలకి వచ్చి నిల్చుంది.

మగవాళ్లంతా దాదాపు ఒకరిద్దరు తప్ప మిగిలిన వాళ్లంతా సముద్ర స్నానాలకి రెండు కార్లనిండా సర్దుకున్నారు.

యమున డియరెస్ట్ ఫ్రెండ్స్ గీత, లలితా, విజయా, వాళ్లంతా మూడవ కారులో సర్దుకుని బయట నిలబడిన యమునని వాళ్లతో వెళ్లి ఒక ఆట ఆడిద్దాం, రమ్మని గొడవ చేస్తున్నారు.

'మీరెళ్లి పొండి. మిగిలిన వాళ్లతో కలసి నేను మరో కారులో వస్తాను' అని చెప్పి వాళ్లని పంపేసరికి తల ప్రాణం తోక్కి వచ్చింది యమునకి.

'ఛీ! పాడుబుద్ధులు కాకపోతే మగ వాళ్లంతా సముద్రంలో స్నానాలు చేస్తుంటే చూస్తే సిగ్గు వేయదూ! పైగా ఆట ఆడిస్తారట' అనుకుంది యమున. మూడు కార్లూ వెళ్లిపోయిన తరువాత నాల్గవ కారులో మిగిలిన వాళ్లంతా రాతి రథాలు చూడ్డానికి బయలుదేరారు. ఎండ కొద్దిగా వుండటం వల్ల కారు దిగగానే షాల్ తలమీదుగా కప్పుకుంది యమున.

ఎటు చూసినా ప్రకృతి ఎంతో రమణీయంగా కన్పిస్తోంది. ఎత్తైన కొండలూ, పచ్చని చెట్లతో, రాతి రథాలు చూస్తుంటే అలనాటి శిల్పకళా వైభవం ఎంత గొప్పదో అనిపించింది యమునకి. మాటల్లో పెట్టలేనిదీ, దేనితోనూ నిర్వచింపలేనిదీ ఈ ఆనందం అనిపించిందామెకి. రాతి ఏనుగు దగ్గర నిల్చుని సున్నితంగా రాస్తుంటే క్లిక్‌మని శబ్దం వినిపించింది యమునకి.

ఉలిక్కిపడి ఫ్రెండ్ ఎవరో అని నవ్వుకుంటూ. ముందుకి తిరిగింది.

ఎవరో యువకుడు, మరో వైపు తిరిగి యాంగిల్స్ సరి చేసుకుంటున్నాడు.

యమున హృదయం జల్లుమంది. ఆ ముఖం ఎక్కడో ఎప్పుడో చూసినట్లనిపించింది. 'కొంపదీసి తన్నుగాని ఫోటో తీయలేదుకదా! వెధవ బెడద. మైమరచి ప్రకృతిలో లీనమవ్వడానికి లేదు. ప్రతీ వారికీ హాబీ లేకపోయినా ఫోటోలు తీయడం ఒక ఫాషనైపోయింది.' అను

ఊంటూ భుజాన కెమేరా సర్దుకుంటూ అటువైపు వెళ్ళిపోయింది.

షోర్ టెంపుల్ దగ్గర దిగి చూస్తూంటే రెండు కళ్ళూ చాలవని పించింది అందరికీ. యమున గబగబా ఎన్నో యాంగిల్స్ ఫోటోలు తీయకుండా వుండలేకపోయింది. అంతకుముందే సముద్ర స్నానానికి వచ్చిన మిగతా వాళ్ళంతా వీళ్ళని చూసి చేతులూపారు.

వరగావున్న ముచ్చటైన ఎద్దుల దగ్గర స్టయిల్‌గా నిల్చుని ఫోటోలు తీసుకున్నారు.

షోర్ టెంపుల్ లోపలికెళ్ళి సముద్ర ముఖంగావున్న చిన్న ద్వారం దగ్గర నిల్చుని చూస్తుంటే ఎంతో హాయి అని పించింది అందరికీ. మిగిలినవాళ్ళంతా వెళ్ళిపోయినా రెండు నిముషాలపాటు అక్కడే నిల్చుంది యమున. మళ్ళీ క్లిక్ మంది. త్రుళ్ళిపడింది. క్రిందకి చూసింది. 'ఇందాకతనే సందేహంలేదు. ఎవరో రవుడీ అయివుండాలి. ఏం చేయనట్లు తిరిగి ఎంత దర్జాగా వెళ్ళిపోతున్నాడు, బ్రూట్ !' అనుకుంది యమున కసిగా. మనస్సంతా చికాగ్గా అయిపోయింది.

తిరిగి ఎక్కడికెళ్ళినా ఉత్సాహంగా వుల్లాసలేకపోయింది.

ఇంటికి తిరిగి వచ్చేవరకూ ఆ వైరాశ్యం విడిచిపెట్టలేదు యమున్ని.

ఒకసారి అలవాటుపడిన మనసు కథ రాయడం మీదకి పదేపదే పోతోంది.

చేయిదాటని...

హృదయంలో భావాలు పెల్లుబుకు తుంటే కాగితంమీద పెట్టలేకపోయేది.

ఏదో అజ్ఞాతశక్తి ఎందుకొచ్చిన శ్రమ, వృధా కాలయాపన! అని ఆసక్తిని అణచి వేస్తుంది.

ఈ రెండిటి సంఘర్షణ మధ్యా నలిగి పోయి ఏదో పోగొట్టుకున్నట్లు బాధ పడేది యమున.

ఆరోజు,

'పోస్ట్ !' అన్న కేక వినడంతోనే తను అప్లయిచేసిన జాబ్‌కి యింటర్వ్యూకి పిలుపువచ్చి వుంటుందనుకుంటూ రయ్యిన వీధిలోకి గంతేసినంతపని చేసింది యమున. ఆముందు రోజే బి.యే. రిజల్ట్స్ వచ్చి నాయి. యమున ఫస్ట్‌న పాసయింది. అది తెలిసింది మొదలు ఎక్కడెక్కడి ఉద్యో గాలకో అప్లికేషన్ రాసి పడెయ్యడం మొదలెట్టింది. ఇంట్లో వాళ్ళెంత వారించినా వినలేదు. ఆఖరికి 'పెళ్ళీ, గిళ్ళీ చేసుకోవుటే నా కడుపున చెడ పుట్టావు కదటే!' అని తల్లి కంట తడి పెట్టినా చలించలేదు యమున. ఒక నిశ్చయానికి వచ్చిందంటే బ్రహ్మతరం కూడా కాదు యమున విషయంలో.

బరువైన రిజిస్ట్రేషన్ కవరొక్కటి యమున చేతిలోపెట్టి సంతకం చేయ మన్నాడు పోస్ట్‌మాన్. యమునకేదో అను మానం వచ్చేసింది, చాలా బరువుగా వున్న ఆ కవరు చూడ్డంతోటే. గబగబా సంతకం చేసి గదిలోకెళ్ళి చింపి లోపల కాగితం బైటకి తీసింది యమున.

దానితోపాటే బైటకివచ్చి కిందపడిన మూడు ఫోటోలు ఫక్కున నవ్వాయి.

జడుసుకున్నట్లు కెవ్వున కేక వెయ్య బోయి తమాయించుకుని గుండెలమీద చెయ్యేసుకుంది యమున.

'అవి తను మహాబలిపురం వెళ్ళి నప్పుడు ఎవరో రవుడి అనుకున్నతను తీసినవే' ద్వారం దగ్గర తన్మయంగా, రాతి ఏనుగుదగ్గర సున్నితంగా నిమురుతూ. లైట్‌హౌస్ దగ్గర చిరాగ్గా ముఖం పెట్టుకుని నిల్చుంది యమున.

చక్కని యాంగిల్స్‌లో ముచ్చటగా వున్నాయవా ఫోటోలు.

చటుక్కున వంగి అవన్నీ తీసి కవర్లో పెట్టేసింది యమున.

'ఎంత ధైర్యం. తీసిందే చాలక ఇంటికి కూడా పంపించాడే. తన అడ్రస్ ఎలా తెలిసిందతనికి. అసలేమిటి అతని ఉద్దేశ్యం' అనుకుంటూ కాగితం విప్పింది.

మిస్ యమునగారికి,

'మైగాడ్. తన పేరు కూడా తెలుసే ఇతనికి...!' ఆశ్చర్యం చంద్రమండలపు అంచుల్ని తాకింది.

'క్షమించండి నేనెవరో ఈ పాటికి గుర్తువచ్చి వుంటాను. అయినా నన్ను అంత త్వరగా మర్చిపోయి వుంటారను కోను. మూడునెలల క్రితం మీ కథ మీనొక విమర్శ రాసాను. జాబు రాయ గలిగే మనోనిబ్బరం మీకు లేదని, ఆరోజు మొదటిసారిగా, నా జీవితంలో వసంతం తొంగి చూసినరోజు మిమ్మల్ని చూడగానే గ్రహించేసాను. అందుకే అంత...ధైర్యంగా ఘాటుగా విమర్శించే అంశం మీ కథలో లేకపోయినా విమర్శించాను. ఎందుకో చెప్పమంటారా! తెలుసుకోవాలని వుంటే ఈ సాయంత్రం సరిగ్గా 5. గ. లకి మీ సాన్నిధ్యంలో వాలుతాను. ఎక్కడికీ వెళ్ళిపోకుండా నాకోసం వెయిట్ చేయగలరు.

విధిలీలలు చాలా విచిత్రమైనవని పిస్తుంది నాకు. లేకపోతే నేను మా ఫేమిలీని తీసుకుని మహాబలిపురం రావడం, అక్కడ మీరు దేవతలా ప్రత్యక్షం



కొనసాగే, నా జన్మ తరించి మీ ప్రతిబింబాన్ని నా హృదయంలోనే కాక, కెమెరాలో కూడా ప్రతిష్ఠించడం ... మీకు కోపం వచ్చేస్తుందా. ఇంతటితో ముగిస్తా.

గుడ్ బై.
శ్రీకాంత్.

ప్యారీ! ఫోటోలు చించివేయకండి కోపంతో. అవి నాకు అత్యంత ప్రీతిపాత్రమైనవి.

కాగితం మడిచి కవర్‌లో పెడుతూ హృదయంలో పొంగుతున్న ఆవేశాన్ని పైకి కక్కలేక అవస్థపడుతూ కుర్చీలో కూలబడింది యమున.

బుర్రనిండా వున్న ఆలోచనల్లా సాయంత్రం రాంపేస్తే అతిథికి ఎలాంటి శిక్ష పెట్టాలా! అనేదే.

'భగవాన్! నా నిర్ణయం ఎలాంటిదయినా, దానివల్ల నా జీవితం నవ్వులపాలు చేయకుండా కాపాడు ...' అని మౌనంగా ప్రార్థించింది యమున.

సాయంత్రం అయింది. యమున హాల్లో సోఫాకి ఆనుకుని కూర్చుని కాలు మీద కాలు వేసుకుని దర్జాగా పేపర్ ముఖానికి అడ్డం పెట్టుకుని చదివేస్తుంది. తండ్రి చెల్లెళ్ళిద్దర్నీ తీసుకుని కారులో షికారెళ్ళాడు. తల్లి లోపల ఏదో పనిలో వుంది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

యమున విసుగ్గా వాచీ చూసింది. ఐదయింది.

మరో ఐదు నిముషాలకి గుమ్మం దగ్గర బూట్ల శబ్దమైంది. యమున పేపరు అడ్డు తియ్యలేదు.

'ఊఁ! కమిన్...!' అంది హుందాగా.

శ్రీకాంత్ రెండుచేతులూ జేబుల్లో దూర్చుకుని సోఫావైపు చూస్తూ గుమ్మం దగ్గర ఆగాడు. లేతనీలం కుచ్చుపువ్వుల చీర కుచ్చెళ్ళు నేలమీద జీరాడుతున్నాయి. పేపర్ని సున్నితంగా పట్టుకున్న నాజూకైన పచ్చనివేళ్ళు కొంచెం వణుకుతున్నాయి.

చిన్నగా నవ్వుకుంటూ వచ్చి యమునకెదురుగా సోఫాలో కూర్చున్నాడు శ్రీకాంత్.

'వచ్చినవాళ్ళని ఆహ్వానించడం తెలియని ఈ ఇంటివాళ్ళ సంస్కారం చాలా గొప్పదని భావించాల్సి వస్తోంది' వ్యంగ్యం కన్నా కోపమే ఎక్కువ ధ్వనించింది అతని గొంతులో.

'ఓహో! ముక్కూ, మొహం తెలియని పరాయి ఆడపిల్లల్ని ఫోటోలు తియ్యడం, సాహసపు లోటుపాట్లేవీ తెలియకపోయినా నోటికొచ్చినట్లు విమర్శించడం సంస్కారవంతుల లక్షణం కాబోలు...' యమున లేచి పేపరు బల్లమీదకి విసిరివేసి లేచి నిల్చుని శ్రీకాంత్‌వైపు చూసింది. అంతే, మెదడు చురుగ్గా వెనక్కి పరిగెత్తి పెళ్ళిచూపుల రోజుని కళ్ళముందుంచింది. ఆ రోజు కూడా శ్రీకాంత్ అదే సోఫాలో టకప్ చేసుకుని, చిందుగా, హుందాగా చిరునవ్వు లాస్యం చేస్తున్న ముఖంతో అలానే కూర్చుని మెల్లగా కళ్ళెత్తి చూసిన తనకి కన్నులపండుగ చేసిన ఏనాటి వాస్తవం. కథల మైకంలో పడి దాన్నంతగా లక్ష్యపెట్టలేదు తను. అయితే అతనే ఇతనా! మరి ఇదంతా ఎందుకు చేసినట్టు...' యమునకి చటుక్కున సమాధానం స్ఫురించింది.

క్షణంలో ముఖం ఎర్రబడిపోయింది. నవ్వుతున్న శ్రీకాంత్ వైపు చూడకుండా లోపలికి పరిగెత్తి వచ్చేసింది.

తల్లి ఎదురుపడి 'ఎవరే అతను...?' అంది ఒకసారిచూసినా గుర్తులేక పోవడం వల్ల.

'ఏమో! నువ్వే అడుగు...' అంది యమున గదిలోకి వెళ్ళిపోతూ.

'ఎప్పుడెలా తిక్క తిరుగుతుందో తెలియని పాడుపిల్ల ...' తనని లక్ష్యపెట్టడం లేదని కోపంగా సణుక్కుంటూ వెళ్ళిపోయింది తల్లి. హాల్‌లోకి వచ్చేసరికి భర్త కారుదిగి లోపలికొస్తూ ఆ అబ్బా

బుగ్గచూసి సంతోషంగా మాట్లాడుతుం డటం చూసి ఎవరో తెలిసినవాళ్లై వుంటారనుకుని కాఫీ పెట్టించే ప్రయత్నంలో పడింది.

నాలుగు నిముషాలు గడిచిన తరువాత తల్లి ఆనందంతో చేటంతముఖం చేసు కుని తనదగ్గరికి రావడంచూసి దిండులో

చేయందాటని...

తలదాచుకుంది యమున.

గుండెలెందుకో త్వరత్వరగా కొట్టు కుంటున్నాయి.

తల్లి ఏమిటో అంటోంది. అవేవీ చెవి కెక్కడంలేదు. మరోసారి అతని ఎదురు పడాలంటేనే చెప్పలేనంత బిడియం గానూ, విచిత్రమైన భయంతో కూడిన ఆనందంగానూ వుంది యమునకి. ఊహించగా శ్రీకాంత్ అంతరంగం ఏమిటో కళ్లముందు పరిచినట్టు అర్థం అయి పోయింది.

మరో నెల గిర్రున తిరిగింది. యమునకి, శ్రీకాంత్‌తో రంగరంగ వైభవంగా వివాహం జరిగిపోయింది. పది రోజులు అత్తవారింట్లో ఆర్భాటంగా గడిచి పోయాయి, మరదళ్ల హాస్యాలతో, అత్త మామల మర్యాదలతో నాలుగు నిముషాల్లా దొర్లిపోయాయి శ్రీకాంత్‌కి. మంచి రోజు చూసి యమునని అత్తవారింటికి పంపించారు. వున్న వూళ్లోనే కనుక రాక పోకలకి ఎలాంటి ఇబ్బందీ కలగలేదు.

ఇలా వుండగా హఠాత్తుగా నూతన దంపతుల మధ్య బాంబు ప్రేలింది. ఆ విసురుకి శ్రీకాంత్ పరదేశంలోనూ, యమున స్వదేశంలోనూ వుండిపోవల్సి వచ్చింది.

శ్రీకాంత్‌కి కెమికల్ ఇంజనీరింగ్‌లో రిసెర్చికోసం విదేశ స్కాలర్‌షిప్ వచ్చింది.

యమునకి చంద్రమండలం నుంచి పాతాళంలోకి త్రోసివేసినట్టుంది. ఢీలా పడిపోయింది. శ్రీకాంత్‌కి మొదట యమునని విడిచివెళ్లడం కష్టమని పించినా, వరించి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోవడం మూర్ఖత్వమనిపించి వెళ్లడానికే నిశ్చయించుకున్నాడు.

శ్రీకాంత్ వెళ్లే రోజువరకూ అంత చనువు లేకపోవడంవల్ల అడగలేక పోయినా దాచుకోలేక అడిగేసింది యమున.

'ఇప్పుడిది కేన్సిల్ చేసుకుంటే నేం!' అని. సూట్‌కేస్ సర్దుకుంటున్న శ్రీకాంత్ లేచివచ్చి బల్లమీద చేయివేసి నిల్చున్న భార్య చేతిమీద తన చేయివేసి నొక్కుతూ ముఖంలోకి చూశాడు.

'మరి, ఈ బుద్ధి, ఆనాడు మన పెళ్లి కాకపూర్వం నేను, నిన్ను చూడ్డా నికి వచ్చినప్పుడు ఎక్కడికి పెత్తనానికి వెళ్లిందో! సాహిత్యమేనే నా సర్వస్వం మొగుడూ, బొగుడూ అక్కర్లేదంటే!' అన్నాడు. అతని కళ్లలో కొంటెతనం తొంగిచూస్తోంది. పెదాలు నవ్వుని దాచు కోలేక పోయాయి.

యమున కళ్లు క్షణంలో చెమ్మగిల్లి రెండు కన్నీటి బిందువులు బుగ్గలమీదుగా

అన్నంలోనే రకాలు

మనం సాధారణంగా అన్నంలంటే అన్నమే వండుతాం. కాని విందు భోజనాలకి పిలిచినప్పుడు, నాలుగైదు రకాల వంటకాలు వండినప్పుడు సాధారణంగా వండిన అన్నం దండుగ అవడం ప్రతి గృహిణికీ తెలిసిన సంగతే. అందుచేత అన్నం కూడా కొత్తరకాలుగా వండితే విసుగు అనిపించదు.

కడిగి వార్చిన బియ్యం కొంచెం నూనెవేసి దోరగా వేగనివ్వాలి. బియ్యానికి సరిపడిన ఉప్పువేసి వేగనివ్వాలి. బియ్యం వేగగానే అత్తెసరుకి తగినన్ని నీళ్లుపోసి ఉడకనివ్వాలి. చిన్న మంటమీద నీరంతా ఇగిరేదాకా ఉడకనివ్వాలి. జీలకర్ర వేస్తే, దాన్ని బియ్యంతోపాటే వేయించాలి. ఈ అన్నం కమ్మగా బాగుంటుంది.

ఇలాగే వేయించిన అన్నంలో — మిరియాలు, చిన్నముక్క దాల్చిన చెక్క, వేయించిన ఉల్లిపాయముక్కలు వేస్తే ఇంకో రుచి వస్తుంది. ఇలా బియ్యం వేయించి వండేటప్పుడు నీళ్లు మరీ ఎక్కువ, మరీ తక్కువ కాకుండా చూడాలి. సాధారణంగా బియ్యంమీద ఓ అంగుళం వుంటే, అత్తెసరుకి చాలు.

పార్సీలు ఇలా వేయించిన అన్నం ఇంకో రకంగా చేస్తారు. బియ్యం కడిగి వార్చి అట్టే పెట్టుకోవాలి. ఉల్లిపాయి సన్నంగా తరిగి వేయించి అట్టే పెట్టుకోవాలి. ధనియాలు, లవంగాలు, మిరియపు గింజలు చిన్న దాల్చిన చెక్క నూరి అట్టే పెట్టు కోవాలి. ఈ పొడితోపాటు ఉల్లిపాయ ముక్కలుకూడా కలుపుకొని, వాటిలో బియ్యానికి తగినన్ని నీళ్లుపోయాలి. నీరు బాగా మరుగుతూంటే తగినంత ఉప్పు వేసి, కడిగి అట్టే పెట్టు కున్న బియ్యం వేయాలి. బాగా అన్నం ఉడుకు పట్టగానే సెగ తగ్గించి నీరంతా యింకేలా నెమ్మదిగా ఉడక నివ్వాలి. ఈ అన్నానికి తగిన ఆధరువుకూడా ఒకటి ప్రత్యేకంగా చేస్తారు. బంగాళాదుంప తొక్కలు తీసి ఉడికించాలి. వాటిని బాగా కలిపి తగినంత ఉప్పు వేసుకోవాలి. అల్లం, ఉల్లిపాయి, పచ్చిమిరప కాయలు, కొత్తిమీర తరిగి ఉంచు కోవాలి. కొంచెం నూనెవేసి బాగా కాగాక, ఆవాలు, మెంతిగింజలు ఇంగువ వేసి ఆవాలు పేలాక, అల్లం మొదలైనవి వేసి కలియపెట్టాలి. ఉల్లిపాయలు దోరగా వేగాక బంగాళా దుంప ముద్దవేసి కలియపెట్టాలి. పులుపు కావలిస్తే చింతపండుపులుసు గాని, నిమ్మకాయగాని వో గరిటెడు పెరుగుగాని వేసి కలియపెట్టుకో వచ్చు. వోపిక ఉంటే బంగాళదుంప ముద్ద చిన్న చిన్న ఉండలు చేసి దోరగా వేయించి చిక్కని పెరుగులో వేసుకున్నా ఈ అన్నానికి ఆధరువుగా బాగుంటుంది.

—కె. ఆర్.

జారి శ్రీకాంత్ చేతిమీద పడ్డాయి. ఉబికి వస్తున్న దుఃఖాన్ని పంటితో బిగపెట్టి తల దించేసుకుంది యమున.

'యమూ! ఛా! ఏడుస్తున్నావా! నేనేదో సర్దాకంటే...!' శ్రీకాంత్ లాలసగా యమున చుబుకం ఎత్తి కొన గోటితో కన్నీటిని చిమ్మి వేశాడు. చేయిపట్టుకు తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టి.

'సాహిత్య సేవచేయడం తప్పని నేనను. పైగా కథలు రాసేవారిని అదృష్ట వంతులుగా భావిస్తాను. వాస్తవంలో ఎన్ని కష్టాలు పడుతున్నా, ఊహాలోకంలో విహరిస్తూ అవన్నీ కొంతసేపయినా మర్చిపోగలిగే ఈ వరం ఎంతమందికి లభిస్తోంది. అయితే ఇదే ధ్యాసలో పడి జీవన పథంలో జరిగే మార్పుల్ని త్రోసి పారేయటం నాకెందుకో నచ్చదు. ఈ విషయంలోనే కాదు, ప్రతి విషయంలోనూ అంతే. జీవితాన్ని వివిధ కోణాల నుంచి పరిశీలిస్తాను. అందులో వున్న పరమార్థాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. కష్టసుఖాల్ని సమంగా అనుభవించాలనిపిస్తుంది.' అంటాడు శ్రీకాంత్. 'బోరు కొడుతోంది కదూ! నా వేదాంతం; నీలా రచయితని కాను మరి...' అన్నాడు తిరిగి.


'లేదు...మీ వల్ల జీవిత సత్యాలు తెలుసుకోగలిగాను. అదే నాకు సంతోషంగా వుంది' అంది యమున మెరిసే కన్నులతో మనోహరంగా నవ్వుతూ.

'అందుకే. నేనొచ్చే వరకూ చక్కగా కథలు రాసి గొప్ప రచయిత్రివి కావాలి. అలాని ఏకంగా ఊహాలోకంలోనే ఉండిపోయేవ్? నాలుగు రోజులకో ఉత్తరం రాయాలి సుమా! లేకపోతే నీ డ్యూటీ నేను తీసుకోవల్సి వస్తుంది, కోప గృహంలోకి వెళ్ళడం.' అంటూ నవ్వాడు శ్రీకాంత్.

'భగవాన్. నా కళ్ళు తెరిపించి చేయిజారి పోవలసిన జీవిత మధురిమలని తిరిగి నాకు లభ్యమయ్యేటట్లు చేశావ్. చేతులెత్తి నమస్కరించడం తప్ప నేను నీకేమియ్యగలను!' యమున కనిపించని దైవానికి కృతజ్ఞతలర్పించింది. ●

రంగుల రాట్నం

జమ్మికోన వెంకటేశ్వరరావు



కురింజి

ఇదొక మొక్క. కురింజి అనేపేరు తమిళ నాడులో ఎక్కువ ప్రచారంలో ఉంది. అక్కడే కాక మన ఆంధ్రదేశం, ఇతర దక్షిణ ఇండియా అంతా కొండప్రదేశాల్లో ఇది కనబడుతుంది. తిరుపతి, జయపురం, ఊటీ, కొడైకెనాలు, పళని వంటి ప్రాంతాల్లో దీనిని చూస్తాము.

పూతపూసే కాలం దీనికి ఒక ప్రత్యేకత. సాధారణంగా అన్ని చెట్లు ప్రతిసంవత్సరం పూత పూసినట్లుగానే కొన్ని జాతులు దీనిలో కూడా. కాని మరికొన్ని, కొన్ని సంవత్సరాలకి కాని పూత పూయవు. ఆ సమయంలో అవి అసాధారణ ఆకర్షణీయం కల పుష్పసంపదను కలిగి ఉంటాయి. చెట్లు గుంపులు, గుంపులుగా విశాలమైన ప్రాంతాలను ఆక్రమించి ఉండడంవల్ల పూలసోయగాన్ని చూడవలసిందేనంటారు. సుమారు 150 సంవత్సరాల క్రితం ఊటీలో ఆ దృశ్యం చూసిన ఒక బ్రిటిషు గవర్నరు ఆనందాన్ని పట్టలేకపోయాట్ట. పైగా ఇంగ్లండులో తన భార్యకు ఉత్తరం రాస్తూ ఈ దృశ్యాన్ని నువ్వు చూడలేక పోయినందుకు నా జీవితమంతా బాధ పడుతూనే ఉంటాను అని రాశాట్ట. కాని ఇటువంటి దృశ్యం చూడాలంటే కనీసం 12 సంవత్సరాలైనా ఆగాలి. పుష్కరానికి ఒకసారి అన్నట్లు, తిరిగి 12 సంవత్సరాలు పోతేగాని పూతపూసి ఆ మనోహర దృశ్యం మనకి కనబడదు. [6 సంవత్సరాలేనని గేంబుల్ అనే అతడు రాశాడు] అంతేకాక పూతపూసిన చెట్లు, విత్తనాలు ఏర్పడగానే, తమ పని పూర్తి అయినట్లుగా నశించిపోతాయి. జీవితకాలంలో ఒకేసారి జీవన సాఫల్యం పొంది, తృప్తి చెందుతాయి. ఆ పూత కాలంలో సీతాకోకచిలుకలకి, తుమ్మెదలకి విపరీతమైన పని. పరపరాగ సంపర్కానికి అవి ఎంతో తోడ్పడతాయి.

శాస్త్రీయంగా కురింజి జాతిని స్ట్రొబిలాంతసు కుంతియానసు అంటారు. దీని పుష్పాలు చక్కని నీలివర్ణం కలిగి, గంట ఆకారంలో గుత్తులు గుత్తులుగా చూడ అతి ముచ్చటగా ఉంటాయి. తిరిగి ఆ దృశ్యం అక్కడ చూడాలంటే, పుష్కరకాలం ఆగాలని, కుతూహలం కలవారు ఆ దృశ్యవీక్షణకు పుష్పసేకరణకు ఆత్రం పడిస్తారు.

స్ట్రో. కస్పిడేటస్, స్ట్రో. సర్కారెన్సిస్, స్ట్రో. జయపోరెన్సిస్ ఆంధ్రప్రాంతం కొండల్లో ఉన్నాయి. ఇవేకాక సుమారు వందకు మించిన జాతులు దక్షిణ ఇండియాలో ఉన్నాయని అంచనా. వీటన్నిటి పుష్పాలు నీలంగా ఉండవు. తెల్లగా ఉండేవి లేత నీలి వర్ణం కలవి ఇంకా కొంచెం 'పింక్' వర్ణం కలవి ఉన్నాయి. అంతేకాక అన్నిటి పూతకాలం వేరు విధాలుగా ఉంటుంది. 15 సంవత్సరాల కొకసారి పూసేవి ఉన్నాయి. ప్రతి ఏడూ పూసేవి ఉన్నాయి. 14, 13, 12, 11, 10 అలా వేరువేరు కాలాల్లో పూసేవి ఉన్నాయి. బహుశా కొన్నిటి పూతకాలం ఆ పరిస్థితుల్ని బట్టి మారుతుందేమో కూడా. స్ట్రో. రుగోసస్ నిత్యం పుష్పాలని కలిగే ఉంటుందని అనిపిస్తుంది.

వివిధ జాతుల స్ట్రొబిలేంతస్ మొక్కల్ని వైద్యంలో ఉపయోగిస్తారు. పుండ్లకు, గాయాలకు పైపూతగా ఉపయోగిస్తారు. చక్కని పరిమళం కలిగి ఉండడంవల్ల, స్ట్రో. ఏస్సర్, స్ట్రో. లూప్యులినస్ పరిమళ ద్రవ్యాల్లోను, సబ్బుల్లోను వాడవచ్చు.

గజ్జెపూజ

[ప్రపంచంలో ఏ ఒక్కరూ చెప్పబోయే ఎంతగొప్ప విషయమైనా అంతకుముందు కనీసం మరొక్కరికైనా తెలియని విషయం అవడం కష్టం. ఎటొచ్చీ చెప్పే తీరునిబట్టి విషయం వన్నె కెక్కుతుంది.]

*   *   *

వేశ్య అనేది ఒక కులం అన్నారు. వారు తమ జీవితాన్ని భగవంతునికి అర్పించి, భగవంతుని సేవతోనే తమ జీవితాన్ని అంతం చేసుకునేవారు. వేశ్యపడుచుకు యుక్తవయస్సు రాగానే ఆమెను భగవంతునికిచ్చి శాస్త్రీయంగా వివాహం చేసేవారు. ఆమె యిక నిత్యసుమంగళి. తన గానంచేత, నాట్యంచేత భగవంతుణ్ణి ఆరాధించి తరించేది. తరాలు మారాయి. ఈ పద్ధతి కొంత మారింది. వేశ్య తన జీవితాన్ని భగవంతునికే అర్పించినా, తనను వాంఛించిన వారికి సుఖాలనిచ్చి ప్రతిఫలం తీసుకుని, ఆ ధనాన్ని తన మరణానంతరం ఆ దేవాలయానికే రాసిచ్చేది. ప్రతి ఫలంతో అయ్యే వివాహాన్ని వేశ్యకులంలో మరో పేరుతో పిలుస్తారు. అదే. . . . గజ్జెపూజ.

*   *   *

వేశ్యకులంలో పుట్టిన చంద్రముఖి సమాజంలో తను చంద్రగా నిలబడాలని మనసారా కోరుకుంది. వివాహం అనే పదంమీద పవిత్ర ఆశాసౌధాలు నిర్మించుకుంది. తను జ్ఞానం ఎరిగిన నాటినుంచి తన తల్లి కోసం యింటికి వస్తూ పోతూ వుండే ఒకే ఒక్క వ్యక్తిని తండ్రిగా తలచి ఆరాధించింది. ఆయన చనిపోయిన వార్త పాలేరు తెచ్చిననాడు శోకమూర్తిలా వున్న తల్లిని చూసి, 'అమ్మా నాన్నగారు పోయారట. కదా! చూడడానికి మనం వెళ్ళద్దా' అంది. చంద్ర తల్లి అపర్ణ తన కన్నీరు అలానే వుంచుకుని, కూతురు కన్నీరు తుడిచింది. 'లేదుతల్లీ. మనం ఆ ఛాయలకు వెళ్ళనే కూడదు. వేదనపడడానికి వేశ్య అనర్హురాలు తల్లీ. . . . అమ్మా చంద్రా. . . ఆయన నీకు జన్మనిచ్చిన తండ్రి కారమ్మా' అంది ముఖం చాటు చేసుకుంటూ.

చంద్రకు గుండె ఆగినట్లయింది. తన్ను ఆయ నన్నడూ ఆదరించని కారణం ఆమెకు తెలిసింది. తల్లి రెండు భుజాలూ పట్టుకుని, 'అమ్మా అయితే నా తండ్రి ఎవరో చెప్పవమ్మా. . . . అమ్మా. . . . అసలు నిజంగా నువ్వైనా నా తల్లివేనా. . . . కన్న తల్లివేనా చెప్పమ్మా' అంది కుదుపుతూ. అపర్ణకు దుఃఖం ఆగలేదు. 'తల్లీ, అంతమాటనకు— నేను నిన్ను నవమాసాలూ మోసి కన్న తల్లినమ్మా' అంటూ రోదించింది.

*   *   *

చిన్నతనంలో చంద్రను చేరదీసి రోజూ పూజయ్యి, తీర్థం యిచ్చేవేళ్ళకి విధిగా చంద్రకోసం ఎదురు మాడ్డం ఎదురింటి అవధానికో అలవాటయిపోయింది. ఆయన ఆదరణలో చంద్ర కన్నతండ్రి వాత్సల్యం వంటి వాత్సల్యం చూసింది. వయస్సుతోపాటు ఎదిగిన హృదయాన్ని ఆయన కొడుకు సోముకు యిచ్చింది. తనను యీ నరకం కూపంనుంచి రక్షించడానికి సోము ఒక్కడే తగినవాడని నమ్మింది. ఆనాడు సోముచెల్లెలి పెళ్ళిలో చదివిన మంత్రాలకు అవధానిగారిచేత అర్థం చెప్పించుకుని, ఆ అర్థం మననం చేసుకుని, తనను వంటరిగా కలిసిన సోముచేత ఆ మంత్రం 'ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి' అని అనిపించుకుని వివాహమయినంత మురిసి పోయింది.

*   *   *

యుక్తవయస్సు వచ్చిన చంద్రనూ చూసి ఆమె తల్లి మురిసిపోయింది. చంద్రకిక గజ్జెపూజ చేయిస్తే, యిల్లంతా 'గలగలే' అనుకుంది.

*   *   *

ఒకనాటి అర్ధరాత్రి అపర్ణ తనభర్త [!] తనకు యిచ్చిన ఫిడేలుమీద ఆయనకు యిష్టమైన పాట వాయిస్తూ మధురంగా రోదిస్తోంది. నిశిరాత్రి వీధి తలుపు ఎవరో తట్టారు. చంద్ర వెళ్ళి, తలుపు తీసింది. వయస్సు మళ్ళిన వ్యక్తి యంత్రపుబొమ్మలా లోపలకు వచ్చి, 'ఎవరునీవారు? ఏంకావాలి?' అని అడిగినా వినిపించుకోకుండా ఫిడేలువాదన ధ్వని వస్తున్నవైపు—మేడమీదికి వెళ్ళిపోయాడు. చంద్ర ఆయన్ను అనుసరించింది. ఫిడేలు వాయిస్తున్న చంద్రతల్లిని చూసి 'అపర్ణా' అన్నాడు. అపర్ణ వాద్యం ఆపి, వెనక్కు చూసింది. కన్నీటితో ఆమె కళ్ళు మెరిశాయి. 'మీరా' అంటూ ఫిడేలు పక్కనపెట్టి ఆయన కాళ్ళను పెనవేసుకుంది. చంద్రకు యిదేమీ అర్థంకాలేదు. 'అమ్మా' అంది కనీసం తల్లిఅయినా యిదేమిటో చెప్తుందని. అపర్ణ గమ్మున లేచి నిలబడికన్నీరు తుడుచుకుని, 'అమ్మా! చంద్రా, వీరేనమ్మా నీ తండ్రి, నీకు జన్మనిచ్చిన తండ్రి. నాన్నగారితో మాట్లాడుతూ వుండు నేనిప్పుడే వస్తాను' అని మేడదిగి వెళ్ళిపోయింది.

చంద్ర హృదయంలో వేయి వీణలు మ్రోగాయి, తనకు తండ్రి వున్నాడు. తన తల్లి వేశ్య కాదు. తను వేశ్యకూతురు కానే కాదు. ఆమె ఆనందానికి అంతే లేకపోయింది. తండ్రిని మంచంమీద కూర్చోపెట్టి తను ఆయన కాళ్ళవద్ద క్రింద కూర్చుంది. తననూ, తన తల్లిని లోకం ఎలా హింసిస్తున్నదీ తండ్రికి తెలియజేసింది. తన తండ్రికి సశాస్త్రీయంగా మరో వివాహం జరిగినట్లు ఆయనకు నలుగురు పిల్లలు వున్నట్లు తెలుసుకుని, 'అప్పాజీ! అంటే నాతో కలిసి మీకు ఐదుగురు పిల్లలు కదూ. . . అప్పునా...అందర్లో నేనే పెద్దదాన్ని కదు అప్పాజీ' అంది తనకుడిచేతి ఐదువేళ్ళనూ ఎడంచేత్తో అపురూపంగా నిమురుకుంటూ.

'అవునమ్మా నీతో నాకు ఐదుగురు పిల్లలు. . . అవును' అన్నాడాయన— చంద్రశేఖరం. చంద్ర మహదానందంతో తండ్రి ముఖంలోకి చూస్తూ కూర్చుంది. 'అప్పాజీ! నాకు మీరేదైనా కానుకగా యివ్వరా, మీపేరుతో దాచుకుంటాను' అంది ఆశగా. చంద్రశేఖరం వెంటనే తన వేలి వజ్రపు టుంగరం తీసి ఆమెవేలికి తొడిగాడు. చంద్ర ఆ వేలిని రెండోచేత్తో ఆనందంగా తడుముకుంది. తండ్రిని సింహద్వారంవరకూ సాగనంపి యింటికి వచ్చింది. తన ఆనందానికిక అవధులేలేవని మురిసిపోయింది. కానీ తన తల్లిమాటలే అవధులయ్యాయి.

'చంద్రా నా చేతిలో చేయి వేసి ప్రమాణం చేయి. మీ నాన్నగారు వచ్చిన విషయం, వెళ్ళిన విషయం లోకానికి తెలియకూడదు తల్లీ. మన స్వార్థం కోసం ఆయన పరువును బజార్లో వేయకూడదు. ఇప్పుడీ విషయం లోకానికి తెలిస్తే మనను ఆదరించడానికి బదులు ఆయన్ను కూడా మన స్థానానికి దిగలాగేస్తుందమ్మా! ఈ విషయం ఎవరికి చెప్పనని ప్రమాణం చేయి' అని చేయి చాపింది. చంద్ర తల్లి కేసి ఒక్కసారి చూసింది. లోకాన్ని అర్థం చేసుకోడం అలా వుంచి తన తల్లి గుండెలోతే తనకు అర్థం కాదు. గమ్మున తల్లి చేతిలో చేయివేసి చరచరా మేడ మెట్లెక్కి తన గదికి వెళ్ళిపోయింది.

*   *   *

తెల్లవారి చంద్ర సోమును కలుసుకుంది. సోము ఎప్పటిలా హుషారుగా లేడు. నవ్వలేదు. మాటాడా లేదు. అనరాని, ఊహించని మాటలన్నాడు. 'వేశ్య కూతురికి వేశ్య బుద్ధులు రావని నేననుకున్నాను. నాకు బుద్ధి లేదు. ఇంకా నయం నిన్ను పెళ్ళి చేసుకుంటానని మా అమ్మా నాన్నతో చెప్పలేదు— ఛ.... యింత ద్రోహం చేస్తావా' అంటూ చీదరించుకున్నాడు.

చంద్ర బిక్క చచ్చిపోయింది.

'సోమూ... అంత మాటనకే' అంది వినూనాతో తెలిక. 'చెప్పు. అయితే రాత్రి నీ గదిలో వున్నదెవడు! ఎవడితో కులికావు— నా కళ్ళల్లోకి చూసి చెప్పు' అన్నాడు. అతను రాత్రి తన కిటికీలోంచి చూసిన దృశ్యాన్ని చెప్పాడు. చంద్ర తల ఎత్తలేకపోయింది. 'సోమూ, ఆ సంగతి మాత్రం అడగకు. ప్లీజ్... నన్ను నమ్ము... నీతోనే ఆశాసౌధాలన్నీ నిర్మించుకున్నాను. నీకు ద్రోహం చేయలేను— చేసేదీ లేదు' అంది ఆవేదనతో. సోము యివన్నీ నమ్మే స్థితిలో లేడు. ఆమెను చీదరించుకుని యింటికి, పైకి లెక్క వెళ్ళిపోయాడు. చంద్ర వున్నూరుమని ఇంటికి చేరి, తల్లితో విషయమంతా చెప్పి, ఒక్క సోముకి 'యీ రహస్యం' చెప్పడానికి అనుమతి తీసుకుంది. ఆనందంతో కాలేజీకి వెళ్ళింది. చెట్టుక్రింద నిలబడ్డ

కన్నడ చలన చిత్ర చరిత్రలో నూతన అధ్యాయం!

తన తండ్రిని చూసి, 'అప్పాజీ: మీరు వస్తారని నాకు తెలుసు. నన్ను చూడాలనిపిస్తుంది మీకని, మీరు తప్పక వస్తారనీ తెలుసు' అంది.

చంద్రశేఖరం నిట్టూర్చాడు. అత నామెను చూడడానికే వచ్చినా వచ్చిన కారణం మాత్రం అది కాదు. 'తల్లీ అలా నీడలో కూర్చుందాము. నీతో చిన్న పనుండి వచ్చాను' అన్నాడు. ఇద్దరూ నీడలో కూర్చున్నాక, చంద్రశేఖరం ప్రారంభించాడు. 'తల్లీ: నా పెద్ద కూతురు... అదే నీ చెల్లెలికి ఓ సంబంధం చూడడానికీవూరు వచ్చాను. ఎదురింటే అవధానియింట్లో వుండగా మీ అమ్మ ఫిడేలు వాద్యం వినిపించింది. రాత్రి పూరికి పోలేక, తిరిగి వచ్చి మిమ్మల్ని కలుసుకున్నాను... అదిసరి... ఇంతకీ అసలు విషయం... అమ్మడుకు పెళ్లి నిశ్చయమయ్యింది. పెళ్లికొడుకు అవధానికొడుకు సోము.... నీకూ తెలిసి వుంటాడమ్మా' అన్నాడు.

నింగి విరిగి నెత్తిమీద పడిందేమో ననుకుంది చంద్ర. కానీ పడలేదు. ఒకవేళ పడినా తను చలించకూడదు. చంద్రశేఖరం తలవంచుకు చెప్పుకుపోతున్నాడు. చంద్ర ఏనాడో రాయి చేసుకున్న తన మనస్సు పాషాణం చేసుకుంది. 'అవును నాన్నా! సోము బంగారం లాంటి కుర్రాడు. నిజంగా చెల్లెలు అదృష్టవంతురాలు.' అంది. కంఠం వొణక్కుండా వుండడానికి ప్రతి అక్షరం ఒత్తి ఒత్తి పలుకుతూ. చంద్రశేఖరం అసలు చెప్పదల్చుకున్నది అది కాదు. ఆ విషయం 'ఎలా చెప్పను తల్లీ:' అంటూనే చెప్పాడు. చంద్ర తనను సవాలు చేస్తున్న విధిని తల్చుకుంది. తల్లి కోరిన కోరికే అక్షరాలా తండ్రి కోరాడు. తల్లి కోరిక మాత్రం స్వార్థం లేనిది. తండ్రి చేతిలో తన చేతిని వుంచి 'అప్పాజీ: అంతకన్నానా.... యీ మాత్రం దానికే మీరు నన్ను యాచిస్తున్నాను అనాలా.... అలాగే అప్పాజీ' అంది. చంద్రశేఖరం మరోసారి నిట్టూర్చాడు. ఈసారి అతని నిట్టూర్పులో తృప్తి వుంది. వస్తానమ్మా అని వెళ్లిపోయాడు. చంద్ర యింటికి వెళ్లి తల్లితో 'అమ్మా నాన్న నన్ను చూడ్డానికి కాలేజీకి వచ్చారు. అమ్మా నీకు తెలుసా... చెల్లెలి పెళ్లట. వరుడు ఎవరో తెలుసా:.. మన సోముట. మన సోమేనమ్మా' అంది నవ్వుతూ. అపర్ణ కూతురు ముఖంలోకి చూడనే లేదు. ఆమెకు తెలుసు. ఆ నవ్వు వెనుక ఒక అగ్ని పర్వతం వుంది. అది బ్రద్దలయితే తట్టుకునే శక్తి తనకు లేదు. అది పగలదనే నమ్మకా తనకు లేదు.

*　　　*　　　*

ఎదురింటి సోముకు పెళ్లి అయిపోయింది. పెళ్లి నుంచి అంతా వచ్చేశారు. సోము చెల్లెలు వచ్చి తన అన్నగారి పెళ్లికి రానందుకు ఆమెను దెప్పి, 'పోనీ, యిప్పుడైనా వస్తావా... మా వదిన్ని పరిచయం చేస్తాను' అంది. చంద్ర ఆమెతో వెళ్లి సోము భార్య— తన చెల్లెల్ని తనివితీరా చూసింది. మనసారా ఆశీర్వదించి, ఆమె చేతో పెట్టిన ఫలహారం తిని యింటికి వచ్చింది. వెళ్లినప్పుడులా వచ్చినప్పుడామె ఉస్సురు మనలేదు. నిశ్శారుగా హాలులో నించున్న కూతుర్ని చూసి, అపర్ణ భయపడింది.

'అవ్వా' అని పిలిచింది చంద్ర. 'అవ్వా' నాకు గజ్జెపూజకన్ని ఏర్పాట్లు చేయించు' అంది. అవ్వ చంద్ర ముఖంలోకి అనుమానంగా చూసింది: హేళన కాదుకదా అనుకుంది. అనేసింది కూడా. చంద్ర తల అడ్డంగా వూపి, 'హాస్యం కాదు నీ మీద ఒట్టు' అంది. అవ్వ 15 ఏళ్ళ బాలాకుమారిలా రంగంలోకి దూకింది. తలుపు చాటున అపర్ణ చెవులు మూసుకుంది. తను విన్న ముక్కలు అబద్ధమేమో, ఒకవేళసలు వినసే లేదేమో అనుకుంది. కూతుర్ని అడగాలని దగ్గరకు వెళ్ళింది. చంద్ర తల్లి ముఖంలోకి నిర్వికారంగా చూస్తూ 'అమ్మా నేను బాగా ఆలోచించే యీ నిర్ణయానికి వచ్చాను. నన్నడ్డు పెట్టకు' అంది. పగిలే అగ్నిపర్వతం మీద మూతపెట్టి ఆపడం అవివేకమని, అసాధ్యమని అపర్ణకు తెలుసు. పక్కకు తప్పుకుని కన్నీరు వత్తుకుంది.


*　　　*　　　*

గజ్జెపూజ అయిపోయింది.

భగవత్సాన్నిధ్యంలో మంగళసూత్రం ఆమె మెడలో దేముని పేరిట కట్టారు. చంద్ర తన మెడ చూసుకుంది. తనకూ వివాహం అయిపోయింది. కాలికి గజ్జె కట్టారు. భగవంతుని ముందు సశాస్త్రీయంగా పాడింది. నృత్యం చేసింది. మేళ తాళాలతో యింటికి తిరిగి వచ్చింది. గడప దాటి లోపలకు వెళితే అంతా నరకం!! తన చేత లోగడ తిరస్కరింపబడిన వో షావుకారు బిడ్డ సిద్ధంగా కూర్చున్నాడు. చంద్ర యింట్లోకి వెళ్ళి, అవ్వను పిలిచి 'అవ్వా ఎదురింటి అప్పాజీకి, అమ్మగారికి నమస్కరించి, ఆశీర్వాదం తీసుకుని వస్తాను' అంది. అవ్వో నిముషం పిల్లేదని చూసి, యిక కుదరక, 'సరి గమ్మున వెళ్ళిరా అవతల షావుకారు బాబు కూర్చున్నారు' అని హెచ్చరించింది. చంద్ర తల వూపి ఎదురింటికి వెళ్ళింది. హాల్లో తనకు తండ్రి వంటి అవధాని గారే గాక, జన్మ నిచ్చిన తండ్రి కూడా వున్నాడు. చంద్ర అవధాని గారికేసి చూస్తూ 'అప్పాజీ గజ్జెపూజ అయ్యింది. మీ ఆశీర్వాదం కోసం వచ్చాను.' అంది. అవధానిగారు భార్యని పిలిచారు. ఆమె తన కొత్తకోడలు చేత చంద్రకు బొట్టు పెట్టించి, పసుపు, కుంకుమ, తాంబూలం యిప్పించింది. చంద్ర అవధాని భార్యకు నమస్కరించి, హాల్లోకి వచ్చి ఆయనకూ నమస్కరించింది. 'అమ్మ చంద్రా! ఆయన క్కూడా నమస్కరించమ్మా, పెద్దవాడు, పిల్లలు కలవాడు— నీకు తండ్రిలాటి వాడూ' అన్నారు అవధానిగారు.

చంద్రశేఖరం ఎటూ చూడలేక వొళ్లో వున్న తన చేతుల కేసి చూసుకున్నాడు. తన పాదాల మీద తల ఆనించి మోకరిల్లిన చంద్ర తల మీద చేతులు పెట్టి నిమిరాడు. చంద్ర లేచి నిలబడి, 'వెళ్తాను అప్పాజీ' అంది. అవధాని గారు లాలనగా మందలించి, 'వెళ్లొస్తానను అమ్మా' అన్నారు. 'అలాగే అప్పాజీ వెళ్ళొస్తాను' అని, ఆ ప్రయత్నంలో గడప వరకూ వెళ్ళి నిలువునా పడిపోయింది. 'అరె' అని అరుస్తూ చంద్రశేఖరం, అవధాని గుమ్మం వేపు పరిగెత్తారు. 'అపర్ణమ్మా చంద్ర పడిపోయింది' అని అవధాని భార్య అరిచింది ఖంగారుగా. బోర్లా పడిపోయిన

(64 వ పేజీ చూడండి)



ఆవడి హెవీవెహికల్స్ ఫాక్టరీ ఆంధ్రకళా సమితి వారు ఉగాది వేడుకల మూడురోజులపాటు వైభవంగా జరుపుకున్నారు. ఉగాదినాడు కళాసమితివారిచే ప్రదర్శింపబడిన 'నటనాలయం' నాటకంలో పాల్గొన్న నటీనటులని చిత్రంలో చూడవచ్చు.

సినిమా



'విప్లవం వర్ధిల్లాలి'లో శివాజిగణేశన్, కాంచన.

రామారావు 48వ జన్మదినోత్సవం నాడు విడుదలవుతున్న చిత్రం!

హీరో రామారావుకు మే 28న 47 సంవత్సరాలు పూర్తవుతాయి. 48వ జన్మదిన సందర్భంగా భవానీ ఫిలింస్ నిర్మించిన 'మాయనిమమత' చిత్రం విడుదలవుతుంది. గత సంవత్సరం 'విచిత్ర కుటుంబం' విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడినట్లే, 'మాయని మమత' కూడా విజయవంతంగా ప్రదర్శించ గలదనిపించే విధంగా చిత్రం నిర్మితమైంది. శ్రీ బాపయ్య పంతులు నిర్మించిన 'మాయనిమమత' చిత్రంలో నాయిక సరోజాదేవి. శ్రీ కామేశ్వరరావు దర్శకత్వాన్ని చేపట్టిన ఈ సాంఘిక చిత్రంలో 'వాసవదత్త దృశ్యనాటిక' హైలైటుగా వుండగలదని వూహించబడుతోంది. ఈ చిత్రం పూర్ణాపిక్చర్స్ ద్వారా మే 28 న విడుదలవుతుంది. ఈ చిత్రంలో కనిపించే ప్రధాన పాత్రలను రామారావు, శోభన్‌బాబు, నాగభూషణం, రాజబాబు, త్యాగరాజు, ముక్కామల, సాక్షి రంగారావు, సారథి, త్రినాథ్, సరోజాదేవి, లక్ష్మి, హేమలత, రుక్మిణి, రమాప్రభలు పోషించారు



'అఖండుడు'లో గీతాంజలి, భారతి.

200 చిత్రాల హీరో

శ్రీ రామారావు 1949 లో ఈ పరిశ్రమలో అడుగు పెట్టారు. అప్పటినుండి యిప్పటివరకు వెండితెర కథానాయకుడిగా విరాజిల్లడానికి కారణం ప్రేక్షకులిస్తున్న ప్రోత్సాహమే. సాంఘికాల్లో తెర జీవితాన్ని ప్రారంభించి, జానపదల్లో బహుళ ప్రజాదరణ పొంది, పురాణ పురుష పాత్రల్లో తనకు తనే సాటి అనిపించుకుంటున్న శ్రీ ఎన్. టి. ఆర్. త్వరలోనే 200 చిత్రాల్లో నటించడాన్ని పూర్తి చేస్తారు. ఎన్టీఆర్ ఎస్టేట్స్ నిర్మిస్తున్న 'కోడలు దిద్దిన కాపురం' శ్రీ రామారావు నటిస్తున్న 200 వ చిత్రం. ఈ సందర్భంగా తెలుగు చిత్ర ప్రముఖులు కొందరు ఒక కమిటీగా యేర్పడి, శ్రీ ఎన్. టి. ఆర్ ను ఘనంగా సత్కరించడానికి నిర్ణయించారు.

ఏడురోజులు నాలుగు పాటలు నాలుగు సీన్లు చిత్రీకరణ

జగపతి ఆర్టుపిక్చర్స్‌వారి 'దసరా బుల్లోడు' చిత్రం యొక్క మొదటి షెడ్యూలు అమలాపురం సమీపాన వున్న వో కుగ్రామంలో జరిగింది. ఈ షెడ్యూలులో నాలుగు పాటలు, నాలుగు సీన్లు ఏడురోజుల్లో చిత్రీకరింపబడడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

జగపతి యూనిట్ యిప్పుడు క్రిష్ణా జిల్లా, దివితాలుకాలోని బట్లపెనమర్రు గ్రామానికి రెండు కెమెరా యూనిట్లతో, క్రేన్లతో తరలి వెళ్ళింది. మద్రాసు నుండి మారుమూలలు వున్న గ్రామాలకు క్రేన్లను మరలించడం సులభసాధ్యం కాని పని; కానీ శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారు మద్రాసు నుండి అక్కడికి క్రేన్లను పంపించడం జరిగింది. ఈ షెడ్యూలు ఏప్రిల్ 26 నుండి మే 1 వరకు జరిగింది. ఒక పాట, క్లయిమాక్సులో కొంత భాగం ఈ షెడ్యూలులో చిత్రీకరించబడింది. చిత్రంలో నటించే నటీనటులందరూ పాల్గొన్నట్లు, దర్శక నిర్మాత శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఆర్టిస్టులు, టెక్నికల్ యూనిట్ తనకు చేదోడువాదోడుగా వుంటూ, చిత్రీకరణను జయప్రదం చేస్తున్నారని వ్యక్తపరిచారు. ఈ చిత్రం చాలా భాగం కలర్‌లో నిర్మించబడుతోంది. ఈ చిత్రానికి వెంకటరత్నం ఛాయను, మహదేవన్ సంగీతాన్ని, సంజీవి కూర్పును, హీరాలాల్ నృత్యాన్ని, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని నిర్వహిస్తున్నారు. ఏడు విజయవంతమయిన చిత్రాలను నిర్మించి, నిర్మాణంలో అపారానుభవం గడించిన శ్రీ రాజేంద్రప్రసాద్ యెనిమిదవ చిత్రాన్ని డైరెక్టు చెయ్యడం ముదావహం.

నాయికకి కావలసిన లక్షణాలున్న కొత్త తార!

'అమ్మ కోసం'లో నటించిన భానురేఖకు ఫోటోజెనిక్ ఫేస్ వుంది; హీరోయిన్‌కు కావలసిన హంగు వుంది. ఆకర్షణీయమయిన కళ్లు వున్నాయి. వాచకంలో కాస్త శ్రద్ధ తీసుకుంటే, తెలుగు ప్రేక్షకుల అభిమానతార కాగల అవకాశం వుందనిపిస్తుంది. ఈమెకు హిందీ మార్కెట్టులో మంచి డిమాండ్ వున్నట్టుంది. అలా వున్నా, తెలుగు రంగంలో కూడా తన నటనను చూపెట్టి, తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందటం కూడా మంచిదే. ఈమె 'బంగారు తల్లి'లో చక్కగా నటించినట్టు, ఆ చిత్రం విడుదల అయితే ఈమెకు ఆశాజనకమయిన భవిష్యత్తు వుండగలదని 'రష్' చూసిన వాళ్లు అభిప్రాయపడుతున్నారు. పుష్పవల్లి (ఈమె తల్లి) తెలుగు తెర ధ్రువతారగా ఒకనాడు వెలుగొందింది.



'పసిడిమనసులు'లో విజయలలిత, గుమ్మడి.

నాగేశ్వరరావు వేసవి విడిది

హీరో నాగేశ్వరరావుగారిని గతవారం జెమిని స్టుడియో మేకప్‌రూమ్‌లో కలిసాను. ఆయన అప్పుడే 'వియత్నాం వీడు' తమిళచిత్రాన్ని చూచి వచ్చినట్టు చెప్పారు. ఆయన కరెక్టుగా అరుగంటలకు మేకప్‌తో ప్రొడ్యూసర్స్ కంబైన్స్ వారి కలర్ చిత్రానికి రెడీ అయ్యారు. ఆ రోజు వుదయం షూటింగులో పాల్గొన్న శ్రీ అక్కినేని మధ్యాహ్నం రెండు చిత్రాలను చూచి, ఒక్క నిమిషం కూడా విశ్రమించకుండా షూటింగుకు రావడం ఆయన క్రమశిక్షణను చాటి చెప్తుంది. ఆయనలో అలసట యే కోశాన కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కల్గించింది. కాగా పోగా నాతో గంటసేపు



'అగ్ని పరీక్ష'లో విజయనిర్మల, ఉదయలక్ష్మి మొదలైనవారు.



'పెత్తందార్లు'లో ఎన్. టి. రామారావు, విజయనిర్మల.

సినిమా

హుషారుగా అనేక విషయాలను గూర్చి చర్చించారు. 'నేను 1964 లో రిటైరు అవుదామనుకున్నాను. అంటే 20 సంవత్సరాల సినిమా జీవితంతో సన్నమాట, కానీ, అభిమానులు 1974 వరకు వదిలేట్టు లేరు. నాపై (నటనపై) ప్రేక్షకులకు మోజు తగ్గిందనిపించే సమయంలో నేనే తప్పుకుంటాను. నాకు నా పరిశ్రమలు వున్నాయిగా' అన్నారు. 'ఈమధ్య మీరు ఒక్క రోజుకూడా విశ్రాంతి తీసుకోకుండా షూటింగుల్లో పాల్గొన్నట్టున్నారే. మరి యీ ముందు రెండు నెలలకు కొన్ని రెస్టు తీసుకోరాదా ?' అని ప్రశ్నించాను. 'నేను కూడా ప్లాన్‌చేసి పెట్టాను. 'దసరా బుల్లోడు' షూటింగునుండి తిరిగి రాగానే కాశ్మీరుకు గాని, కొడైకెనాల్‌కుగాని వెళ్దామనుకుంటున్నాను. మే మాసమంతా



'విప్లవం వర్ధిల్లాలి'లో
సరస్వతి, నాగేష్.

రెస్టు తీసుకుందా మనుకుంటున్నాను.' అని సమాధాన మిచ్చారు.

* * *

'రాజ్యం పిక్చర్స్ నిర్మించిన 'గోవుల గోపన్న' చిత్రం ప్రేక్షకుల అభిమానాన్ని+ధనాన్ని అధికంగా ఆర్జించింది. ఒకటిన్నర సంవత్సరాల తర్వాత రాజ్యం పిక్చర్స్ తమ తర్వాతి చిత్రనిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీధరరావు, లక్ష్మీరాజ్యంగార్లు నిర్మిస్తున్న యీ

సినిమా డైరీ

● జగపతి ఆర్ట్సు పిక్చర్స్‌వారి 'దసరాబుల్లోడు' ఔట్‌డోర్ షూటింగు ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు దివి తాలూకాలోని బట్లపెనుమర్రు గ్రామంలో జరిగింది. శ్రీ వి బి రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో చిత్రంలో నటించే నటీ నటులందరూ పాల్గొన్నారు.

● యిన్‌డోర్ షూటింగు ఏప్రిల్ 26 న సారధి స్టుడియోలో జరిగింది. శ్రీ రంగారావు, నాగభూషణంగార్లకు సంబంధించిన సన్నివేశాలను శ్రీ రాజేంద్రప్రసాద్ చిత్రీకరించారు.

● కౌముదీ ఆర్ట్సు పిక్చర్స్‌వారి "శ్రీ కృష్ణవిజయం" షూటింగు ఏప్రిల్ 19 నుండి 25 వరకు ప్రసాద్ స్టుడియోలో జరిగింది. శ్రీ కామేశ్వరరావు దర్శకత్వంలో ఎస్వీ రంగారావు, పద్మనాభంగార్లు పాల్గొన్నారు.

● రవీంద్రా ఆర్ట్సు పిక్చర్స్‌వారి "ధర్మదాత"కు శ్రీ చలపతిరావు అధ్వర్యంలో రికార్డింగు పూర్తయింది. శ్రీ అక్కినేని ద్విపాత్రాభినయం చేసిన యీ చిత్రానికి శ్రీ సంజీవి దర్శకుడు మే 8 న లక్ష్మీ ఫిలింస్‌ద్వారా విడుదల కాగలదని తెలుస్తోంది

● శ్రీ కాంత్ ప్రొడక్షన్స్‌వారి తెలుగుచిత్రంయొక్క షూటింగు ఏప్రిల్ 15 నుండి 22 వరకు వీనస్ స్టుడియోలో జరిగింది. శ్రీ సి ఎస్ రావ్ దర్శకత్వంలో ఎన్. టి. రామారావు చలం, రామకృష్ణ, హేమలతగార్లు పాల్గొన్నారు.

● మధు పిక్చర్స్ నిర్మిస్తున్న తాజా సాంఘిక చిత్రంయొక్క షూటింగు ఏప్రిల్ 19 నుండి 22 వరకు వాహినీలో జరిగింది. ఏప్రిల్ 23 న బెంగుళూరుకు అవుట్‌డోర్ షూటింగ్స కోసం వెళ్లారు. ఈ చిత్రానికి శ్రీ బాపూ దర్శకుడు.


మజా మజాగా ఉండండి...
గోల్డ్ స్పాట్ త్రాగండి!
తాజా రుచి కోసం గోల్డ్ స్పాట్



'ఆడజన్మ'లో గీతాంజలి, జమున.

చిత్రానికి దరకుడ్ని యింకా నిర్ణయించడం జరగలేదు. ఈ చిత్రానికి భమిడిపాటి మాటలను, ఘంటసాల సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ సాంఘికంలోని ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, కాంచన, గుమ్మడి, చలం, జయలలిత, సత్యనారాయణ పోషిస్తారు. షూటింగు జూన్ రెండవవారంలో సారధి స్టుడియోలో ప్రారంభమవుతుంది.

ఏడురీళ్లు పూర్తి

ఉత్తమచిత్ర నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యిప్పటికి ఏడురీళ్లు తయారైంది. మార్చి షెడ్యూల్‌లో అంజలీదేవిపై ఒక పాటను దర్శకుడు ప్రత్యగాత్మ సారధి యిన్‌డోర్ సెట్టులో చిత్రీకరించారు.

అంజలీదేవి తన తమ్ముడు చంద్రమోహన్ను చదివించడంకోసం ఒక 'గానా బజానా'లో గాయకురాలిగా చేరి ప్రతిరోజూ తన మృదు మధురమయిన పాటతో అతిథులను మెప్పించి, డబ్బు సంపాయించేది. ఒకరోజు యధాప్రకారం ఆమె గొంతు విప్పి పాడుతూవున్న సమయంలో యిద్దరు యువకులు ఆమె పాటకు పరవశం చెంది, ఆమెను అభినందించడానికి వచ్చి, ఆమె ముఖం చూచి స్తంభించి నిశ్చలంగా నిలబడిపోయారు. ఆ యిద్దరిలో ఒక యువకుడు తప్పతాగి వున్నాడు. అతన్ని చూచి, అంజలీదేవి కంగారుగా లోనికి పరుగెత్తింది. మరొక యువకుడు ఆమెకు నచ్చచెప్పి, తన స్నేహితుడు ఒక గొప్ప కవి చంద్రుడు అని పరిచయం చేస్తాడు. ఆమె లోలోన వుప్పొంగిపోయింది. ముఖానికి ముసుగు కప్పుకుని పాడసాగింది. ఆమె పాడిన పాట మీకు తెలపాలిగా.

'ఈముసుగు తీయకు
నామోము చూడకు
ముడుగుపడిన పాత కథల
తిరగదోడకు, గురుతు చేయకు'—

ఈ పాటను ఆచార్య ఆత్రేయ భావగర్భితంగా వ్రాసారు. శ్రీ పెండ్యాల సారధ్యంలో సుశీల భావయుక్తంగా పాడింది. నిర్దేశకుడు శ్రీ ప్రత్యగాత్మ ప్రతిభావంతంగా యీపాటను చిత్రీకరించడానికి, నటి అంజలీదేవి అసాధారణ ఎక్స్‌ప్రెషన్స్ నిచ్చింది. ఈ చిత్రానికి రామకృష్ణారావు ఛాయాగ్రాహకుడు. శ్రీ కుటుంబరావు నిర్మిస్తున్న యీ చిత్రంలోని ముఖ్య భూమికలను నాగేశ్వరావు, జమున, జగ్గయ్య, అంజలిదేవి, పద్మనాభం, గీతాంజలి, రామకృష్ణ, చంద్రమోహన్, స్నేహప్రభ, అనిత, రమణారెడ్డిగార్లు ధరిస్తున్నారు. శ్రీఫిలింస్ విడుదల చేసే యీ చిత్రానికి శ్రీనివాసరావు కథను, శ్రీహరిరావు కూర్పును, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని నిర్వహిస్తున్నారు.



'జగత్ జెట్టిలు'లో వాణిశ్రీ, శోభన్ బాబు

'కొత్త హాస్య నటుడు'

తెలుగు తెరకు మరొక హాస్య నటుడు వచ్చాడు. అతడు ప్రేక్షకులకి కొత్తవాడే అయినా, సినిమా లోకానికి చిరపరిచితుడే. అతగాడు ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ కోదండపాణి తమ్ముడు వెంకన్నబాబు. ఇంతవరకు నిర్మాణ నిర్వాహకుడిగా అనేక చిత్రాలకు వెంకన్నబాబు పని చేసాడు; యింకా చేస్తున్నాడు. ఇతనికి హీరో కృష్ణ తన 'అగ్నిపరీక్ష' చిత్రంలో ఒక ప్రామినెంట్ పాత్ర నిచ్చారు. ఇచ్చినందుకు మెచ్చుకునే విధంగా వెంకన్నబాబు ఆ పాత్రను పోషించాడు. 'అగ్నిపరీక్ష' చిత్రంలో రాధాకుమారి, రావికొండలరావుగార్ల సుపుత్రుడిగా వెంకన్నబాబు నటించాడు. ఈ చిత్రంలోని యితని నటనను చూచిన చాలామంది; తమ చిత్రాల్లో కూడా హాస్య పాత్రలను యివ్వడానికి సిద్ధపడ్డారు. అలాంటి అవకాశాన్ని నటుడు, నిర్మాత అయిన శ్రీ చలం కల్పించారు.

"తెలుగు గాయకుని ఇంగ్లీషు పాట"

'మానవుడు చంద్రుడిపై వేసిన మొదటిఅడుగు' అనేడి పాటను శ్రీ పి. బి. శ్రీనివాస్ ఇంగ్లీషులో పాడారు. ఈ పాటయొక్క మొదటి రికార్డు రిలీజ్ ఫంక్షన్ హోటల్ అశోకాలో వైభవంగా జరిగింది. తమిళనాడు విద్యామంత్రి శ్రీ ఏ. ఆర్. నెడుంచెళియన్ ఈ రికార్డును ఆవిష్కరించారు. ఈ సభకు దక్షిణభారత ఫిలిం వాణిజ్యసంఘ ప్రెసిడెండు శ్రీ ఏ. ఎల్. శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. శ్రీ పి. బి. శ్రీనివాస్ గాన మాధుర్యాన్ని ఈ పాటను రికార్డు చేయించిన శ్రీ బి. రాధాకృష్ణ మ శ్రీ వి. నాగయ్య, శ్రీమతి కమల ప్రశంసిస్తూ ప్రసంగించారు.

*　　*　　*

హీరో కృష్ణ తనగదిలో యేకాంతంగా కూర్చుని, దీర్ఘాలోచనా పరుడై వుంటాడు. అప్పుడు, అక్కడికి మాష్టర్ రాము 'పలక బలపం, పెన్సిల్



'ఖడ్గవీర'లో రాజశ్రీ.

సినిమా

పుస్తకం తీసుకుని వస్తాడు. రాగానే కృష్ణకు నమస్కరిస్తూ 'మీకోసం ఎక్కడెక్కడో వెతికాను. యిక్కడ కనిపించారు'

కృష్ణ: ఏం బాబూ? దేనికి?

రాము: యిటు రండి చెపుతా అలా మంచోండి. హీరో కృష్ణవచ్చి నిలబడగానె. అతని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసాడు.

కృష్ణ: (ఆనందాశ్చర్యాలతో) ఏవిటి బాబూ యిదంతా?

రాము: ఏవిటా? నేను యివ్వాళే మొట్టమొదటిసారిగా బడికెళుతున్నాను. అందుకె మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను.

కృష్ణ: అలాగా!

రాము. ఇవిగో చూడండి, పలక, బలపం, పుస్తకం.

కృష్ణ: ఏం చదువుతావు బాబూ?

రాము: గాంధి తాతలాగా, నెహ్రూ మామలాగా, పెద్దచదువు చదువుతాను.

కృష్ణ: చదవాలిబాబూ, చదివి దేశసేవ చెయ్యాలి, నీలాంటివాళ్ళు దేశానికి కావాలి. అప్పుడు న్యాయస్థానాల్లో అన్యాయానికి తావె వుండదు.

రాము: ఓ, అలాగే... వెళ్ళొస్తా...

మీకు తెలుసా?

ప్రముఖ నటుడు దిలీప్ కుమార్ యిప్పటికి 50 చిత్రాల్లో నటించారు సిగిరెట్లును నిజ జీవితంలో కాల్చే దిలీప్ సినిమాల్లో సిగిరెట్లు కాల్చడానికి యిష్టపడరట.


నటుడు శివాజీ గణేశన్, ఎం. జి రామచంద్రన్‌తో కలిసి నటించడానికి తన కేలాటి అభ్యంతరం లేదని ప్రకటించారు. గాని, ఎం. జి ఆర్ కు శివాజీతో నటించే ఉద్దేశ్యం వుందో లేదో తెలియడం లేదు.

ప్రఖ్యాత నిర్మాత శ్రీ ఆసిఫ్ ఒకప్పుడు జూనియర్ ఆర్టిస్టుగా వుండేవారట అప్పుడు ఆయన నెల జీతం ముప్పై రూపాయలట.

నటుడు నాగేష్‌కు రసం అంటే చాలా యిష్టమట. వేడివేడి రసాన్ని మూడు నాల్గు గ్లాసులు త్రాగేస్తారట.

టాటా అంటూ మాష్టర్ రాము వెళ్ళిపోతుంటే, అతనివంకే హీరో కృష్ణ చూస్తూ వుంటాడు'. కట్' అన్నాడు దర్శకుడు కుటుంబరావు.

ఈ సన్నివేశం శ్రీ వై. వి. రావ్ నిర్మిస్తున్న 'పగసాధిస్తా' లో కనిపిస్తుంది. పూర్ణా పిక్చర్స్ ద్వారా విడుదల కానున్న ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను కృష్ణ, విజయనిర్మల, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రాజబాబు త్యాగరాజు, విజయలలిత, మణిమాల, సంధ్యారాణి, ఛాయాదేవి, అనిత, కనకదుర్గ



'ధర్మదాత'లో నాగేశ్వరరావు.

విజయభాను; మాష్టర్ రాము పోషి స్తున్నారు. ఈ చిత్రానికి అప్పలాచార్య సంభాషణలను, సత్యం సంగీతాన్ని సమకూర్చారు. శ్రీ వై. వి. రావ్ నిర్మిస్తున్న ఈ 'క్రయిం థిల్లర్'కు లాల్ ఛాయాగ్రహణాన్ని, కత్తుల గోపాలకృష్ణ సహాయ దర్శకత్వాన్ని నిర్వహించే ఈ చిత్రాన్ని శ్రీ కె. వి. ఎస్. కుటుంబరావు డైరెక్టు చేస్తున్నారు.

ఓజీ క్యారెక్టర్ యాక్టర్!

ఒకప్పుడు పరిశ్రమచే తిరస్కరింపబడ్డ శ్రీ నాగభూషణం యిప్పుడదే పరిశ్రమకు తప్పని సరయ్యారు. కారణం— ప్రేక్షకులు ఆయన్ను అభిమానించడమే. మన హీరోలకున్న ఫాలోయింగ్‌లో 75 శాతం నాగభూషణం గారికుంది. డైలాగు డెలివరీలో ఆయనకు, అయనే సాటి. పాత్రానుగుణ్యమయిన నటనకు తోడు, పాత్ర కవసరమయిన డెలివరీనేర్పు నాగభూషణంగారికి దేవుడిచ్చిన వరం. ఇప్పుడు నిర్మాణంలోవున్న చిత్రాలన్నింటిలో (దాదాపు) నాగభూషణం ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. ఈమధ్య తెనాలిలో 'రక్తకన్నీరు' నాటకం ప్రదర్శింపబడింది. ఈ నాటకానికి 12 వేల రూపాయలు వసూలయిందంటే— నాగభూషణం గారికి ప్రజాభిమానం ఎంతుందో దాన్నిబట్టే తెలుస్తుంది.

* * *

రవి ఆర్ట్సు థియేటర్స్ పేరిట నటుడు నాగభూషణం నిర్మించనున్న చిత్రానికి శ్రీ భీమసింగ్ దర్శకత్వాన్ని నిర్వహించడానికి అంగీకరించారు. ఈ చిత్రం యొక్క తమిళప్రతిని 'పావమన్నిప్పు'ను భీమసింగ్‌గారే డైరెక్టు చేసారు. తమిళంలో సిల్వర్‌జూబ్లీ జరుపుకుంది. తమిళంలో శివాజీ ధరించిన పాత్రను తెలుగులో శ్రీ ఎన్. టి. ఆర్. పోషించడానికి అంగీకరించారు. జెమినీ గణేష్ వేషాన్ని కాంతారావు ధరిస్తారు. ఎం. ఆర్. రాధా పాత్రను నాగభూషణం నిర్వహిస్తారు. ఈ చిత్రానికి పద్మరాజు సంభాషణలను, కోదండపాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. షూటింగు జులైలో ప్రారంభమవుతుంతని తెలుస్తోంది.

—శ్రీనివాస్

అభినందన సమావేశం

శ్రీ కాట్రగడ్డ శ్రీనివాస రావుగారు రాజ్యసభకి ఎన్నికైన సందర్భంగా పద్మశ్రీపిక్చర్స్ అధినేత శ్రీ పి. పుల్లయ్య అభినందన సమావేశాన్ని ఏర్పాటుచేశారు.

స్థానిక దక్షిణ భారత ఫిలిం వాణిజ్య మండలి లాన్స్‌లో ఏప్రిల్ 26 న జరిగిన ఈ సమావేశానికి శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. ఫిలిం పరిశ్రమలోని ప్రముఖులేకాక పలువురు పురప్రముఖులు కూడా ఈ సమావేశానికి విచ్చేశారు.

శ్రీయుతులు సుందర్‌లాల్ నహతా, వి. వి. మెయ్యప్ప చెట్టియార్, బ్రహ్మయ్య, బి. ఎన్. రెడ్డి, ఇంటూరి వెంకటేశ్వర రావుగార్లు శ్రీ శ్రీనివాస రావుగారిని అభినందిస్తూ ఉపన్యసించారు. శ్రీ శ్రీనివాసరావుగారు ఫిలిం పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తారని తాము ఆశిస్తున్నామని కూడా అన్నారు. సమావేశానికి విచ్చేసిన వారందరికీ శ్రీ పి. పుల్లయ్య తమ కృతజ్ఞతలని తెలియచేశారు. —(ఒ. వి.)

* * *

మదరాసు ఫిలిం పత్రికా రచయితల సంఘంవారు ఫిలిం పత్రికా రచనలో 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసిన శ్రీ కొలను బ్రహ్మానంద రావుగారికి ఏప్రిల్ 23 న స్థానిక ఉడ్‌లాండ్స్‌లో అభినందన సభ నేర్పాటుచేసి ఆయనని సన్మానించారు. శ్రీ అక్కినేని నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పత్రికా రచయితలు, ఫిలిం పరిశ్రమలోని ప్రముఖులనేకమంది విచ్చేశారు. ఈ సందర్భంగా వెలువరించిన అభినందన సంచికని శ్రీ చిత్తూరు వి. నాగయ్య ఆవిష్కరించారు. —(ఒ. వి)


* * *

ఉగాది సందర్భంలో ఢిల్లీ తెలుగు సాహితి జరిపిన సమావేశంలో సాధారణనామ సంవత్సరానికి స్వాగతం చెప్పుతూ ఆచార్య గంటిజోగి సోమయాజిగారు పద్యపఠనం కావించారు. శ్రీమతి వక్కలంక సరళ, శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావులు, ఉగాది గీతాలు పాడారు. శ్రీ అ. మురళీధర్ తన కవితను, శ్రీ గరిమెళ్ల వెంకట సీతారాం ఒక గల్పికను చదివారు.

అనంతరం తెలుగు సాహితి క్రొత్త సంవత్సర 1970—71 కార్యవర్గం ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా శ్రీ దామోదరం సంజీవయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీ గంటి జోగి సోమయాజి, కార్యదర్శిగా శ్రీ రామరాజు విద్యాసాగరరావు, ఉప కార్యదర్శిగా శ్రీ పులిగడ్డ విశ్వనాథరావు, కోశాధికారిగా శ్రీ వేమూరి ఆంజనేయ శర్మ గారలు, మరో పదిమంది సభ్యులు కల కార్యవర్గమువిన్నికయింది. (ఒ. వి.)

* * *

కొచ్చినులోని ఆంధ్రసాంస్కృతిక సంఘంవారు ఏప్రిల్ 7వ తారీఖున ఉగాది సందర్భముగా పెద్ద సమావేశము ఏర్పాటు చేసినారు. కేరళ అంతటికీ ఇక్కడ మాత్రమే ఆంధ్రసంఘము కలదు. [ఒ. వి.]



ఇటీవల హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి జరిపిన జానపద కళోత్సవాల సదస్సు సందర్భంలో ప్రసిద్ధ నటుడు ఆంధ్ర నాటకరంగ చరిత్రకారుడు శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు అకాడమి అధ్యక్షులు శ్రీ వసల సూర్యచంద్రరావుగారు ఘనంగా సన్మానించారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి మిక్కిలినేని నొసటను కుంకుమ నుంచుతున్నారు. ప్రక్కనే వసల సూర్యచంద్రరావు.

గజ్జెపూజ

(55 వ పేజీ తరువాయి)

చంద్రను అవధాని గారు లేవదీశారు. ఆమె ఏనాడో లేచే స్థితిని తప్పింది. నోట్లోంచి నెత్తురు కారుతోంది.

అగ్నిపర్వతం పగిలిపోయింది.

చంద్రశేఖరం గమ్మున ఆమె చేతి వేలు చూశాడు. వుంగరం వేలికే వుందిగాని, ఆ వుంగరంలో వజ్రం మాత్రం లేదు. ఆయన ఆవేశంలో గుండె బాదుకున్నాడు. 'తల్లీ నేను నీకు తండ్రిగా యిచ్చిన కానుక నీ ప్రాణాలే తీసిందా తల్లీ..' అని అరిచాడు.

నిజం తన్నుకు వచ్చేసింది.

అపర్ణ పరుగున వచ్చింది. కూతురి తల తన వొళ్లో పెట్టుకుని జుట్టు ప్రేమగా నిమిరింది. తను దేనికయితే భయపడిందో అది జరిగిపోయింది. యీ వేదనను తట్టుకునే శక్తి తనలో లేదు. అపర్ణ కుప్పగా కూతురి శవం ప్రక్కనే పడి ప్రాణాలు వదిలేసింది.

వారి జీవితాలతో వారు బ్రతికినన్నాళ్లూ దాగుడుమూతలు ఆడిన నిజం బయటికి వచ్చి గాడా విలువ లేనిదయిపోయింది.

* * *

యం. కె. ఇందిర అనే రచయిత్రి రాసిన కాదంబరి అనే కన్నడ నవలే గజ్జెపూజగా చిత్ర రూపం పొందింది. రాశి సహోదరులు నిర్మించిన యీ చిత్రానికి యస్. ఆర్. పుట్టన్న కనగాల్ దర్శకులు. ఆయన ప్రతిభ ప్రతి ఫ్రేములోనూ యీ చిత్రంలో కనుపిస్తుంది. తల్లి అపర్ణగా లీలావతి, కూతురు చంద్రముఖిగా కాంచన అపారమైన నటనను ప్రదర్శించారు.

కన్నడ చలనచిత్ర చరిత్రలో నూతన అధ్యాయం సృష్టించిన యీ చిత్రాన్ని ప్రభుత్వం కూడా గుర్తించి, అంతర్జాతీయ ఉత్సవాలకు పంప నిర్ణయించిందట.

—భూపతి